
ప్రాచీన హిందూ విజ్ఞాన ఘనత

ఓం విఘ్నేశ్వరాయ నమః



భరతజాతికి చైతన్య దీప్తి

"ప్రాచీన హిందూ విజ్ఞాన ఘనత"

- పోలిశెట్టి బ్రదర్స్

ఏ జాతి తన పూర్వులను స్మరించదో, ఏ జాతి తన ఉజ్జ్వల గత చరిత్రను విస్మరిస్తుందో - ఆ జాతికి భవిష్యత్తు ఉండదు. ఏ జాతి తన ధర్మ సంస్కృతీ పరంపరలను విడనాడుతుందో, ఆ జాతికి మనుగడే లేదు. కనుక ఈ పవిత్ర భారతావనిలో జన్మించిన మహనీయుల ఘనతను స్మరించుకుంటూ, గత మన వైభవాన్ని నెమరువేసుకుని స్ఫూర్తిని పొంది ఉత్తేజితులై, నవ భారత నిర్మాణానికి కంకణధారులం కావాలి మనం.

- దేశబంధు చిత్తరంజన్ దాస్.

* ముందు మాట *

"ప్రాచీన హిందూ విజ్ఞానం సృష్టిలో అత్యంత ఘనమైనదనే విషయం పరమసత్యం. అలాంటప్పుడు "ప్రాచీన హిందూ విజ్ఞాన ఘనత" అంటూ ప్రత్యేకించి ఒక పుస్తకం వ్రాయడం అవసరమంటారా?" అని కొంతమంది శ్రేయోభిలాషులు అడిగారు. నిజానికి ఆ ప్రశ్న కొంతవరకూ సమంజసమైనదే! కానీ నేటి ప్రపంచ సమాజం గతి తప్పుతున్నందున... కొన్ని యథార్థాలను జనావళి ముందు ఉంచవలసిన అగత్యం ఏర్పడింది. దుర్మార్గపు మరియూ విద్వేషపు ఎత్తుగడలవల్ల, హిందూ విజ్ఞానం మసకబారే పరిస్థితులు ముసురుకుంటున్నాయి. మనం ఇప్పటికైనా మేలుకోకపోతే, హిందూజాతి నిర్వీర్యమైపోతుంది. మన పునాదుల్ని మనం సరిగా తెలుసుకోగలిగితేనే, బ్రహ్మాండమైన భవిష్యత్తును నిర్మించుకోగలం. తమ జాతి పూర్వ ఔన్నత్యాలను గుర్తించలేని జాతి, అంతకంతకూ దిగజారి పోవడం తథ్యం. అందుకు ప్రస్తుతం మన హిందూజాతికి ఒక మేలుకొలుపు అవసరమయింది. అందుకే మా 'భారతీయ శంఖారావం' ద్వారా ఈ పుస్తకాన్ని మీ ముందుకు తీసుకొచ్చాం.

మన ప్రాచీన **హిందువుల పూర్వులు 'ఉత్తర ధ్రువ నివాసులు' (ఆ కాలాన ఉత్తరధ్రువం నివాసయోగ్యంగా ఉండేది. ఇందుకు సంబంధించిన ఇతర వివరాలకు మా 'పురాణాల్లో సైన్స్' పుస్తకం చదవండి). ఆనాటి ఉత్తరధ్రువ నివాసులనే మనం 'వేదమార్గీయులు' అని చెప్పుకుంటూ ఉంటాం. వేదాల రచన వారి కాలంలో అప్పటినుండే మొదలయింది కాబట్టి, వారికి అలా పేరు పెట్టుకున్నాం మనం. ఉత్తరధ్రువం క్రమంగా మంచుమయం కావడంతో వారంతా భూగోళ క్రింది భాగాలకు దిగుతూ వచ్చి, సింధునదీ తీరప్రాంతాలకు (భరతఖండానికి) చేరారు. మన ప్రాచీన హిందువులకు పూర్వీకులయిన ఆ వేదమార్గీయులు సృష్టిలో ప్రప్రథమ విజ్ఞానులు. ఆనాడు వారు ఆచరించిన ధర్మమే 'సనాతన ధర్మం'.**

'సర్వేజనా సుఖినో భవంతు, లోకాస్సమస్తా సుఖినోభవంతు' అంటూ అందరి సంక్షేమాన్నీ మనసారా కోరుకునే మహత్తర తత్త్వవేత్తలు వారు. శాంతికాముకులు, సాధుస్వభావులు, నిర్మలహృదయులూ అయిన వారు, తమ విజ్ఞానాన్ని సమస్త మానవాళికీ అందిస్తూ వచ్చారు. వారి కారణంగానే సృష్టిలో ప్రప్రథమంగా విజ్ఞానంతో, సంపదలతో దేదీప్యమానంగా వెలుగొందింది మన జాతి.

భరతఖండానికి దిగివచ్చిన తర్వాతకూడా వారు తమ వేదాల రచన కొనసాగించారు. అలా రూపొందిన వేదవిజ్ఞానం మొత్తాన్ని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాలనబడే 4 భాగాలుగా విభజించారు వ్యాసమహర్షి. ఈ కారణంగానే వ్యాసునికి 'వేదవ్యాసుడు' అనే పేరువచ్చింది. విజ్ఞాన భాండాగారాలైన ఈ వేదాలు, మన జాతి స్వంతం. ఋగ్వేదంలో ఖగోళవిజ్ఞానం, ఆయుర్వేదం

ఉంటాయి. యజుర్వేదంలో యజ్ఞవిధులు, జ్యోతిష, వాస్తుశాస్త్రాలు, వాణిజ్య వ్యవసాయ వివరాలు ఉంటాయి. యజుర్వేదానికి ఉపవేదం ధనుర్వేదం. పురాణ కాలంనాటి అస్త్రశస్త్రాల విషయాలు దీనిలో ఉంటాయి. ఈ ధనుర్వేదం మనకిప్పుడు లభ్యం కావడంలేదు. సామవేదంలో నృత్య, సంగీత శాస్త్రాలు, గానవిధులు, వాయిద్య వివరాలు, శిల్పం, చిత్రలేఖనం మొదలయినవి ఉంటాయి. కళలకు ప్రాధాన్యత ఇవ్వబడిన వేదం ఇది. (64 కళల శాస్త్రాల అంశాలన్నీ ఇందులో ఉంటాయి). అధర్వణ వేదంలో వైద్యశాస్త్ర వివరాలు, సామాజికశాస్త్రం, మంత్రతంత్రాల శాస్త్రాలు, వైజ్ఞానిక పరికరాలు, అస్త్రాలు, మారణాయుధాలు మొదలగు వాటికి సంబంధించిన విషయాలుంటాయి. ఇంకా ఇవన్నీకాక వేదాల్లో గణితశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, తత్త్వశాస్త్రం, తర్కశాస్త్రం, కాలమానం, కృత్రిమవర్షాలు, ఋతువులు, అగ్ని, కరెంటు, విమానయానం, అంతరిక్షయానం.... మొదలగు వాటికి చెందిన విషయాలున్నాయి. వేదాల్లో విజ్ఞానాంశాలేకాదు. సత్యం, ధర్మం, నీతి, న్యాయం, సమానత్వం, దయ, కరుణ, మానవత్వం, ధార్మికత.... ఇటువంటి ఉత్తమధర్మాలన్నీ కన్పిస్తాయి. ఇంతటి విజ్ఞానంనిండిన ఈ వేదాల్లో ప్రస్తుతంమనకు 1% మాత్రమే లభిస్తుంది. విదేశీదాడుల్లో 99% ధ్వంసం అయిపోయింది. అయినా ఇప్పుడు లభిస్తున్న 1% వేదంలోనే అనేక అద్భుత విజ్ఞానాంశాలు ఉండడం మన అదృష్టం. గర్వకారణం. మన ప్రాచీన విజ్ఞానానికి ఆధారాలుగా నిలిచిఉన్నాయవి.

వేదమార్గీయుల సంతతి కాలక్రమేణా “హిందువులు”గా పిలువబడ్డారు. వారికి ‘హిందూ’ అనే పదం ఎలా ఆపాదించబడిందో..... ఇప్పటికీ మన హిందూదేశంలోనే చాలామందికి స్పష్టంగా తెలియదు. ఇదో పెద్ద విడ్డూరం. సింధునదీ పరీవాహక ప్రాంతంలో నివసించే మన వేదమార్గీయులను, అనంతరకాలంలోని విదేశీజాతుల వారు “సింధువులు” అని వ్యవహరించేవారు. ఆ సింధువులనే పేరు క్రమంగా “హిందువులు”గా మారింది.

‘మతం’ అనేది మన జాతికి తెలియని పదం. ఇటీవల ఇతరితర దేశాల్లో జనించిన అనేక సిద్ధాంతాలకు మతాలంటూ ఏవేవో పేర్లు పెట్టుకున్నారు వారు. అత్యంత ప్రాచీనమైన సనాతన ధర్మాన్ని ఆచరించే మన జాతికి ‘హిందూమతం’ అని నామకరణం చేసింది ఆ విదేశీయులే! మతం అనే పదమే తెలియని మన జాతికి ‘హిందూమతం’ అంటూ ఒక మత నామాన్ని తగిలించేశారు. తనది హిందూమతమనీ, తానొక హిందువుననీ తెలియని హిందువులు నేటికీ మనదేశంలో కోట్లకొలదీ ఉన్నారు. (ఇంతో అంతో ఆధునిక విద్య పొందినవారికి తప్పించి, అమాయకులైన నిరక్షరాస్యులను ఎవరినైనా అడిగి చూడండి. “తాము హిందువులమనీ, తాము ఒక మతానికి చెందినవారమనీ" వారు భావించరు.

కాలక్రమేణా అనంతర కాలంలో పుట్టుకొచ్చిన విదేశీజాతులకు, మన భరతఖండ ఔన్నత్యంపై, సంపదలపై కన్ను పడింది. మన జాతిపై దండయాత్రలు, దోపిడీలు, దౌర్జన్యాలూ సాగించారు. మన పూర్వ విజ్ఞానాన్నీ, సంపదలనూ కొల్లగొట్టారు. విజ్ఞాన సంపత్తిని దోచుకున్నారు. దాచుకున్నారు. మరెంతో తగలబెట్టేశారు. 'హిందువులు", "హిందూమతం" అంటూ మనకు వివిధ నామకరణాలు చేసింది ఆ విదేశీ దోపిడీ దొంగలే! ఆ దొంగల దండయాత్రలతో, దోపిడీలు, దౌర్జన్యాలతో, దురాక్రమణలతో మన భరతఖండం నలిగిపోయింది. పూర్వ వైభవాన్ని కోల్పోయింది. భరతఖండం వివిధ దేశాలుగా విడిపోతూ వచ్చింది. చివరకు మిగిలివున్న భారతదేశం మూగబోయింది. భరతజాతి స్తబ్దుగా మారిపోయింది. గత వైభవాన్ని మరచిపోయింది. విదేశీ దుర్మార్గుల దుష్టపథకాలతో జవజీవాల్ని కోల్పోయింది. ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో లార్డ్ మెకాలే, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్రాసిన ఒక దుర్మార్గ లేఖ ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నేటికీ కనిపిస్తోంది. (1835వ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన లార్డ్‌మెకాలే ఈ దుర్మార్గ రిపోర్ట్ పంపడం జరిగింది). ఆర్యులు - ద్రావిడులు (ఆర్యులు, అనార్యులు) అంటూ ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన బూటకపు సిద్ధాంతం కూడా విదేశీ దుష్టపథకాల్లో ఒకటి! విదేశీజాతుల దుష్టపరిపాలనల్లో, మనదేశ చరిత్ర మనకే తెలియకుండా పోయింది. మన ప్రాచీన భారతీయుల విజ్ఞానం గురించి మనకు కనీస అవగాహన కూడా లేకుండా చేసేశారు విదేశీ దౌర్జన్య కారులు. మన పురాణ, చారిత్రక ఔన్నత్యాన్ని మసకబారేలా చేశారు. భారతీయుల్ని బానిసలుగా అణగద్రొక్కారు. సైన్స్ అంటే.... అది విదేశీయుల సొత్తు అనుకునే దౌర్భాగ్య పరిస్థితిని, భారతీయుల్లో నెలకొల్పగలిగారు. భారతీయులంటే విజ్ఞానం తెలియని అజ్ఞానులనీ, మూఢనమ్మకాల్లో కూరుకుపోయి.... ప్రాచీన కల్పనా జగత్తులో విహరించే చవటలనీ సృష్టించి.... ఆ విషయాన్ని తమ నక్కజిత్తుల హిప్నాటిజంతో మన జాతికి నరనరానా ఎక్కించేశారు. ఈ దుస్థితి నుండి బయట పడాలి మనం. విదేశీయుల కబంధ హస్తాల్లో నశించగా మిగిలి ఉన్న మన ప్రాచీన విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చుకోవాలి. గత కొంతకాలం నుండి ఈనాటివరకూ కొంతమంది హిందూ మహనీయులు ఈ దిశగా కృషి చేస్తుండగా.... మధ్యలో మరో అవాంతరం వచ్చి పడుతోంది. మతిచెడిన మనవారే కొంతమంది 'నాస్తికులం, హేతువాదులం, (కుహనా) లౌకికవాదులం....' అంటూ భరతజాతి పురోగతికీ, అభివృద్ధికీ అడ్డుకట్ట వేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అతి ప్రమాదకరమైన ఇంటిదొంగల మాదిరిగా, మనదేశ ప్రతిష్ఠకు మచ్చలు ఆపాదిస్తూ, విదేశీ జాతులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. ఇంటా, బయటా మన భరతజాతిపై జరుగుతున్న అత్యాచారాలను అధిగమిస్తూ,

ప్రపంచానికి ఉత్తమ మార్గదర్శనం చేయవలసిన కర్తవ్యం మనకుంది. దీనికోసం ముందుగా మన వారసత్వ పునాదుల ఔన్నత్యాన్ని తెలుసుకోగలగాలి మనం. తద్వారా సకల మానవాళికి శుభకరమైన భవిష్య మార్గాల్ని ఏర్పాటు చేయగలం. దీనికి అవసరమైన చైతన్య దిశా నిర్దేశానికే... ఈ చిరుగ్రంథ రచన.

మీ కోసం మరో ముఖ్య విషయం. సృష్టిలో విజ్ఞానం అనేది స్థూలంగా రెండురకాలు. 1) భౌతిక విజ్ఞానం 2) ఆధ్యాత్మిక విజ్ఞానం. మనం 'సైన్స్' అని చెప్పుకుంటున్న విజ్ఞానమంతా 'భౌతిక విజ్ఞానం'. పంచభూతాలు... వాటి కలయికలతో ఏర్పడిన సృష్టి.... అది కొనసాగుతున్న రీతి... వీటన్నింటికీ మూలమైన శక్తి గురించీ... మరియూ 'ప్రాణం, ఆత్మ, మనసు, బుద్ధి' మొదలయిన అంశాల గురించీ తెలియజేసేదే 'ఆధ్యాత్మిక విజ్ఞానం'. సృష్టిలో భౌతిక విజ్ఞానం కంటే, ఆధ్యాత్మిక విజ్ఞానమే అన్నింటా ఘనమైనది. విదేశీయులకు కేవలం భౌతిక విజ్ఞానం మాత్రమే తెలుసు. జీవితాలకు అతి ముఖ్యమైన ఆధ్యాత్మిక విజ్ఞానం కావాలంటే, వారంతా మన భారతదేశం వైపు పరుగులుపెడుతూ రాకతప్పదు. (ఇప్పుడు జరుగుతున్నది అదే కదా!) ఋషీశ్వరుల దేశం మనది. మనకున్న ఋషి పరంపర, సంస్కృతి.... ఏ ఇతరదేశంలోనూ కన్పించదు. ఆధ్యాత్మిక విజ్ఞానం మన ఋషీశ్వరులిచ్చిన వరప్రసాదం. అయితే ఋషీశ్వరులంటే ఎప్పుడూ ముక్కు మూసుకుని తపస్సులు చేసుకునేవారుగా మాత్రమే భావించకండి. అతి ప్రాచీన కాలపు సైంటిస్టులు, డాక్టర్లూ, ఇంజినీర్లూ వారే! మన ఋషీశ్వరులు ఆధ్యాత్మిక విజ్ఞానంతోపాటు, భౌతిక విజ్ఞానం కూడా తెలిసిన మేధావులు. వారికి భౌతిక విజ్ఞానం కూడా అనంతంగా ఉంది. ఆ విజ్ఞానాన్ని వారు వేదాల్లోనూ, పురాణేతిహాసాల్లోనూ నిక్షిప్తం చేశారు. ఆ విజ్ఞానం మొత్తమంతా నేడు లభించకపోవడం మన దురదృష్టం. లభించిన మేరకుచూసినా ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచాన మన దేశమే ఘనచరిత్ర కలిగివుంది. మన 'పతంజలి మహర్షి' అందించిన యోగా మరియూ ధ్యానాలను.. ప్రస్తుతం ప్రపంచమంతా కళ్ళకు అద్దుకుని స్వీకరించడం చూస్తున్నాం కదా! యోగా, **ధ్యానాల ద్వారా 'తపస్సు' యొక్క అద్భుతశక్తి నిరూపితమౌతోంది. తపస్సుతో మన ఋషీశ్వరులు సృష్టి రహస్యాలను ఎన్నింటినో కనుగొనగలిగారు. పంచభూతాల వివిధరకాల కలయికలతోనే విశ్వము, దానిలోని జీవ, నిర్జీవరాశులు ఏర్పడ్డాయని వారు తెలుసుకున్నారు. సృష్టిలోని అణువులో, పరమాణువులో దాగివున్న (దైవ)శక్తిని కనుగొన్నారు. మొదటిసారిగా టెస్ట్‌ట్యూబ్ బేబీల వంటివారిని తయారుచేసిన వారు వ్యాసమహర్షి. (మహాభారతంలోని కౌరవులంతా అలాంటివారే కదా!) నేటి అణుబాంబులను మించిన అస్త్రాలు (మిస్సైల్స్ వంటివి) మన పూర్వీకులకు తెలుసు. (పాశుపతాస్త్రం, బ్రహ్మాస్త్రం, నాగాస్త్రం, బ్రహ్మశిరాస్త్రం మొదలగునవి)**

మహాభారతంలో సైంధవవధ సమయాన అర్జునుడు తన పాశుపతాస్త్రాన్ని ఒక ఖండాంతరక్షిపణి మాదిరిగా వాడిన సందర్భాన్ని మనం గుర్తుచేసుకోవచ్చు. (ఈ సందర్భ వివరాలు మా "పురాణాల్లో సైన్స్" పుస్తకంలో వివరంగా చూడవచ్చు.) కణాదమహర్షి అందించిన అణు (Atom) శాస్త్రం, నేటి ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. పాణిని వ్రాసిన వ్యాకరణసూత్రాలు, నేటి మన కంప్యూటర్ పరిభాషకు ఆధారమయ్యాయి. యజ్ఞప్రయోగాలతోనూ మరియూ సంగీతంతోనూ వర్షాలను కురిపించిన ఘనులు మన ప్రాచీనులు. తమ సంగీత ప్రావీణ్యంతో దీపాలను వెలిగించిన గానగంధర్వులు వారు. కృష్ణపరమాత్మ అందించిన కర్మ సిద్ధాంతం జగద్విఖ్యాతం. మానవాళి జీవనానికీ, వ్యక్తిత్వ వికాసానికీ మార్గదర్శకంగా ప్రపంచాన అంగీకరించబడుతున్న ఏకైక గ్రంథం మన 'భగవద్గీత'. గణితశాస్త్రానికి ఆద్యులు మన ప్రాచీన హిందువులే! సైనికబలాల సంఖ్యామానాలు (అక్షౌహిణీ మొదలయినవి), గెరిల్లా యుద్ధాలు, కమెండో ఆపరేషన్స్ వంటివి మన ప్రాచీనులకు తెలుసు. 'మార్షల్ ఆర్ట్స్' అనేవి, మన హిందువుల ద్వారానే (బోధిధర్ముడు మొదలగువారి ద్వారా) ఆసియాలోని ఇతరదేశాలకు విస్తరించాయి. శృంగార శాస్త్రం (Sex Education) లో కూడా అగ్రగణ్యులు మనవారే! మన వాత్స్యాయనుని 'కామసూత్ర' గ్రంథం, ప్రపంచప్రసిద్ధి పొందింది. ఖగోళ విజ్ఞానంతో పండుగలనూ, ఆరోగ్య నియమాలతో ఆచారవ్యవహారాలనూ ఏర్పరచుకున్న ఏకైక జాతి మన హిందూ జాతి. మన ఆచార, సంస్కారాలు చాలా వివేకంతో ఏర్పరచబడి ఉంటాయి. ఉదాహరణగా 'సంధ్యావందనాన్ని' చెప్పుకోవచ్చు. సూర్యునినుండి విటమిన్ 'డి' పొందడంతోపాటూ, జలం ద్వారా సూర్యకాంతిని మనపై ప్రసరింప జేసుకుని మరింత ఆరోగ్యాన్ని పొందడం జరుగుతుంది. మానవ శరీర సంస్కారాల్లో చివరిదైన దహనసంస్కారంలో కూడా ఒక అంతరార్థం ఉంది. పంచభూతాల సమ్మేళనంగా తయారయిన శరీరాన్ని, తిరిగి పంచభూతాల్లో కలపడమే దాని పరమార్థం. మెదడుకు పదునుపెట్టగల చదరంగం ఆటను కనుగొన్నది మనవారే! వల్లవేయించడం (బట్టీయం పట్టడం), గుంజీలు తీయించడం లాంటి మన ప్రాచీన ప్రక్రియలు, అనేక శారీరక, మానసిక లాభాల్ని కలిగిస్తున్నాయని విదేశీశాస్త్రవేత్తలు ఇటీవలే కనుగొన్నారు. ఇదో విశేషమే మరి! బృహత్తర కట్టడాల విషయంలో కూడా మన ప్రాచీనులు సిద్ధహస్తులు. అత్యంత అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో దృఢమైన దేవాలయాలను నిర్మించిన ఘనత మనది. దేవాలయాల నిర్మాణానికి ప్రప్రథమంగా గ్రానైట్‌ను మనవారే ఉపయోగించారు. మనదేశంలోని బృహదీశ్వరాలయం, రామప్పదేవాలయం, కంబోడియాలోని విష్ణుదేవాలయం... మనవారి ప్రతిభకు మచ్చుతునకలు. ఆనకట్టలు, రిజర్వాయర్ల నిర్మాణాల్లో కూడా

మన పూర్వీకులు అగ్రగణ్యులు. అలనాటి రామాయణంలోని శ్రీరామసేతు, అనంతర కాలాన సౌరాష్ట్రలోని ప్రాచీన నిర్మాణాలను ఇందుకు ఉదాహరణాలుగా చెప్పుకోవచ్చు. క్రీస్తుపూర్వం నాటి నలంద, తక్షశిల, కాశీ విశ్వవిద్యాలయాలు ప్రపంచదేశాలకు కూడా విజ్ఞానాన్ని పంచాయి. మన సంస్కృతం 'మదర్ ఆఫ్ మెనీ లాంగ్వేజెస్' గా ప్రపంచప్రసిద్ధి చెందింది. నేటి మన కంప్యూటర్ పరిభాషకు సంస్కృత భాష ఉచ్చారణ, అక్షర ప్రయోగం 'ఆధునిక కంప్యూటర్ ప్రోగ్రామ్స్ (Natural Language Processing) కు, మిగతా భాషలకంటే బాగా అనుకూలం. ఎంతయినా 'దేవభాష' కదా!

ఇలా చెప్పుకుంటూ పోతే... మన ప్రాచీన హిందూ విజ్ఞానం, ఆకాశమంత ఉంటుంది. ఈపుస్తకంలో మీకు మేము అందిస్తున్నది గోరంతమాత్రమే! మీ ఆసక్తిని బట్టి, మరోసారి కొండంత అందించగలం..


సదా... మీ అభిమానాన్ని ఆశించే,

"పోలిశెట్టి బ్రదర్స్."

❊ ❊ ❊

ఆధ్యాత్మిక రంగాన మాకు ఆదర్శంగా నిలిచిన

మా పెద్దన్నయ్య



పోలిశెట్టి లక్ష్మాజీరావు గారికి

ఈ గ్రంథం అంకితం.

- రచయితలు.

❀ విషయ సూచిక ❀

విషయం	పేజీ సంఖ్య

✿ విషయ సూచిక ✿

❋ మరో 'చిన్న' మాట ❋

ఏ క్రొత్త విషయం కనుగొన్నా సరే... విదేశీయులే కనుగొనాలనీ, మనం వారివద్ద నేర్చుకుంటూ ఉంటామనే దురభిప్రాయం నేటికీ మన భారతీయుల్లో చూసి చాలా విస్మయం, విచారం కలుగుతాయి విజ్ఞులకు. ఎందుకంటే అతిప్రాచీనకాలం నుండీ మన హిందూ విజ్ఞానులు ప్రతి అంశంలోనూ విదేశీయుల కంటే ముందున్నారనే విషయాన్ని మన గ్రంథాలు ఋజువు చేస్తూనే వున్నాయి. అయినా ఎందరో విదేశీయులు "పాశ్చాత్యదేశాల విజ్ఞానమే అతి ప్రాచీనమనీ, అన్నీ వారే కనుగొన్నారనీ, వారే మన భారతీయులకు అన్నీ నేర్పారనీ" తప్పుడు చరిత్రలను సృష్టించారు. అదే నిజమని భ్రమపడే మూర్ఖులు మన దేశంలో కూడా యెందరో వున్నారు.

అలాంటివారికి కనువిప్పు కలగాలని మన పండితులెందరో ఎన్నో ఋజువులను వెలికితీసి, మన ప్రాచీన ఘనతను చాటే గ్రంథాల్ని వ్రాశారు. ఆ దిశలో మేముకూడా కొన్ని పుస్తకాలనువ్రాసి ప్రజల ముందుకు తీసుకొచ్చాం.

ఇప్పుడు మరికొన్ని ముఖ్య విశేషాలను మీ ముందుంచాలని, ఈ పుస్తక రచన చేశాం.

ఇంతవరకు వెలువడిన మా గ్రంథాల్లో....

విమానాలు, రాకెట్‌లు, టేప్‌రికార్డరు, కరెంటు, ఖనిజాలు, అనేక అస్త్రాయుధాలు, మిస్సైల్స్, సోలార్ కుక్కర్స్, స్పెర్మ్ బ్యాంకులు, నిప్పును తయారుచేయడం, యాస్టిరాయిడ్స్, కృత్రిమ వర్షాలు, టెస్ట్‌ట్యూబ్ బేబీలు,

పైగా మన మేధావులకు మనం ఇచ్చే గుర్తింపు తక్కువ. విదేశీయుల పట్ల మక్కువ యెక్కువ.

మన ప్రాచీనులు కనుగొన్న అనేక అంశాలు, విదేశీయుల ఖాతాలోకి వెళ్ళిపోయాయి. వృక్షజాతికి కూడా ప్రాణం ఉందంటూ, వృక్షాల గురించి ఎన్నో రహస్యాలను కనుగొన్న జగదీశచంద్రబోస్, రేడియోకి పునాది వేశాడనేది ఎందరికి తెలుసు? ప్రపంచంలో ప్రథమంగా రేడియో ప్రసార ప్రయోగం చేసిందాయనే! వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌కి ఆద్యుడు మన బోసుగారు. కానీ రేడియోను కనుగొన్న పేరు విదేశీయుడైన మార్కోనికి దక్కింది. మార్కోని 'జగదీశుడి సూత్రాలను' కాపీకొట్టి, రేడియోను కనుగొన్నాడని చెప్పే ఋజువులున్నాయి కూడా!!

ఆధునిక కాలంలో ప్రథమంగా విమానాన్ని తయారుచేసింది "శివరాం బాపూజీ తల్పాడే" అనే భారతీయుడు. కానీ అనంతర కాలంలో విమాన నిర్మాతలుగా 'రైట్ సోదరులకు' ఆ పేరు దక్కింది.

ఈ విధంగా వేద, పురాణకాల ఋషులేకాక, ఆధునిక కాలంలో కూడా భారతీయులు అనేక అద్భుతాలను సాధించినా, వారిపేర్లు బయటకు రాలేదు. అదే మన దౌర్భాగ్యం. అంతేకానీ ప్రస్తుతం మనదేశంలో మేధావులు లేక కాదు. సూపర్ కంప్యూటర్ "పరమ్" మన మేధావుల సృష్టే కదా! స్వంతంగా రాకెట్లు తయారుచేసి ఇతర గ్రహాలకు పంపుతున్న స్థాయిలో ఉంది మన దేశం. మరొక్కమాట.... శనిగ్రహానికి మాత్రమే రింగులున్నాయని ప్రపంచానికి తెలుసు. కానీ యురేనస్‌కి కూడా రింగులున్నాయనే విషయాన్ని 1977లో మొట్టమొదటగా కనుగొన్నది J.C. భట్టాచార్య, S. కుప్పుస్వామి అనే భారతీయులు అనే విషయం ఎందరికి తెలుసు?

13వ శతాబ్దంలో బాకెన్ రోజర్ అనే పాశ్చాత్యుడు భూతద్దం కనుగొన్నాడని చాలామంది భ్రమిస్తున్నారు. కానీ అంతకంటే కొన్నివేల యేళ్ళ ముందే అత్రి మహర్షి భూతద్దాలను వాడినట్లుగా వేదాలు చెప్తున్నాయి. అనేకరకాల భూతద్దాల గూర్చి గౌతమ మహర్షి తాను రచించిన "న్యాయ దర్శన సూత్రాల్లో" వివరించాడు. అలాగే శుశ్రుతుడు కాటరాక్ట్ వైద్యం

చేసిన మొదటి కంటివైద్య నిపుణుడు. అంతేకాదు, వైద్యరంగాన ఆపరేషన్ టెక్నిక్స్‌కి ఆద్యుడు.

ప్రస్తుత కాలంలో అనేక విదేశాలు (అగ్రదేశాలతో సహా) తమ తమ దేశాల ఉపగ్రహాలను కోట్లాది రూపాయల ఫీజు చెల్లించి, మన భారతదేశ రాకెట్‌ల ద్వారా రోదసీలోకి పంపించే స్థాయిలో వుంది మన విజ్ఞానం.

మన ప్రాచీన మేధావులు కనుగొన్న ఎన్నో అద్భుతాలను, వేల సంవత్సరాల అనంతరం తెలుసుకున్న విదేశీయులే కనిపెట్టినట్లు ఘనతను కట్టబెట్టడం ఓ ఫ్యాషనైపోయింది.

నిజానికి ఈ ఆధునిక కాలంలో విదేశీయులు కనుగొన్నట్లుగా చెప్పబడే అంశాలు, చాలావరకూ ఏనాడో ప్రాచీనకాలంలోనే మన హిందువులు కనుగొని, గ్రంథస్థం చేశారనే మాట యథార్థం.

ఆ విషయాల్ని తెలియచెప్పే కొన్ని విజ్ఞానాంశాలను అందరిముందూ ఉంచేందుకే, ఈ పుస్తకాన్ని వ్రాస్తున్నాం. దీన్ని చదివి, ఏ విషయాన్ని ఎవరు ముందుగా కనుగొన్నారనే సంగతిని మీరే గుర్తించండి.

గమనిక:- ప్రాచీన హిందూ విజ్ఞాన ఘనతను మరింతగా తెలుసుకోవాలంటే, ఈ పుస్తకానికంటే ముందు... మా రచనలైన "పురాణాల్లో సైన్సు, పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు, సులభశైలిలో వేదవిజ్ఞానం, హిందూ పండగల్లో సైన్సు" గ్రంథాల్ని ముందుగా చదవండి.

"ప్రాచీన హిందూ విజ్ఞాన ఘనత"

❋ తెలుసుకోవలసిన కొన్ని యథార్థాలు ❋

1. భూమి ఆకారం గురించి...

"భూమి ఆకారం బల్ల పరుపుగా వుందని ప్రాచీనులందరూ భావించేవారనీ, క్రీ.పూ.500లో పైథాగరస్ అనే పాశ్చాత్యుడు భూమి గుండ్రని ఆకారాన్ని కలిగివుండి, తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతుందని చెప్పాడనీ, అప్పటినుండీ భారతీయులు కూడా ఆ విషయాన్ని తెలుసుకున్నారనీ ఒక తప్పుడు చరిత్ర వ్రాశారు విదేశీయులు. దాన్ని నిజమని నమ్మిన మనవాళ్ళు, మనదేశంలోని పాఠ్యాంశాల్లో కూడా ఆ విషయాన్ని చేర్చేశారు.

భూమి గోళాకారంగా ఉందని సృష్టిలో మొట్టమొదటగా గమనించిన వారు మన ప్రాచీన హిందువులే! వేదాల్లోనే "భూగోళం" అనే ప్రస్తావన ఉందంటే, భూమి గుండ్రంగా వుందని ఆనాడే మనవారు గుర్తించారని తెలుస్తుంది. పురాణాల ద్వారా కూడా భూమి గోళాకారంగా వుందనే తెలుస్తుంది (భూమి గోళాకారమని నిరూపించే ప్రాచీన హిందూ ఋజువులు మా "పురాణాల్లో సైన్సు"లో వివరించాం చూడండి) పైథాగరస్ కంటే వందల యేళ్ళ ముందు పుట్టిన ఆర్యభట్టు కూడా, తన ఆర్యభట్టీయంలో అతి వివరంగా ఈ విషయాన్ని వ్రాశాడు. ఇక భూభ్రమణం గూర్చి కూడా ఆర్యభట్టీయంలో వివరంగా వుంది.

మనం దేవాలయాలకు వెళ్ళినప్పుడు ప్రదక్షిణలు చేసే ఆచారం ఒకటి వుంది కదా! ఆ ఆచారం యెందుకేర్పరచారో తెలుసా? సకల జీవరాశికీ ఆధారభూతమైన భూగోళాన్ని అనుకరిస్తూ, సృష్టిని సేవించే పద్ధతియే ఈ ఆచారం. భూగోళం మనకు మాతృక అనే భావన మరియు దైవసమానమైన సూర్యుని యెడల చూపించే భక్తి శ్రద్ధలు... ఈ ఆచారానికి మూలం.

భూగోళం ఆత్మప్రదక్షిణ చేస్తూనే సూర్యునిచుట్టూ ప్రదక్షిణ చేస్తుంటుంది. భూమి మాత్రమే కాదు. గ్రహాలన్నీ కూడా తమకు దైవ సమానమైన సూర్యునికి గౌరవ మర్యాదలు ఇస్తున్నట్లుగా, ఆయన చుట్టూ తిరుగుతూంటాయి. అదేవిధంగా మనం మన దైవాలకు భక్తి గౌరవాలు చూపాలని, ఈ ఆచారాన్ని నిర్దేశించారు ఋషులు. మనం గుడికి వెళ్ళి ఆత్మప్రదక్షిణం చేస్తాం. దేవుని చుట్టూ ప్రదక్షిణ చేస్తాం. ఇంకా పొర్లు ప్రదక్షిణాల పేరుతో ఆత్మప్రదక్షిణ, దైవప్రదక్షిణ కలిపి ఒకేమారు చేసే ఆచారం కూడా వుంది మనకు.

దీని ద్వారా మనం గుర్తించవలసిందేమిటంటే... సూర్యకేంద్ర సిద్ధాంతం, గ్రహాల ఆత్మభ్రమణం, సూర్యుని చుట్టూ ప్రదక్షిణం..... ఇవన్నీ యేనాడో మన ఋషీశ్వరులకు తెలుసునని గ్రహించగలగాలి.

ఇదే విషయాన్ని కృష్ణ యజుర్వేదంలో 1-6-6-5 మంత్రంలో వ్రాశారు. (వివరాలకు మా "సులభశైలిలో వేదవిజ్ఞానం"లో చూడండి).

ఇక పైథాగరస్ లేక మరో విదేశీయుడో చెప్పేవరకు మనకు భూగోళం గూర్చి తెలియదంటే ఎలా నమ్ముతాం?

ప్రప్రథమంగా ఋగ్వేదం 1-33-8లో భూమి గుండ్రంగా వుందని చెప్పబడింది. క్రీ.పూ.కాలంలో ఆర్యభట్టు, క్రీ.శ.500 ప్రాంతంలో వరాహ మిహిరుడు భూమి గోళాకారంగా వుందని ధృవపరిచారు. అదే విషయాన్ని భాస్కరుడు తన కుమార్తె లీలావతికి వివరించాడు. వీరందరూ కూడా పాశ్చాత్య శాస్త్రవేత్తలయిన కెప్లర్, కోపర్నికస్, గెలీలియో మొదలైనవారి కంటే ఎన్నో వందల యేళ్ళ పూర్వంవారే కదా!

❀❀❀

2. కాంతివేగం గురించి......

ఋగ్వేదమే ప్రపంచంలోకెల్ల ప్రాచీన గ్రంథమని, పాశ్చాత్య చరిత్రకారులే ఒప్పుకున్నారు. అలాంటి ఋగ్వేదం 1-50-4లో "యోజనానాం సహస్రేద్వే దేశతే ద్వేచయోజనే. ఏకేన నిమిషార్థేన క్రమమాణ నమోస్తుతే!"

అని వ్రాయబడిన మంత్రానికి 1/2 నిమేషంలో కాంతి, 2202 యోజనాల దూరం ప్రయాణిస్తుంది అని అర్థం.

("నిమేషం" అనగా ఆంగ్లేయులు వాడే "నిమిషం" కాదు)

ఆ లెక్కప్రకారం, కాంతివేగం సెకనుకు 1,87,500 మైళ్ళు అని తెలియవస్తుంది. ఈ లెక్క, ఆధునికుల లెక్కకు సరిపోతుంది.

(దీని పూర్తి వివరాలకు మా "పురాణాల్లో సైన్సు" చూడండి).

ఈ విధంగా వేలాది యేళ్ళ పూర్వం మనవారు కాంతివేగాన్ని కనుగొని ఉండగా, క్రీ.శ 1700లో "రీమర్" అనే విదేశీయుడు దీన్ని కనుగొన్నాడని, అనంతరం ఆ సంగతి మనకు తెలిసిందని చెప్పడంలో అర్థముందా? ఆలోచించండి.

❀ ❀ ❀

3. భూమ్యాకర్షణ శక్తి గురించి...

క్రీ.శ. 1700 నాటి వాడు 'న్యూటన్'. భూమికి ఆకర్షణశక్తి వుందని మొదట కనుగొన్న శాస్త్రవేత్తగా అతన్ని చెప్తారు పాశ్చాత్యులు. మనవారు దానికే తాళం వేస్తుంటారు. కానీ అంతకంటే 550 సం॥ పూర్వమే భాస్కరాచార్యుడు "భువన కోశం" అనే గ్రంథంలో తన కుమార్తె లీలావతికి ఈ విషయాన్ని వివరిస్తూ కొన్ని శ్లోకాలు వ్రాశాడు. ఆ శ్లోకాల ప్రకారం...

"భూమికి ఆకర్షణ శక్తి వుంది. దానితో బరువైన వస్తువులను ఆకర్షిస్తుంది. అందువల్లనే బరువైన వస్తువులన్నీ భూమిపై పడతాయి. అంటిపెట్టుకుని వుంటాయి. ఏదయినా వస్తువును అన్ని వైపులనుండీ సమాన ఆకర్షణతో లాగిపట్టినప్పుడు, ఆ వస్తువు ఎలా అయితే క్రింద పడకుండా గాలిలో నిలబడుతుందో, భూమి... తదితర గ్రహాలు పరస్పర ఆకర్షణవల్ల శూన్యంలో నిలబడి వున్నాయి" అని చెప్పాడు భాస్కరాచార్యుడు.

ఇప్పుడు చెప్పండి! భూమ్యాకర్షణ శక్తిని మొదటగా కనుగొన్నవాడు న్యూటనా? భాస్కరాచార్యుడా?

❀ ❀ ❀

4. భూమి వ్యాసం గురించి

క్రీ.పూ. 200లో ఎరాటోస్తనీస్ అనేవాడు భూమియొక్క వ్యాసాన్ని మొదటగా కనుగొన్నాడని నేటి ఆధునికులు భావిస్తున్నారు. కానీ అంతకు ముందే, ఆర్యభట్టు తన ఆర్యభట్టీయంలో భూమియొక్క వ్యాసం 1600 యోజనాలు (అనగా సుమారు 7850 మైళ్ళు) అని వ్రాశాడు. అంటే ఈ విషయానికి కూడా భారతీయులే ఆద్యులు.

❀ ❀ ❀

5. టెలిస్కోప్ సంగతి

టెలిస్కోప్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు? అనగానే అందరూ చెప్పే జవాబు "గెలీలియో" అని! కానీ ఈ గెలీలియో క్రీ.శ.1600 కాలంవాడు. అతను టెలిస్కోప్ తయారుచేసి, దాని ద్వారా గ్రహాలను పరిశీలించాడట. పాపం అప్పటివరకూ విదేశీయులెవరికీ దూరదర్శిని, గ్రహవిజ్ఞానం లేదన్నమాట.

కానీ అతిప్రాచీన గ్రంథమైన మన ఋగ్వేదం 10వ మండలం పరిశీలిస్తే.... మొదటగా దూరదర్శిని కనుగొని, దాని ద్వారా గ్రహపరిశీలన చేసింది "అత్రి మహర్షి" అని తెలుస్తుంది. ఆ దూరదర్శినికి అత్రి పెట్టిన పేరు "తురీయ బ్రహ్మ".

❀ ❀ ❀

6. సూర్యగ్రహణ పరిశోధన

"తురీయ బ్రహ్మ"తో అత్రిమహర్షి గ్రహపరిశీలనలు చేయడమే కాకుండా, సంపూర్ణ సూర్యగ్రహణ సమయంలో ఖగోళ పరిశోధనలు చేసి, సూర్యగ్రహణ విషయాన్ని వేదాల్లో నిక్షిప్తం చేశాడు. అంత వరకు సూర్యకాంతి ముసుగులో తిరుగాడే బుధగ్రహాన్ని కూడా క్రొత్తగా కనుగొన్నాడు. బుధగ్రహ పరిశీలన కూడా చేసి ఆ గ్రహ లక్షణాలను కూడా వివరిస్తూ, బుధగ్రహానికీ మన చంద్రునికీ పోలికలున్నాయని కూడా తేల్చి చెప్పాడు.

అయితే అత్రిమహర్షి కాలానికి ఎన్నో వేల సంవత్సరాల తర్వాత సూర్యగ్రహణ విషయాన్ని తెలుసుకున్నారు చైనీయులు. ఈ అంశంలో చైనీయులే ప్రథములని నేటికాలపు మూర్ఖపు నమ్మిక. సూర్య, చంద్ర గ్రహణాలకు చెందిన స్పష్టమైన వివరణలు మన ఆర్యభట్టు ఎన్నో వందల ఏళ్ళక్రితమే మనకు అందించాడు.

గ్రహణాల విషయంలో చెప్పాలంటే మన ప్రాచీన ఋషులు కంటే నేటి విదేశీయులు ఇంకా వెనుకబడే వున్నారు. ఎందుకంటే లేబొరేటరీల లోని సైంటిస్టులు తప్ప మిగిలిన వారందరూ, గ్రహణాల రాకడ సమయాలను 'సారోస్ చక్రం" ఆధారంగానే తెలుసుకుంటున్నారు. జనవరి నుండి డిశంబరు వరకు నెలలు పూర్తికాగానే, మళ్ళీ జనవరితో ఎలా మొదలు అవుతుందో అదేమాదిరిగా గ్రహణాలు కూడా కొంతకాలానికి మళ్ళీ అదే వరుసలో ఏర్పడతాయి. ఈ విషయాన్ని పాతగ్రహణ రిజిస్టర్లను పరిశీలించి, ఆ గ్రహణాల వరుస చక్రాన్ని "సారోస్" అనే పాశ్చాత్యుడు తయారుచేసాడు. అదే "సారోస్ చక్రం". దానిని మనం కేలండరు చూసి రాబోయే నెలలు, వారాలు తెలుసుకున్నట్లుగా సారోస్ చక్రం చూసి, రాగల గ్రహణాలను తెలుసుకోవచ్చు. కానీ మనం అలా గ్రుడ్డిగా ఏదో ఒక వరుసప్రకారం సాగిపోయే పద్ధతిలో లేము. మన పంచాంగం లెక్కప్రకారం రాగల గ్రహణాలు ఏ రోజున, ఏ గ్రహణం, ఎన్నిగంటలకు పడుతుంది? ఎన్నిగంటల ఎన్ని నిమిషాలకు విడుస్తుంది అనేది గుర్తిస్తాం. అయితే ఈ విషయంలో మనం లెక్కచూసే రాహు, కేతుచారం ఒక మూఢాచారమని, పాములుగా చెప్పబడే రాహు, కేతువులు లేనేలేవని, వాటిని గ్రహాలుగా నమ్ముకుని బ్రతికే హిందువులు మూర్ఖులు అనీ, మనపై ఒక నిందవేయబడింది. మనం రాహు, కేతువుల సంచారం ఆధారంగా గ్రహణాలను గుర్తించటం నిజమే! కానీ రాహు, కేతువులు గ్రహాలు కాదని, మన హిందువులకు తెలుసు. భూమి ఛాయవలన చంద్రగ్రహణం వస్తుందని, ఛాయారూపంలో అమావాస్య చంద్రుడే సూర్యగ్రహణం కలిగిస్తాడనీ తెలుసు. అందుకే రాహుకేతువులను "ఛాయాగ్రహాలు" అని మన పూర్వులు చెప్పారు. భూమి, చంద్రుడు సంచారం చేసే ప్రక్రియలో ఏర్పడే రెండు బిందువుల వద్ద సూర్యుడు గాని,

చంద్రుడు గాని చేరితే 'గ్రహణం' వస్తుంది. ఆ రెండు బిందువులనే విదేశీయులు "నాడ్స్" అంటారు. మనం వాటినే రాహు, కేతువులంటాం.

భూమి, చంద్రుల సంచారం ఆధారంగా ఈ బిందు స్థానాలు కూడా చలిస్తుంటాయి. అదే రాహు, కేతు చారం. వివిధ గ్రహచారాలతో పాటు ఈ రాహు, కేతు గ్రహచారాలనూ లెక్కవేస్తూ... ఏ రోజున ఎక్కడ రాహు, కేతువులుంటాయో తెలుసుకుని, రాగల గ్రహణాలను లెక్కించటం మన హిందువుల పద్ధతి. దీనికి రవి, చంద్ర, భూమి, రాహు, కేతు... అన్నింటి సంచారాలనూ లెక్కించాలి. అందువల్లనే గ్రహణాల సమయాన్ని నిమిషాలతో సహా చెప్పగలవు మన పంచాంగాలు. ఆ విశిష్ఠత ఇతర జాతులకు లేదు.

నిజంగా లేని గ్రహాలను (రాహు, కేతువులను), వాటి స్థానాలను, సంచారాన్ని ఊహించుకుంటూ లెక్కలు వేయగలగటం.... ప్రాచీన కాలంలోనే (వేద కాలంలోనే) సాధించారు మన హిందువులు. అది మనకు గర్వకారణం.

గ్రహణాల గురించే కాదు. రాత్రింబవళ్ళు ఎలా ఏర్పడుతున్నాయి? చంద్రకళలు యేర్పడటానికి కారణం యేమిటి? అనే విషయాలు కూడా మన వేదాల్లో వివరంగా వ్రాయబడ్డాయి. ("సులభశైలిలో వేదవిజ్ఞానం" అనే మా పుస్తకంలో చూడండి).

❀ ❀ ❀

7. పాలపుంతలో ఉన్న సూర్యకుటుంబం

మనం రాత్రివేళ ఆకాశాన్ని పరిశీలించినట్లయితే 'పాలపుంత' అనబడే నక్షత్ర సముదాయం కనిపిస్తుంది. ఈ పాలపుంత చాలా పొడవుగానూ, అక్కడక్కడ పాయలుగా విడివడినట్లుగానూ వుంటుంది. చిన్నచిన్న నక్షత్రాలతో ఏర్పడి పొడవైన బాటవలె కనిపించే ఈ పాలపుంత మృగశిర రాశివద్ద, వృశ్చికరాశి తోక మీదుగానూ స్పష్టంగా కనిపిస్తుంది. దీనినే "పాలపుంత" అంటారు. ఈ పాలపుంతలో కోటానుకోట్ల నక్షత్రాలుంటాయి. అలా ఉండడం వింతేమీ కాదు. కానీ మన సూర్యుడు కూడా, పాలపుంత మధ్యలో వున్న ఒక నక్షత్రమే! ఈ మాటమాత్రం వింతగా అనిపిస్తుంది. ఎక్కడో ఎంతో దూరానవున్న పాలపుంతలో మన సూర్యుడు, భూమి

వగైరాలున్నాయా? అని ఆశ్చర్యం కలుగుతుంది కూడా! కానీ అది నిజం!! సూర్యకుటుంబం అంతా పాలపుంతలోని అంతర్భాగమే!

ఈ విచిత్రమైన విషయాన్ని కనుగొన్న కీర్తిని క్రీ.శ.1784 ప్రాంతంలో జీవించిన 'విలియం హెర్షెల్' అనే వ్యక్తికి దారాదత్తం చేశారు. ఆధునిక విదేశీ శాస్త్రవేత్తల్లో అయితే ఈ మాట నిజం కావచ్చు. కానీ అంతకంటే వేలాది సంవత్సరాల ముందే, హిందూ ఋషులు ఈ రహస్యాన్ని గుర్తించారు. అయితే అలవాటు ప్రకారం ఈ విషయాన్ని కూడా పురాణ పరిభాషలోనే పురాణాల్లో ఇరికించి మనకు అందించారు. (మన మహర్షులు తాము కనుగొన్న అనేక విజ్ఞానాంశాలను పురాణ పరిభాషలోనూ, చమత్కారకథల రూపంలోనూ నిక్షిప్తం చేస్తూ వచ్చారు. ఏ కాలాన్నైనా సామాన్యుల సంఖ్య అధికం కావున, పదికాలాలపాటు విజ్ఞానాంశాలు జనంలో ఉండిపోవాలనే భావనతో వారు అలా చేశారు. వారి చమత్కార పురాణపరిభాషకు, చమత్కార కథలకూ అపార్థాలు కల్పించే మూర్ఖులు ఏ కాలంలోనైనా తయారయినప్పుడు... ఆనాటి మేధావులు వాటి అంతరార్థాలను వివరిస్తూ, సమాజాన్ని చైతన్యపరచవలసిన అవసరం ఉంది.)

పాలపుంతను మన వేదాల్లో, పురాణాల్లో వివిధ రకాలుగా ఋషులు వర్ణించారు. సందర్భాన్ని బట్టి దీన్నే "పాల సముద్రం" అనీ, "ఆకాశగంగ" అని, "ఆదిశేషుడనీ" రకరకాల వర్ణనలు చేశారు. ఈ పాలపుంత మధ్య మధ్య ఏడుచోట్ల పాయలుగా విడివడి వుందని గమనించిన ఋషులు ఆదిశేషుడికి ముఖ్యమైన శిరస్సులు ఏడు అని ఒక చోట నిర్ణయించగా, పాలపుంతలో వేలాది తారలున్నాయి కాబట్టి వేయితలలు గల ఆదిశేషుడని మరోచోటు వ్రాశారు.

పాలపుంతలో సూర్యుడు ఉన్నట్లుగా మనకు కూడా కనిపించే రోజుల్లో ఏకాదశి వస్తే ఆ రోజును "అనంత శయన ఏకాదశి" అనీ, ఆ మరుసటి రోజును "క్షీరాబ్ధి ద్వాదశి" అనీ పండగలుగా నిర్ణయించారు. (ప్రస్తుతం విష్వద్రేఖ స్థాన చలనం వలన ఆ రెండూ కలవడంలేదు. పూర్వం ఒకప్పుడు కలిసి వచ్చేవి) అనంతుడు అనగా "ఆదిశేషుడు". ఇక్కడ ఈ పాలపుంతనే

ఆదిశేషునిగానూ, సూర్యుణ్ణి శ్రీమహావిష్ణువుగానూ పోల్చటం జరిగింది. (శ్రీమన్నారాయణుడి ప్రత్యక్ష రూపం సూర్యనారాయణుడని పురాణాలంటాయి) మరియు సదా పాల సముద్రంలో ఆదిశేషునిపై విష్ణుదేవుడు శయనించి వుంటాడని పురాణాలు చెప్తున్నాయి. అంటే సూర్యుడు ఎప్పుడూ పాలపుంతలోనే ఉంటాడని దాని భావం. అలాగే ఈ భూగోళాన్ని అనంతుడు తన పడగలతో సదా మోస్తూ వుంటాడని కూడా పురాణాలు చెబుతున్నాయి. అంటే సూర్యుడు, భూమీ కూడా ఎప్పుడూ పాలపుంతలోనే ఉంటాయనే విషయాన్ని పురాణ ఋషులు గుర్తించారని తెలుస్తుంది కదా!

❀ ❀ ❀

8. అణు రహస్యం

అణువులు, పరమాణువులు చాల సూక్ష్మమైనవి. అయినా వాటిలో గల శక్తి అనంతం. పరమాణువును విడగొడితే ఆ శక్తి విడుదల అవుతుంది. అణుశాస్త్రంలో ముఖ్యాంశం ఇది. ఈ అణువిజ్ఞానాన్ని క్రీ.శ. 1940లో ఐన్‌స్టీన్ కనుగొన్నాడని అందరూ అంటారు. కానీ అది కూడా హిందువులకు పాత విషయమే! ఆధునిక అణుశాస్త్ర విజ్ఞానానికి ఆద్యుడు... కణాదుడు అనే మహర్షి. ఇంకా ప్రాచీనకాలంలో... అంటే క్రీ.పూ.3100 సం॥ పూర్వం శ్రీకృష్ణుడు తన భగవద్గీతలో అణువుల్లో దాగి వున్న శక్తిని గురించి చెప్పాడు. ఆ భగవద్గీతను మహాభారతం ద్వారా వ్యాసుడు మనకు అందించాడు. అంటే ఈ అణుశక్తి గూర్చి శ్రీకృష్ణుడికి, వ్యాసుడికి అతిప్రాచీనకాలంలోనే, తెలుసుకదా మరి!

❀ ❀ ❀

9. సూర్యకేంద్ర సిద్ధాంతం

సూర్యకేంద్ర సిద్ధాంతం అనగా గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయని చెప్పే సిద్ధాంతం! క్రీ.శ.1500 వరకు సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నాడని విదేశీయులందరూ భావించేవారు. క్రీ.శ.1500 ప్రాంతంలో కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని స్థిరపరిచాడు.

సూర్యకేంద్ర సిద్ధాంతం గూర్చి క్రీ.శ. 1500 లో కెప్లర్, కోపర్నికస్ అనే పాశ్చాత్య శాస్త్రవేత్తలు చెప్పేవరకూ ప్రపంచమంతా భూకేంద్ర సిద్ధాంతాన్ని నమ్మిందనే పిడివాదం, నేటికీ మన పాఠ్యాంశాల్లో కనిపిస్తుంది.

రామాయణ, మహాభారత కాలాలకంటే ముందే యేర్పడిన మన హిందూ జ్యోతిషశాస్త్రంలోని గ్రహచారం లెక్కలు, నేటి ఆధునిక లెక్కలకు సరిపోతున్నాయి. ఏ గ్రహం ఎంతకాలంలో తన ప్రదక్షిణ సాగిస్తుందో, జ్యోతిష శాస్త్రం చెబుతుంది. అలాంటి విజ్ఞానాన్ని కనుగొన్న హిందువులకు సూర్యకేంద్ర సిద్ధాంతం తెలియదనడం మూర్ఖత్వం కాదా!

మన హిందువులు వేదకాలంలోనే సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని గుర్తించారు. అందుకు చాలా నిదర్శనాలు వున్నాయి. ఉదాహరణకు ఒకటి చూద్దాం. కృష్ణ యజుర్వేదం 1-6-6-5 మంత్రంలో "సూర్య సంబంధిత ఆవర్తనం వలన నేను కూడా సూర్యుని చుట్టూ ప్రదక్షిణ చేయుచున్నాను" అని వ్రాశాడు ఒక వేద ఋషి. అంటే భూగోళం సంవత్సరానికొక సూర్యప్రదక్షిణ పూర్తిచేస్తుందని, దానివలన భూమితో పాటు మనం అందరం సూర్యుని చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని దాని భావం. కనుక ఆనాడే ఆ ఋషులకు సూర్య కేంద్ర సిద్ధాంతం తెలుసన్నమాట. ఇదే విషయం "సూర్య సిద్ధాంతం" అనే ప్రాచీన గ్రంథంలో తాను చదివినట్లుగా, క్రీస్తు పూర్వం జీవించిన ఆర్యభట్టు తన గ్రంథాల్లో వ్రాశాడు. ఆర్యభట్టు తను జీవించిన కాలం క్రీ.పూ.2740 అని మన భారతీయులు అంటారు. క్రీ.పూ. 500 అని పాశ్చాత్య చరిత్రకారులంటారు. ఆర్యభట్టు తను జీవించిన కాలం గూర్చి తన గ్రంథంలో ఇలా వ్రాశాడు. "కలిశకం 60 × 6 సం॥" అని వ్రాయగా హిందువుల ప్రాచీనతను ఓర్వలేని చరిత్రకారులు ఒకే ఒక్క అక్షరాన్ని మార్పు చేసేశారట. ఫలితంగా ఆ శ్లోకం అర్థం "కలిశకం 60 × 60"గా మారిపోయింది. కానీ ఆ విధంగా వుంటే ఆ శ్లోకం ఛందోదోషం కలిగి వుంది. మరి ఆర్యభట్టు వంటి పండితుడు ఛందోదోషంతో శ్లోకం వ్రాయడు కదా! అనగా మధ్యలో కొందరు దుర్మార్గులు ఈ మార్పు చేశారని తెలుస్తుంది. దీన్నిబట్టి అతని కాలం క్రీ.పూ.2740 అని గ్రహించవచ్చు.

❀ ❀ ❀

10. గ్రహాల మధ్య దూరం

భూమికి సూర్యునికి మధ్యగల దూరం ముందుగా లెక్కవేసిన శాస్త్రవేత్త "ఎడ్మండ్ హాలే" అనే విదేశీయుడని పాశ్చాత్యులు చెబుతారు. హాలే జీవించిన కాలం క్రీ.శ.1700. అతనికంటే యెన్నో సంవత్సరాలకు పూర్వం జీవించిన ఆర్యభట్టు వ్రాసిన ఆర్యభట్టీయంలో కేవలం భూమి, సూర్యుల మధ్య దూరమే కాదు, సూర్యునికి ఏ గ్రహం యెంత దూరంలో వుందో కూడా వ్రాయబడి వుంది. తాను ఆ ఖగోళ విషయాలు తెలుసుకోవడానికి మూలకారణం "సూర్య సిద్ధాంతం" అనే ప్రాచీన గ్రంథం అని ఆర్యభట్టు వ్రాశాడు. ఆ సూర్య సిద్ధాంతం ప్రస్తుతం పూర్తిగా లభించటం లేదు. అది ఏకాలంలో వ్రాయబడిందో ఇంతవరకూ ఎవరికీ తెలియ రాలేదు. కానీ ఆర్యభట్టు కంటే ఎంతో ప్రాచీన కాలంలో "మయుడు" అనే పండితుడు వ్రాసినట్లుగా కొందరు పండితుల అభిప్రాయం.

ఆర్యభట్టు వ్రాసిన గ్రంథంలో సూర్యుడి నుండి వివిధ గ్రహాల దూరాలు ఈ క్రిందివిధంగా వున్నాయి.

గ్రహం పేరు		ఆర్యభట్టు కొలత		ఆధునిక సైంటిస్టుల కొలత
బుధుడు	....	0.375 ఎ.యు	....	0.387 ఎ.యు.
శుక్రుడు	....	0.725 ఎ.యు	....	0.723 ఎ.యు.
కుజుడు	....	9.538 ఎ.యు	....	9.523 ఎ.యు.
గురుడు	....	5.16 ఎ.యు	....	5.20 ఎ.యు.
శని	....	9.41 ఎ.యు	....	9.54 ఎ.యు.

చూశారు కదా! ఎన్నో వందల యేళ్ళ నాటి ఆర్యభట్టు కొలతలు నేటి ఆధునిక కొలతలకు అతిదగ్గరగా వున్నాయి కదా! అంటే ఈ కొలతలు, దూరాలు ముందుగా కనుగొన్నదెవరు? హిందువులా? విదేశీయులా? ఎవరు ముందు?

ఈ కొలతల్లో ఎ.యు అని వుంది కదా! అనగా "ఆస్ట్రనామికల్ యూనిట్" అని అర్థం. రోదసీలో కొలతలను ఈ విధమైన కొలమానంతో

చెబుతారు. ఆర్యభట్టు లెక్కల ప్రకారం సూర్యుడు - భూమిల మధ్యదూరం 1.5 ఎ.యు.

ఈ విధంగా ఎన్ని ఉదాహరణలు చెప్పినా, ఇంకా వుంటూనే వుంటాయి. ఎందుకంటే హిందూ ప్రాచీన విజ్ఞానం అపారం. అనంతం. ప్రాచీన హిందువులు బుధుడి నుండి శని వరకు గ్రహాలన్నిటినీ వివిధ రకాలుగా పరిశీలించి వాటి విశేషాలను తెలుసుకున్నారు. గ్రహాలన్నిటిలో బృహస్పతి గ్రహమే పెద్దగ్రహమని గుర్తించారు. అందుకే దానికి గురుగ్రహం అని మరో పేరు పెట్టారు. (గురువు అనగా పెద్దది అని, లఘువు అనగా చిన్నది అని అర్థం కదా!) అలాగే భూమికి, అంగారకుడికి చాల పోలికలు వున్నాయని గుర్తించారు. అయితే భూమికంటే అంగారకుడు పరిమాణంలో చిన్నది. కనుకనే అంగారకుడిని భూదేవి పుత్రుడని చమత్కరిస్తూ, తల్లి పోలికలో వున్న అంగారకుడికి 'కుజుడు' అని మరో పేరు పెట్టారు (కుజుడు అనగా భూమికి పుట్టినవాడు అని అర్థం). శనిగ్రహం ఒకసారి సూర్యప్రదక్షిణ చేసి మళ్ళీ అదే స్థానానికి రావడానికి సుమారు 30 సం॥ పడుతుందని గుర్తించారు. అందుకే 30 సం॥కి ఒకసారి ఏలినాటి శని వస్తుందని జ్యోతిష శాస్త్రాల్లో వ్రాశారు. చంద్రుడికి బుధుడికి పోలికలున్నాయని గుర్తించి, బుధుడు చంద్రకుమారుడని పురాణాల్లో (తారా శశాంకం కథగా) వ్రాశారు.

మన కళ్ళకు మామూలుగా కనిపించే నక్షత్రాలను పరిశీలించి వాటిలో ఒక యువనక్షత్రాన్ని అతిపెద్ద నక్షత్రంగా గుర్తించి, దానికి "జ్యేష్ఠ" అని పేరు పెట్టారు. ఇలా చెబుతూ పోతే యెన్నో వున్నాయి. ఈ వివరాలన్నీ మనవారు యేనాడో వేలయేళ్ళ క్రితం కనుగొనగా.... నిన్న మొన్నటి ఆధునిక కాలంలో ఈ వివరాలను గుర్తించిన విదేశీయులు అన్నీ "మేమే కనుగొన్నాం" అంటూ డప్పుకొట్టుకుంటుంటే... దానికి 'సై' అంటున్నారు మన దేశంలోని కొందరు పిచ్చివాళ్ళు. మన హిందూ విజ్ఞానానికి అతి ప్రాచీన వేదాలే తిరుగులేని ప్రామాణికాలు. అవి ఎవ్వరూ చెరపలేని శిలాక్షరాలవంటివి.

❀ ❀ ❀

11. సూపర్ నోవా

నక్షత్రాలకు కూడా పుట్టుక, యవ్వనం, వార్ధక్యం, అంతర్ధానం వంటి దశలు వుంటాయి. కొన్ని నక్షత్రాలు మధ్యలోనే ప్రేలిపోయి, చిన్న చిన్న నక్షత్రాలుగా విడిపోతుంటాయి. అలా ప్రేలినప్పుడు ఆ నక్షత్రం బ్రహ్మాండమైన కాంతితో వెలిగిపోతూ కనిపిస్తుంది. అటువంటి వాటినే "సూపర్ నోవా" అంటారు.

ఇలాంటి సూపర్ నోవాలను ముందుగా క్రీ.శ 1054లో చైనావారు, తదుపరి క్రీ.శ 1572లో 'టైకోబ్రాహి' అనే శాస్త్రవేత్త కనుగొన్నట్లుగా చరిత్ర కారులంటారు. కానీ అంతకుముందే కొన్నివేల యేళ్ళ క్రిందట "భారీ తారా విస్ఫోటనం" జరిగిన సంఘటన ఒకటి వుంది. చాలాకాలం కాంతివంతంగా వెలుగొందిన ఒక నక్షత్రం ముక్కలుగా విడిపోవడాన్ని ప్రపంచాన కొంతమంది తెలుసుకున్నారు గాని... దానిపై అలనాడే పూర్తి పరిశోధనలు జరిపినవారు మాత్రం మన "హిందూ ఋషులు". వారి పరిశోధనల ఫలితమే... "కృత్తికా నక్షత్ర సమూహ వివరాలు".

ఈ సూపర్ నోవా గురించి చాలా జాతులవారు కొన్ని కొన్ని పురాణ కథలను యేర్పరచుకున్నారు. కానీ హిందూ పురాణకథ అన్నిటికన్నా మేటిగా వుంటుంది.

మన పురాణ కథ : ఒకప్పుడు అగ్నిదేవుడు సప్తఋషుల భార్యలపై మనసు పడ్డాడట. అది తెలిసిన అగ్నిదేవుని భార్య స్వాహాదేవి, రోజుకొక ముని భార్యగా రూపుదాల్చి, అగ్నిదేవునితో కలిసేది. అలా 6 రోజులు ఆరుగురు మునిపత్నుల రూపాలు దాల్చిన స్వాహాదేవి, ఏడవరోజు అరుంధతి రూపం మాత్రం దాల్చలేకపోయింది. వశిష్టుడు తప్ప, సప్తఋషుల్లోని మిగిలిన ఋషులు తమ భార్యలను శంకించారు. అరుంధతి పతివ్రతలందరిలో మరింత విశిష్టురాలు. ఆమె రూపాన్ని స్వాహాదేవి దాల్చలేక పోయింది. మిగిలిన ఆరుగురు స్త్రీలలో ఏదో లోపం వుండి వుంటుందని భావించిన ఆరుగురు మునులూ, వారి పత్నులను విడిచి వెళ్ళిపోయారు. వశిష్టుడు మాత్రం అరుంధతిని తీసుకునే వెళ్ళాడు. ఆరుగురు మునిపత్నులూ

కుమారస్వామిని శరణువేడారు. అప్పుడు కుమారస్వామి, ఇంద్రుణ్ణి పిలిచి "అభిజిత్తు" అనే ఆమె, తపస్సు చేసుకొనటానికి వెళ్ళిపోయిందనీ, ఆమె స్థానం ఖాళీగా ఉందనీ, ఆ ఖాళీలో ఈ ఆరుగురినీ నిలుపమని" చెప్పాడు. ఇంద్రుడలాగే చేశాడు. ఆ విధంగా ఆరుగురు మునిపత్నులూ కూడా సప్త ఋషులకు ఒక ప్రక్కగా నిలుపబడ్డారు.

ఈ కథ అంతరార్థం : ఒకప్పుడు కృత్తికా నక్షత్రం ఒకే నక్షత్రంగా వుండేది. సూపర్ నోవా దశలో అది అఖండంగా వెలిగిపోయింది. అందుకే కృత్తికా నక్షత్రానికి అగ్నిదేవుడు 'అధిదేవుడు' అన్నారు. అందువలన స్వాహాదేవి కూడా దానికి అధిదేవత అయింది. ఆ నక్షత్రం ప్రేలిపోయి, అనేక ముక్కలుగా విడిపోయింది. (స్కోపు ద్వారా చూస్తే అనేక ముక్కలు కన్పిస్తాయి. కానీ మామూలు కంటికి మాత్రం, నేడు ఆరుముక్కలే కనిపిస్తున్నాయి) ప్రేలి పోయిన క్రొత్తలో ఏడుముక్కలు కనిపించేవట. ఆ తదుపరి ఒక ముక్క మాయమైపోయి, ఆరు మాత్రం మిగిలాయి. ఈ విషయాన్ని చెప్పడం కోసమే పురాణకథలో స్వాహాదేవి ఏడుగురు మునిపత్నులుగా మారాలనుకున్నదనీ, కానీ ఆరుగురుగా మాత్రమే మారగలిగిందనీ చమత్కరించబడింది.

మరి ఏడవ ఋషి పత్ని అరుంధతి యేమయింది? అంటే... ఉత్తరాకాశంలో గల సప్తర్షి మండలంలో వశిష్ఠుని ప్రక్కనే వున్న చిన్న నక్షత్రం కృత్తికా తారల స్థాయి కాంతితో మెరుస్తుంటుంది. అదే ఆ ఏడవ ఋషి పత్ని "అరుంధతి" అనీ, ఆమెను వశిష్ఠుడు తనతో పాటు తీసుకుపోయాడనీ చమత్కరించారు.

మిగిలిన విదేశీయుల కథలు అంతటితో ఆగిపోయినా, హిందూ పురాణం మాత్రం ఇంకా కొనసాగింది.

ఆరుగురు మునిపత్నులూ కూడా తమ భర్తల చేరువలోనే వుండాలని కుమారస్వామిని కోరగా, అలా చేర్చే పనిని ఇంద్రుడికి అప్పగించాడు కుమారస్వామి. అభిజిత్తు ఖాళీ చేసిన స్థానంలో ఆరుగురినీ వుంచాడు ఇంద్రుడు. అనగా.... ఒకప్పుడు అభిజిత్తు కూడా ధృవతారగా వుండేది.

విష్వచ్ఛలనం వలన అభిజిత్తు ప్రక్కకు జరిగిపోయినట్లుగా కనిపిస్తుంది. అదే ఆమె తపస్సుకు వెళ్ళిపోవడంలోని అంతరార్థం. కొంచెం ప్రక్కగా వుండే హెర్క్యులిస్ తారా సమూహం, అభిజిత్తు ఖాళీచేసిన చోటకు జరిగినట్లు కనిపిస్తుంది. (పాశ్చాత్యులు 'హెర్క్యులిస్' అని పిలిచే తారా సమూహాన్ని కొందరు భారతీయులు 'హరికులేశుడు' అంటారు. ఈ నక్షత్రాలు సప్తర్షీ మండలం ప్రక్కగానే వుంటాయి. ఈ తారాసమూహం చాల తక్కువ కాంతితో కృత్తికల కాంతి స్థాయిలో వుంటాయి) ఆ హెర్క్యులిస్ మధ్యలో వున్న ఆరు ముఖ్య తారలనే, ఈ కథలోని ఆరుగురు మునిపత్నులుగా చెప్పటం జరిగింది. ఏది ఏమయినా ఈ ఆరుగురూ మళ్ళీ సప్తఋషుల ప్రక్కనే చేరారు కదా! (నిజానికి అక్కడి కృత్తికలు అక్కడే వున్నాయి. ఇక్కడి తారలు ఇక్కడే ముందు నుండీ వున్నాయి. మార్చబడిందేమిటి? కృత్తికలలోని దైవాంశలను అదే స్థాయిలో వున్న ఈ తారల్లోకి ఇంద్రుడు మార్చాడన్నమాట) ఈ పని ఇంద్రుని చేతిమీదుగా ఎందుకు జరిగిందంటే... ఇంద్రుడు విష్వద్రేఖకి అధిదేవుడు. విష్వచ్ఛలనం వల్లనే ఈ అభిజిత్తుకు, హరికులేశుడికి స్థాన చలనం కలిగిందని పురాణకర్తలు గుర్తించారు. కనుకనే ఆ విధంగా వ్రాశారు.

చూశారా! ఈ పురాణకథవల్ల ఒక సూపర్ నోవా వివరం, విష్వచ్ఛలనం, దానివల్ల తారల స్థానాల మార్పు... అన్నీ ఆనాటి ఋషులకు తెలుసని ఋజువవుతుంది కదా! ఈ కథ అంతరార్థం మరింత వివరంగా కావాలంటే మా "పురాణ గాథల్లో సైన్సు అద్భుతాలు" పుస్తకం చదవండి.

❀❀❀

12. సంవత్సరం పొడవు

ప్రస్తుతం శాస్త్రవేత్తల లెక్క ప్రకారం సంవత్సరం పొడవు 365.242199 రోజులు.

అయితే సంవత్సరం పొడవును ప్రథమంగా కనుగొన్నదెవరు? ఎంతకాలం క్రితం కనుగొన్నారు? ఈ సంగతి చూద్దాం.

క్రీ.పూ.5000 నాడే ఈజిప్టువారు కేలండరు రచన మొదలుపెట్టారని

కొందరి వాదం. కానీ దానికి సరైన ఋజువులు ఏమీ చూపించలేక పోయారు. మరికొందరేమో క్రీ.పూ.3000 అన్నారు. దానికీ ఖచ్చితమైన ఋజువులు కన్పించటం లేదు. నేటికి 7000 ఏళ్ళనాడే కాలెండరుకు పునాది వేసినట్లయితే సిరియస్ సూర్య సహోదయంతో, నైలునది వరదలతో సంవత్సరారంభం చేసుకొనే ఖర్మయేమిటి? సిరియస్ కాలం క్రీ.పూ 3000 లోపు. అప్పటికి 2000 ఏళ్ళ ముందు కేలండర్ పునాది పడిందా? అయినా సరైన పంచాంగం ఏర్పడలేదా? నైలునది వరదలతో కొండగుర్తు లెక్క ఆచరించారా? ఇదేమైనా నమ్మదగినదేనంటారా? క్రీ.పూ.3000లో కొండ గుర్తు లెక్క అమలు జరిగితే నిర్దిష్ట కేలండరు ఏనాటికి యేర్పడి వుంటుంది?

రెండవ స్థానం బాబిలోనియన్లకు దత్తం చేశారు చరిత్రకారులు. వీరు క్రీ.పూ.3000 తదుపరి కాలంలో చాంద్రమానాన్ని వాడేవారట. ఆ తరువాత కాలంలో సౌరచాంద్రమానంలోకి మారారు. వీరు సౌర సంవత్సరం చాంద్ర సంవత్సరాల తేడాలను సవరించడానికి 8 ఏళ్ళ చక్రం, 19 ఏళ్ళ చక్రం వాడేవారట. అంటే కొన్నాళ్ళ కొకసారి తేడా వచ్చి, రోజులను ఒక్కొక్క నెలలో కొన్ని చొప్పున అదనంగా చేర్చేసేవారట. ఇదీ ఒకరకంగా సర్దుబాటు లెక్కే అవుతుంది కదా!

మూడవస్థానంలో గ్రీకులను నిలిపారు. వీరు కూడా 8 ఏళ్ళు, 19 ఏళ్ళ చక్రాలు వాడేవారు. వాటినే ఇంకా ఎన్నో రకాలుగా మార్పులు చేసి కూడా వాడేవారు. చివరికు అనేక అవకతవకలయ్యాక, స్థిర కేలండరును తయారు చేసుకున్నారు.

ఇంకా చైనావారు క్రీ.పూ 2000 ప్రాంతంలోనూ, ఆ తరువాత మయ జాతీయులు, ఆపైన యూదులు, ముస్లింలు... అనేక విధాల కేలండర్లను రచించుకున్నారు. కానీ చాలావరకు మేటన్ చక్రాల పద్ధతిలో మొదలుపెట్టి చివరకు స్థిరపడ్డారు.

పైగా విదేశాల్లో కాలమానం కొలతలు, వాటి పేర్లు ఖగోళ అంశాలతో పాటూ... నోటిబలం గల రాజులు, మత పెద్దల ఇష్టాఇష్టాలతో ఏర్పడేవి.

కానీ మన హిందూ కాలమానం అటువంటిది కాదు. పూర్తిగా ఖగోళాధారమైనది. అతిప్రాచీన కాలం నుండీ హిందువులు సరిఅయిన

కాలమానాన్ని లెక్కిస్తూనే ఉన్నారు. ఋగ్వేదం ప్రపంచంలోకెల్ల ప్రాచీన గ్రంథమని విదేశీయులే నిర్ణయించారు. పైగా హిందువులు, ఈ భారతదేశంలోకి వచ్చేసరికే ఋగ్వేద రచన జరుగుతుందనీ వారే చెప్పారు. మరి భారతదేశం లోకి హిందువులు ఎప్పుడు వచ్చారు? హిందువులు భారతదేశం చేరేనాటికి గంగానది లేనే లేదు. కేవలం సింధునది మాత్రమే ఉంది. అనంతరకాలంలో గంగానదిని సగరవంశీకులు యేర్పరచారు. అంటే ఋగ్వేదం పుట్టేనాటికి గంగానది పుట్టనే లేదు. గంగానది కంటే ప్రాచీనమైన ఋగ్వేదంలో ఎన్నో ఖగోళ విజ్ఞానాంశాలతో పాటు కాలమాన వివరాలు వున్నాయి. "ఆకాశంలో 12 ఆకుల చక్రం... 720 మంది పిల్లలతో కూడి వుంది...." అనే శ్లోకం ఋగ్వేదంలోనిదే! ఆ శ్లోకం ప్రకారం 360 రోజుల సంవత్సరం ఆనాడు వాడకంలో వున్నట్లు తెలుస్తుంది.

ఇంకా సూర్య సహోదయాల విషయం కూడా వేదాల్లో వుంది. అగస్త్య, మృగవ్యాధ నక్షత్రాలతో సూర్య సహోదయం లెక్కించిన వివరాలున్నాయి.

అలాగే మిథునరాశిలో, వృషభరాశిలో, మేషరాశిలో విష్వద్రేఖ వున్న కాలాలు వరుసగా ఆయా రాశులవద్ద సంవత్సరారంభం చేసిన ఋజువులు ఋగ్వేదంలో వున్నాయి. (మా 'సులభశైలిలో వేదవిజ్ఞానం'లో వివరాలు వ్రాశాం చదవండి). ఇంకా సౌర, చాంద్రమానాలు వాడిన ఋజువులు, కాలాన్ని తెలిపే యాగాలు, సౌర, చాంద్రమానాల తేడాను సవరించే పద్ధతులు... అన్నీ వేదాల్లో స్పష్టంగా వున్నాయి. ఆ తదుపరి రామాయణ కాలానికి మాసాలు, తిథులు, నక్షత్రాల వాడుక కూడా చాలా విరివిగా సాగింది. మహాభారతకాలంలో కూడా దిన, వార, మాస, సంవత్సర లెక్కలు స్థిరపడ్డాయని తెలుస్తుంది. మేటన్ చక్రాలవంటి కొండ గుర్తు లెక్కలు కాకుండా సౌర, చాంద్రమానాలు ఖగోళ పరంగా లెక్కించే అలవాటు ఆనాటికే మనకు ఉన్నట్లు ఋజువులున్నాయి.

ప్రతి చాంద్రమాసంలో విధిగా ఒక సంక్రమణం వుంటుంది. (సంక్రమణం అనగా సూర్యుడు రాశి మారటం). ఏ మాసంలోనైనా సంక్రమణం రాకపోతే, అక్కడ అధికమాసం వస్తుంది. అలాగే ఒక్కొక్కసారి ఒకే మాసంలో రెండు సంక్రమణాలు రావచ్చు. అక్కడే లుప్తమాసం వస్తుంది.

అయితే లుప్తమాసం వచ్చినప్పుడు, దానికి ఇరువైపులా అధికమాసాలు వుంటాయి. (అధిక మాసం అంటే ఒకే మాసం వరుసగా రెండుమార్లు రావటం. లుప్తమాసం అంటే ఆ సంవత్సరంలో ఒక మాసం తొలగించబడటం).

ఈ విధంగా స్వంత తెలివి, నోటిబలం, కొండగుర్తులాధారం కాకుండా పరిపూర్ణంగా ఖగోళభరితమైన ప్రాచీన కాలమానం కేవలం హిందూ ఋషుల స్వంతం. ఇతర జాతుల వారెవరూ ప్రాచీన హిందువులతో పోటీపడనక్కర్లేదు. న్యాయంగా పోటీ పడి గెలవనూ లేరు.

ఇలా సంవత్సర మానమే కాదు. అన్ని రకాల మానాల్లోనూ హిందువుల ప్రాముఖ్యత ఎనలేనిదే!

ఇతర దేశీయుల 'రోజులెక్కింపు' చూడండి. అర్ధరాత్రి నుండి మరో అర్ధరాత్రి వరకు ఒకరోజు. దానికేమైనా ఖగోళ ప్రాముఖ్యత వుందా?

పైగా $\frac{1}{2}$ రాత్రి + 1 పగలు + $\frac{1}{2}$ రాత్రి కలిపి ఒక 'తికమక' దినం.

మన లెక్క అయితే అలాకాదు. మన పంచాంగాలు 3 రకాలుగా దినాన్ని సూచిస్తాయి. ఒకటి సౌరమానం.... అనగా సూర్యోదయం మొదలు తదుపరి సూర్యోదయం వరకు ఒకరోజు. మరొకటి చాంద్రమానం. చంద్రకళల మార్పును బట్టి రోజును లెక్కించటం. దీనినే "తిథి" అంటాం.

3వ రకం కూడా చాంద్రమానమే! చంద్రుడు ఏ రోజున ఏ నక్షత్రం దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తే, ఆ రోజును ఆ నక్షత్రదినంగా లెక్కిస్తారు. ఈ తిథి, నక్షత్రాలు పంచాంగంలో మొదటి రెండు అంగాలు. మూడవది వారం. దాని గురించి ముందు పేజీల్లో చూద్దాం. తదుపరి అంగాలు యోగం, కరణం. అవి జ్యోతిషం కోసం పనికొస్తాయి. అవి పాశ్చాత్యులకు లేనే లేవు. ఇక మాసం మాటకొస్తే, విదేశీయుల నెలలు నోటికొచ్చిన రోజున ప్రారంభం అవుతాయి. వాటికి నోటికొచ్చిన పేర్లు వుంటాయి. కానీ హిందూ మాసాలు అలా కాదు. చాంద్రమానం ప్రకారం అమావాస్య నుండి అమావాస్య లేక పౌర్ణమి నుండి పౌర్ణమి వరకు ఒక మాసం. పౌర్ణమినాడు చంద్రుడు ఏ నక్షత్రంతో ఉన్నట్లుగా కనిపిస్తాడో, ఆ మాసానికి ఆ నక్షత్రం పేరు వస్తుంది.

ఆరు నెలలకొక ఆయనం. ఇది అన్ని జాతులకూ తెలిసిందే. కానీ హిందువులు ఈ ఆయనాలను కూడా తమ పండగలుగా జీవనశైలిలో ఆచరించటం ప్రత్యేకత. మన "సంవత్సరం" కూడా ఖగోళాధారమే. చాంద్రమానం ప్రకారం చైత్రశుద్ధ పాడ్యమికి ఆరంభమై, ఫాల్గుణమాసంతో ముగుస్తూ, మధ్యలో అధిక మాసాలతో సౌరమానానికి సరిపెడుతుంది. ఇంకా ఏ జాతికీలేని మరో మానం 'బృహస్పతిమానం' హిందువులకు వుంది. బృహస్పతి యేడాది కొకరాశిలోకి మారుతూ, 12 ఏళ్ళకో వృత్తం పూర్తి చేస్తుంది. ఈ విషయ విజ్ఞానాన్ని ప్రజలకందించాలనే ఈ పుష్కరమానాన్ని కూడా ఆచరించే పద్ధతి నిర్ణయించారు. ఇంకా 60 సంవత్సరాల 'సంవత్సర చక్రం' కూడా మన కాలమానంలో వుంది. ఇంత ఖగోళభరితమైన హిందూ కాలమానానికి మరొకటి ఏదీ సాటి కాదు.

❀❀❀

13. విష్వచ్ఛలనం

భూమి తన చుట్టూ తాను తిరుగుతుందని, అందువల్లనే రాత్రీ, పగలు ఏర్పడుతున్నాయనీ మనకు తెలుసు. అలాగే భూమి సూర్యునిచుట్టూ తిరుగుతుందని... దానివల్ల కాలాలు, సంవత్సరం లెక్క... అన్నీ ఏర్పడుతున్నా యని కూడా తెలుసు. అయితే భూమికి భూభ్రమణం, భూపరిభ్రమణం కాకుండా మూడవ చలనం ఉందనే విషయం చాలామందికి తెలియదు. దానినే 'విష్వచ్ఛలనం' అంటారు. భూగోళం $23\frac{1}{2}^0$ ఒక ప్రక్కకు ఒరిగి తిరుగుతుందని తెలుసుకదా! అలా ఒక ప్రక్కకు ఒరిగిన దిశను మార్చుకుంటూ... అంటే తూర్పుకు ఒరిగిన భూఅక్షం మెల్లగా ఉత్తరదిశ.... పడమర.... దక్షిణాలకు మారి, మళ్ళీ తూర్పుదిశకు చేరుతుంది. (దీని గురించి మా ఇతర పుస్తకాల్లో వ్రాశాం. ఇంకా వివరంగా "ఇంద్ర కథల్లో సైన్సు"లో వ్రాస్తున్నాం. చదవండి) భూగోళ అక్షం అలా ఒక రౌండు పూర్తి చేయుటానికి 25,800 సంవత్సరాలు పడుతుంది. ఈ విషయాన్ని మొట్ట మొదటిగా క్రీ.పూ.125లో హిప్పార్చస్ అనే గ్రీకు శాస్త్రవేత్త కనుగొన్నాడని అంటారు. కానీ నిజానికి ఈ విషయం వేదకాలానికే హిందువులకు తెలుసు.

క్రీస్తు పూర్వం నాటి ధ్రువుడి కథలో ఈ విషయం స్పష్టంగా వుంది. ఇంకా వేదపురాణేతిహాసాల్లో అనేకచోట్ల 'విష్వచ్ఛలనం' తెలిపే సంఘటనలున్నాయి. కానీ దౌర్భాగ్యమేమిటంటే, ఈనాటికీఎందరో ఆ హిప్పార్చస్‌కే పట్టం కడతారు.

విష్వచ్ఛలనం కారణంగా ఉత్తరాయన, దక్షిణాయనారంభ కాలాలు, స్థానాల మార్పుల గురించి వరాహమిహిరుడు కూడా వివరంగా వ్రాశాడు. విష్వద్రేఖ వృషభరాశి నుండి మేషరాశికి మారిన విషయాన్ని గుర్తించి, పంచాంగాలను సవరించి వ్రాసిన మేధావి వరాహమిహిరుడు. విష్వద్రేఖ మేషరాశిలోకి క్రీ.పూ. 2050లో ప్రవేశించింది. మరి వరాహమిహురుని కాలం అంతకంటే ప్రాచీనం. (పాశ్చాత్యులు మాత్రం అతని కాలాన్ని వీలైనంత ఆధునిక కాలానికి లాగటానికే ప్రయత్నించారు) ఎంతలేదన్నా హిప్పార్చస్ కంటే వందల సంవత్సరాల ముందే వరాహమిహిరుడు జీవించాడన్నది నిజం.

దక్షయజ్ఞం కథ అందరికీ తెలిసిందే! కానీ అందులోని అంతరార్థం కొద్దిమందికే తెలుసు. అందులో ఒక ఆధ్యాత్మిక అర్థం వుంది. ఒక వైజ్ఞానిక అర్థం వుంది. అదే విష్వద్రేఖాచలన వివరం. విష్వద్రేఖ యెప్పుడు యెలా స్థానచలనం చెందుతున్నదీ వివరిస్తుందా కథ. విష్వద్రేఖ మృగవ్యాధ (సిరియస్) మీదుగా వున్నప్పటి నుండి మొదలు పెట్టి, మేషరాశిలో చేరటం వరకు వున్న విశేషాలను దక్షయజ్ఞం కథలో ఇమిడ్చి వ్రాశారు ఋషులు.

అందులో మృగవ్యాధ తారను శివుడు సృష్టించిన భైరవ వాహనుడైన వీరభద్రుడిగా, మృగశిర తారలను దక్షుడిగా, రోహిణి తారలను సతీదేవిగా, కృత్తికను హోమగుండంగా, మేషరాశిని దక్షుడికి అమర్చిన గొర్రె తలగా వర్ణించారు. దక్షుడు (మృగశిర) రోహిణిపై (సతీదేవిపై) ఎగిరిపడుతుండగా వీరభద్రుడు (మృగవ్యాధ) దక్షుడిపైకి దూకుతున్నట్లుంటాయి ఆ తారలు. అనగా విష్వద్రేఖ... మృగ వ్యాధ తారలనుండి మృగశిరకు, దానినుండి రోహిణి మీదకు మారడాన్ని సూచిస్తుంది. రోహిణి నుండి కృత్తికకు విష్వద్రేఖ మారడాన్ని సతీదేవి అగ్నిలో దూకడంగా చెప్పారు (కృత్తికకు అగ్ని 'అధిదేవుడు' కదా!) ఆ తదుపరి మేషంలోకి మారింది విష్వద్రేఖ. అదే మేషశిరస్సును దక్షుడికి అమర్చడంలోని అంతరార్థం.

ఈ కథ పూర్తి వివరాలకు మా "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు" చదవండి.

అదీకాక విడివిడిగా కూడా విష్వద్రేఖ ఏ రాశిలో వుంటే, ఆ రాశివద్ద ప్రత్యేక కథలు కూడా వేదాల్లో వున్నాయి. మృగశిరలో విష్వద్రేఖ వున్నప్పుడు ఇంద్ర, నముచిలకథ, పునర్వసులో ఉన్నప్పుడు అదితి కథ, మృగశిరలో వుండగా విశ్వరూపుడికథ, ఇంకా ఇంద్రాణి కథ, ఋభువులు, కుక్క కథ.... ఇలా ఎన్నో విష్వచ్చలనాన్ని తెలిపే కథల వివరాల్ని మా "సులభశైలిలో వేదవిజ్ఞానం"లో చదవండి.

అగస్త్యుడి కథలు :- ఒకప్పుడు ఉత్తర భారతదేశంలో వుండే అగస్త్యముని భార్యా సమేతంగా, శిష్యులతో సహా దక్షిణ భారతదేశంలోని ద్రాక్షారామకు తరలిపోయాడు. దానికి కారణంగా రెండు పురాణ కథలున్నాయి.

1) శివ పార్వతుల కళ్యాణానికి ప్రపంచంలోని యావన్మందీ హిమాలయాలకు వెళ్ళారట. ఆ బరువుకు భూమి ఉత్తరదిశగా ఒరిగిపోయి, దక్షిణదిశ తేలిపోయింది. అప్పుడు శివుడు అగస్త్యమునిని పిలిచి, శిష్య సమేతంగా దక్షిణ భారతదేశానికి వెళ్ళమని కోరాడట. అప్పుడు అగస్త్యుడు భార్యతో కలసి, శిష్య సమేతంగా ద్రాక్షారామకు వెళ్ళిపోయాడు.

ఈ కథ ఒక విజ్ఞాన విశేషం చెప్పడానికి వ్రాయబడింది. అంతేకాని కేవలం జనం ఎక్కువైనందున భూమి ఒరిగిపోదు. అగస్త్యుడు అనబడే నక్షత్రం, దక్షిణ దిశకి వెళ్ళడానికి కారణం 'విష్వచ్చలనం' అని ఈ కథారచయితలకు తెలుసు. అలాగే విష్వచ్చలనానికి కారణం కూడా తెలుసు. భూమి ఉత్తర అక్షం ($23\frac{1}{2}^0$) ప్రక్కకు ఒరిగివుండటం అనే సైన్సు విషయాన్ని చెప్పేటందుకే ఉత్తరం వైపు భూమి కృంగిపోయిందని ఈ కథలో చమత్కరించారు.

2) ఒకప్పుడు గ్రహ తారకలన్నీ మేరుపర్వతం చుట్టూ ప్రదక్షిణ చేయడం చూసి, వింధ్యపర్వతానికి కోపం వచ్చిందట. గ్రహ, తారలన్నీ తన చుట్టూ తిరగాలని వింధ్యపర్వతం భారీగా ఆకాశంలోకి పెరిగిపోసాగిందట. ఆ బరువు వల్ల భూమి ఉత్తర దిశకు ఒరిగిపోసాగింది.

ఆ వింధ్య పర్వతాన్ని అణచమని అందరూ అగస్త్యుని కోరారట. అప్పుడు అగస్త్యుడు భార్యా సమేతంగా దక్షిణానికి బయలుదేరి, దారిలో అడ్డుగా వున్న వింధ్య పర్వతాన్ని దారి ఇమ్మని ఆదేశించాడు. అగస్త్యునికి భయపడిన వింధ్య బాగా క్రిందికి వంగి దారి ఇచ్చింది. పర్వతాన్ని దాటిన అగస్త్యుడు "నేను తిరిగి వచ్చేవరకూ ఇలాగే వంగి ఉండు" అని వింధ్యను ఆజ్ఞాపించి ద్రాక్షారామకు వెళ్ళిపోయి, తిరిగి ఉత్తరాదికి రాలేదు. ఆయన కోసం ఎదురుచూస్తూ, వింధ్యపర్వతం తిరిగి ఎత్తుగా లేవలేదు.

ఈ కథలు రెండింటి వల్ల మనకు తెలిసే విజ్ఞాన విషయాలు ఏమిటంటే.... భూగోళం ఉత్తరధృవంవైపు ($23\frac{1}{2}^0$) ఒరిగి తిరుగుతుందని, దానివలన విష్వచ్ఛలనం కలుగుతుందనీ తెలుస్తుంది. మరో విషయం ఏమంటే... దక్షిణ ఆకాశంలో రంగు రంగులుగా మెరిసే కాంతివంతమైన అగస్త్య నక్షత్రం, విష్వచ్ఛలనం వల్ల స్థానచలనం కలిగి, అది మరింతగా దక్షిణదిశకు జరిగినట్లుగా కనిపిస్తుంది. ఈ విషయాన్ని చెప్పడానికే అగస్త్యుడు దక్షిణాదికి వెళ్ళి, తిరిగి రాలేదని పురాణ కథ వ్రాశారు.

చూశారు కదా! విష్వచ్ఛలనం వల్ల నక్షత్రాలు స్థానభ్రంశం చెందినట్లు కనిపిస్తాయనీ, భూమి ఒరిగితిరగడం వల్లనే విష్వచ్ఛలనం కలుగుతుందనీ... హిప్పార్చస్ కంటే వేల సంవత్సరాల పూర్వమే మన ఋషీశ్వరులు ఎలా చెప్పారో గమనించండి.

❀❀❀

14. నెబ్యులాలు

నెబ్యులాలు అంటే నక్షత్ర గుచ్ఛాలు. ఒక్కొక్క నెబ్యులాలో కోట్లాది నక్షత్రాలు గుంపుగా వుంటాయి. అన్ని నెబ్యులాలు ఒకేరకంగా వుండవు. వేరువేరు ఆకారాలుగా వుంటాయి. టెలిస్కోపులు బాగా ఉపయోగంలోకి వచ్చాక, ఎన్నో నెబ్యులాల్ని కనుగొన్నారు. ప్రాచీనకాలంలో హిందువులకు ఈ నెబ్యులాలు తెలియనే తెలియవని చాలామంది అభిప్రాయం. కానీ నెబ్యులాలను కూడా మన హిందూ ఋషులు కనుగొన్నారు. వాటి ఆకారాలను కూడా గుర్తించారు.

18వ శతాబ్దంలో ఫ్రెంచ్ దేశ శాస్త్రజ్ఞుడు "మెస్సియర్" ఉత్తర ఆకాశంలో హెర్క్యులిస్ రాశిలోని ఒక నెబ్యులాను గమనించాడట. అయితే ఋగ్వేద కాలంలో ఋషులు... అంటే మెస్సియర్ కంటే వేల సంవత్సరాల ముందే ఆ నెబ్యులాను కనుగొని... ఆ నక్షత్ర గుచ్ఛం, గొప్ప తేనెపట్టు చుట్టూ ముసిరిన తేనెటీగల గుంపు మాదిరిగా వుందని వివరించారు. ఋగ్వేదం 1-154-5వ మంత్రం "విష్ణో పదే పరమే మధ్య ఉత్సః" అనగా "విష్ణు పదం" అనే రాశి మధ్యలో తేనెపట్టులాంటి తారాగుచ్ఛం వుంది. విష్ణుపదం అనగా హరికులేశ తారాసమూహం. దానినే విదేశీయులు హెర్క్యులిస్ అంటారు.

అలాగే ఆ ఫ్రెంచ్ శాస్త్రజ్ఞుడు మెస్సియర్, మరో నెబ్యులాను కూడా గమనించాడు. అది అభిజిత్తు నక్షత్రం దగ్గర వీణారాశిలో వుంది. అది గుండ్రంగా రింగులా వుందని దాన్ని 'రింగ్ నెబ్యులా' అన్నారు. అయితే అతనికంటే కొన్ని వందలయేళ్ళకు ముందే ఇదే నెబ్యులా (నీహారిక)ను "పొడవు గలిగిన పొందమ్మి పూవు" అని తన గ్రంథంలో వర్ణించాడు శ్రీనాథుడు. అంతకంటే వందలయేళ్ళకు పూర్వం ఈ నీహారికను "బ్రహ్మ కమలం" అనీ, "తామరపూవు" అనీ వర్ణించాయి హిందూ పురాణాలు.

(నెబ్యులా లను వేదాల్లో "నీహారికలు" అని పిలిచేవారు. ఋషీశ్వరులు ఇంకా మరికొన్ని నీహారికలను కనుగొన్నట్లు వేదాల్లో ఉంది).

❀❀❀

15. భూమి వయస్సు - జీవ సృష్టి ఆరంభం

ప్రాచీనకాలాన విదేశీయులకు భూమి వయస్సు గురించి, జీవసృష్టి ఆరంభకాలం గురించి సరైన అవగాహన వున్నట్లు కనిపించడంలేదు. కానీ హిందువులు మాత్రం ఈ భూమి ఎప్పుడు ఏర్పడింది? దానిపై జీవరాశి ఎప్పటినుండి ఉంది? మానవజాతికి మూలం ఏ జాతి? ఇలాంటి విషయాలనే కాక, భూమికంటే ముందు ఎక్కడైనా జీవసృష్టి జరిగిందా? అనే విషయాన్ని కూడా తీవ్రంగా పరిశోధించి మన గ్రంథాల్లో పొందు పరిచారు. అయితే ఆ విషయాలను సరిగా అర్థం చేసుకోలేని దేశ, విదేశ మేధావులు ఆ విషయాల్లోని

ఔన్నత్యాన్ని గుర్తించలేదు సరికదా! ఆ విషయాలను విమర్శించటం, వెక్కిరించటం కూడా చేశారు. చేస్తున్నారు. కల్పకాల లెక్కప్రకారం 432 కోట్ల సంవత్సరాల నుండి హిందూ పంచాంగాలున్నాయనీ, అయితే హిందూ ప్రాచీనతను సహించలేని విదేశీయులు మానవజాతి పుట్టి, పదిలక్షల ఏళ్ళు అయిందంటున్నారని కొందరి వాదన. గుణకారాలు చేతనైనవారి చేతిలో ఘంతం వుంటే కల్పకానికి వేయిరెట్లు అయిన మహాకల్పం నుండీ హిందూ పంచాంగాలున్నాయని వాదిస్తే అడ్డేదెవరు?" అంటూ వెక్కిరిస్తున్నారు మరికొందరు. ఈ రెండు వాదనలూ తప్పే!

పురాణ వాక్యాల అంతరార్థాన్ని గుర్తించకపోవడంవల్ల ఇలాంటి వాదనలు పుడుతుంటాయి. పురాణకర్తల భావాలను ఇప్పుడు పరిశీలిద్దాం. "కల్పకం" అనగా 432 కోట్ల సంవత్సరాలు. కల్పక కాలం అంటే బ్రహ్మదేవుడికి ఒక పగలు. మరొక కల్పకం బ్రహ్మదేవునికి రాత్రి. ఒక గ్రహంపై జీవరాశి పుట్టి తిరిగి నశించేకాలం ఒక కల్పకం. అంటే అది బ్రహ్మదేవుని పగటికాలం. మరి రాత్రి కాలం ఎప్పుడు? ఈ పగటి కాలానికి ముందు 1/2 కల్పక కాలం, సృష్టి రహితంగా ఖాళీగా వుంటుంది. ఆ కాలంలో సృష్టికి కావలసిన పరిస్థితులు ఏర్పడుతూ వుంటాయి. సృష్టి యేర్పడి తిరిగి నశించాక కూడా, మరో 1/2 కల్పక కాలం ఖాళీగా వుండి పోయి, గతించిన సృష్టియొక్క ఆనవాళ్ళు కనుమరుగవుతాయి. ఆ రెండు ఖాళీ కాలాలు కలసి బ్రహ్మదేవుని రాత్రి.

దీన్ని బట్టి మనం గుర్తించవలసిందేమంటే... బ్రహ్మదేవుని రాత్రి సమయంలో మొదటి 1/2 కల్పకం అనగా సుమారు 200 కోట్ల సంవత్సరాలు భూగోళం ఉద్భవించి కూడా, ఖాళీగా ఉండిపోయింది. అనంతరం బ్రహ్మ పగటికాలమైన శ్వేతవరాహకల్పం ప్రారంభమైంది. అనగా సృష్టి మొదలైంది. కానీ మానవులు పుట్టలేదు నీరు... నాచు.... అమీబాలు వంటివి పుట్టి వుంటాయి.

ప్రస్తుతం జరిగే కల్పకంలో ఇప్పటికి 7వ మన్వంతరంలో 27 మహాయుగాలు గడిచి, 28వ మహాయుగంలో కలియుగం 5000 సం॥ గడిచింది.

(ఒక కల్పానికి 14 మన్వంతరాలు. ఒక మన్వంతరానికి సుమారు 71 మహాయుగాలు. ఒక మహాయుగానికి కృత, త్రేత, ద్వాపర, కలియనే 4 యుగాలు).

ఈ లెక్కప్రకారం ఒక మన్వంతరానికి	30,67,20,000 సం॥
గడచిన 6 మన్వంతరాలకు	184,03,20,000 సం॥
మన్వంతర సంధి కాలాలకు	1,20,96,000 సం॥
7వ మన్వంతరంలో 27 మహాయుగాలకు	11,66,40,000 సం॥

ప్రస్తుత మహాయుగంలో జరిగిన కాలం :

కృతయుగం	17,28,000 సం॥
త్రేతాయుగం	12,96,000 సం॥
ద్వాపరయుగం	8,64,000 సం॥
2017 నాటికి గడిచిన కలియుగం సంవత్సరాలు	5,119 సం॥
మొత్తం =	197,29,49,119 సం॥

ఇదీ మన పురాణ వాక్యాల అర్థం.

ప్రస్తుతం ఆధునిక శాస్త్రవేత్తల లెక్కప్రకారం ఈ భూమిపై జీవరాశి పుట్టుక ఆరంభమై సుమారు 200 కోట్ల సంవత్సరాలు గడిచాయి. మరిపైన చెప్పిన పురాణవాక్య ప్రకారం 197 కోట్ల సంవత్సరాలు. రెండు లెక్కలూ దాదాపుగా సరిపోయాయి కదా!

ఇకపోతే ఆధునికుల లెక్క ప్రకారం మన భూమి వయస్సు 400 కోట్లు సంవత్సరాలు. (సుమారుగా)

పురాణ ప్రకారం..............

ముందు ఖాళీగా గడచిన 1/2 కల్పకం	= 200 కోట్లు
జీవరాశి ప్రారంభమయ్యాకా గడచిన కాలం	= 197 కోట్లు
మొత్తం	= 397 కోట్లు

ఈ లెక్క కూడా సరిపోయింది కదా! కల్పకం అనగా 432 కోట్ల సంవత్సరాలని పురాణాలు చెప్పాయి. కానీ అప్పటి నుండీ పంచాంగాలు ఉన్నాయని చెప్పలేదు. ఇప్పటివరకు కల్పకకాలంలో సగం కూడా జరుగలేదు. 197 కోట్ల సం॥ గడిచాయి. ఇంకా సుమారు 235 కోట్ల సం॥ గడవవలసి వుంది. (దీని పూర్తి వివరాలకు మా "పురాణాల్లో సైన్సు" చదవండి)

ఆ విధంగా భూమి వయస్సు, జీవసృష్టి వయసు కూడా ఆధునికుల లెక్కలకు సరిపోయే విధంగా, ఎన్నోవేల ఏళ్ళక్రితమే హిందూ ఋషులు చెప్పారు. అంత చక్కగా యే ఇతర జాతివారూ చెప్పలేకపోయారు. ఇంత చక్కని విజ్ఞానంతో ప్రపంచం మొత్తంలో ప్రథమ స్థాయిలో హిందూజాతి ముందుండగా, కేవలం నోటిబలంతో హిందూ విజ్ఞానాన్ని ఆధునికం చేసి, అన్నింటా తామే అధికులమని ముద్ర వేసుకునేందుకు ప్రయత్నిస్తారు పాశ్చాత్యులు.

వేదాల్లో మిత్రావరుణుల గూర్చి కొన్ని సూక్తాలు వ్రాయబడ్డాయి. మిత్రా, వరుణులు జలాధి దేవతలుగా చెప్పబడ్డారు. వారిద్దరూ అన్నదమ్ములనీ, సూర్యపుత్రులనీ.... ఇంకా ఎన్నో విధాలుగా మంత్రాల్లో కీర్తించబడ్డారు. వీరి విషయంలో విదేశీయుల భావన మరోలా ఉంది. ఈ మిత్రుడనే దేవత బాబిలోనియా, గ్రీకు, ఈజిప్టు దేశాల్లో కూడా పూజింపబడ్డాడనీ, అందువల్లనే ఆ మిత్రదేవతను విదేశీయుల నుండి హిందువులు స్వీకరించారని తప్పుగా భావించారు వారు.

అలాగే ఋగ్వేదం 1-116-5లో ఆకాశంలో దక్షిణదిశలో గల ఒక పెద్ద నావ ఆకార నక్షత్రాల గురించిన వర్ణన వుంది. కానీ నౌక ఆకార తారలను ఈజిప్టువారే ముందుగా గుర్తించినట్లు కొందరి పిడివాదన.

ఈ విధంగా ప్రతి చిన్న విషయాన్నీ కూడా మనవారు పాశ్చాత్యులనుండే పొందినట్లు భ్రమ పడుతున్నారు కొందరు. కానీ నిజానికి ప్రాచీనకాలపు విజ్ఞానంలో 90%ను ముందుగా తెలుసుకున్నది హిందువులే! మనవారినుండే కొన్ని ఇతరులకు ప్రాప్తించాయి. మరికొన్ని హిందువుల తరువాత ఎంతో కాలం గడిచాక, ఇతరులూ గుర్తించగలిగారు.

❀❀❀

16. ఆకాశ, అంతరిక్ష విహారాలు

సృష్టిలో ఆకాశ, అంతరిక్ష ప్రయాణాల్ని ప్రప్రథమంగా చేసింది మన ప్రాచీనులే! పురాణాల్లోనూ, ఇతిహాసాల్లోనూ మనవాళ్ళు ఆకాశ, అంతరిక్ష ప్రయాణాల్ని సునాయాసంగా చేసిన దాఖలాలు అనేకం కన్పిస్తున్నాయి. రామాయణ కాలంనాటి పుష్పకవిమానం దీనికొక మచ్చుతునక. అలనాటి ఆకాశ, అంతరిక్ష విహారాలకు సాక్ష్యంగా భరద్వాజ మహర్షి ఏనాడో వ్రాసిన విమానయాన శాస్త్రం నేటికీ లభిస్తూ, మన హిందూ విజ్ఞానానికి గర్వకారణంగా నిలుస్తోంది.

వేదకాలంనాటి విమానాలు భూవాతావరణ పరిధిలోనూ, జలంలోనూ, అంతరిక్షంలోనూ కూడా తిరగగలిగేవట. ఆధునికకాలంలో మనం ఇంకా ఇలా 3 రకాలుగా నడిచే విమానాన్ని తయారుచేసుకోలేదు. విమానాల ప్రస్తావన ఋగ్వేదంలోని 116వ సూక్తంలోనూ, యజుర్వేదం (19-43, 19-54) లోనూ, అథర్వణ వేదం (7-63-3) లోనూ ఉంది. మూడు చక్రాలున్న విమానాల్ని గురించి ఋక్సంహిత (8-58-3) చెప్తుంది. భరద్వాజ మహర్షి 40 అధ్యాయాలతో వ్రాసిన 'యంత్రసర్వస్వం' లో ఎన్నో వైమానిక విశేషాలున్నాయి. భరద్వాజుడు, మయుడు తమ శాస్త్రాల్లో 16 రకాల విమానాల్ని గురించి చెప్పారు. విమానాల తయారీకి ఉపయోగించవలసిన తేలికైన లోహాల గురించీ, పైలట్లు గుర్తుంచుకోవలసిన విధి విధానాల్ని గురించీ కూడా వారు అందులో వివరించారు.

ఆధునిక కాలంలో తొలి విమాన నిర్మాతలు "రైట్ సోదరులు" అని అంటుంటారు. అయితే ఇదిపూర్తిగా అసత్యం. రైట్‌సోదరులు 1903 డిసెంబరు 17వ వారి విమానానికి రూపకల్పన చేశారు. అంతకుముందే 8 సంవత్సరాల క్రితం... అనగా 1895లో చౌపాతీ సముద్రతీరం నుండి "శివరాం బాపూజీ తల్పాడే" అనే హిందూ పండితుడు తయారుచేసిన విమానం, గాలిలో 1500 అడుగుల ఎత్తువరకూ లేచింది. ఆ విమానానికి ఆయన 'మరుత్సఖి' అని పేరు పెట్టారు. వేదాల్లోని సూత్రాల ఆధారంగా పాదరసం, సూర్యరశ్మిల సాయంతో ఆయన ఆ విమానాన్ని రూపొందించి, బొంబాయి ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో టౌనుహాలులో ప్రదర్శించాడు. అనంతరం ప్రజల సమక్షంలో ఆ విమానం, ఆకాశయానం చేసింది. ఆ వింతను అప్పటి బరోడా మహారాజు మహాదేవ గోవింద రనడే మొదలగు ప్రముఖులు కూడా చూశారట. శివరాంబాపూజీ తల్పాడే గొప్ప వేదపండితుడు. ఆయన మరాఠీ భాషలో "ప్రాచీన విమాన విద్యేచాశోధ" అనే గ్రంథాన్ని వ్రాశారు. భార్య మరణానంతరం

విరక్తితో ఆయన తన పరిశోధనల్ని వదులుకున్నారు. అనంతరం ఆయన వారసులు "మరుత్సఖి విమానం ప్లాన్"ను ఒక ఆంగ్లేయకంపెనీకి అమ్మి వేయడం జరిగింది. అనంతర కాలాన ఆ కంపెనీవారి అండతో రైట్‌సోదరులు తమ విమానాన్ని తయారు చేయడం జరిగింది. ఇదీ విమానం అసలు కథ.

మన వేదాల్లో చెప్పబడిన విజ్ఞానాంశాలు ఎంతటి ప్రామాణికమైనవో ఇందుమూలంగా కూడా తెలుస్తోంది. మన పూర్వీకుల ఆకాశ, అంతరిక్ష విహారాలను గురించి మరింత వివరంగా మా "పురాణాల్లో సైన్స్" పుస్తకంలో చదవండి.

17. విద్యుత్తు

విద్యుత్తు గురించి ప్రస్తావన వేదాల్లోనే వుంది. యజుర్వేదంలో (4-15-19) 5 మంత్రాల్లో విద్యుత్తు ప్రస్తావన కనపడుతోంది. విద్యుత్తు అగ్నిస్వరూపమని, అది రవ్వలరూపంలో ఆవిర్భవిస్తుందనీ, దానికి రెండు తలలనీ, ఒకతలతో వస్తూ, మరోతలతో వెనక్కిపోతుందనీ చెప్పబడింది. ఋణ, ధనాత్మకమైన రెండు విద్యుత్తు మార్గాలను (పాజిటివ్, నెగిటివ్‌లను) రెండు తలలుగా పోల్చడం జరిగిందని మనం గమనించవచ్చు. (ఇంకా వివరాలకు మా "పురాణాల్లో సైన్సు" మరియు "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు" చదవండి). అయితే ప్రమాదకరమైన వస్తువులు, శక్తులు, వాహనాలు ఎంత గొప్పవైనా సరే, ప్రాచీన హిందువులు నిషేధించేవారు. అంతేకానీ విద్యుత్తు, నేలబొగ్గు, రాకెట్లు వగైరాలు తెలియక కాదని మా ముందు పుస్తకాల్లో వివరణ ఇచ్చాం కదా! ఆ కారణంగా వాటిని వాడుకలోకి తీసుకురాలేదు వారు.

అగస్త్య మహాముని రచించిన 'అగస్త్య సంహిత' ప్రస్తుతం కొంత భాగం లభిస్తుంది. దానిలో ఎన్నో రసాయనశాస్త్ర విషయాలు కనిపిస్తున్నాయట.

అగస్త్యుడికి కుంభ సంభవుడని పేరు. కారణం యేమంటే మిత్రుడనే దేవత వీర్యము వల్ల కుండలో జన్మించాడని అంటారు. ఈయన కుండలో పుట్టిన టెస్ట్ ట్యూబ్ బేబీ మాత్రమే కాదు. ఈయనకు కుండలో మరింత

బంధం వుంది. అదేమంటే కుండలతో ప్రయోగాలు చేసి అమిత విద్యుత్తును పుట్టించిన మేధావి అగస్త్యుడు. కుంభంలో విద్యుత్తును సంభవింపచేసిన ఘనుడు ఆయన.

ఒక కుండలో ఒక రాగిపలక నుంచాలి. అందులో కాపర్ సల్ఫేట్ వేయాలి. తడిపిన రంపపుపొట్టు మధ్యలో వేయాలి. పైన పాదరసం, జింకు వేయాలి. ఆ తరువాత రెండు రాగితీగలను (ఒకటి రాగి పలక నుండి, మరొకటి జింకు, పాదరసాలనుండి) కలిపినట్లయితే విద్యుత్తు పుడుతుందని అగస్త్య సంహితలోని ఒక శ్లోకం వివరిస్తుంది.

ఇటువంటి ప్రయోగాలనే మన సైన్సు పాఠాల్లోని విద్యుద్ఘటము పేరున నేర్పుతున్నారీనాడు.

ఇలాంటివి 100 కుండల నుండి వచ్చే శక్తిని నీటిపై ప్రయోగిస్తే, ఆ నీటిలోని ఆక్సిజన్, హైడ్రోజనుగా మారుతుందనీ, దానిని విమానాల తయారీలో ఉపయోగించవచ్చుననీ అగస్త్యుడు వ్రాశాడు.

ఈ విధంగా అనేక రసాయన ప్రయోగాలకు కూడా మన ఋషులు ఆద్యులని చెప్పవచ్చు.

❀❀❀

18. నౌకాయానం

నౌకాయానం, నౌకా నిర్మాణం కూడా భారతీయులకు పరదేశాలవారే నేర్పినట్లు వితండవాదం వుంది. కానీ ఈ నౌకాయానానికి కూడా మన అగస్త్య మహాఋషియే ఆద్యుడు.

ప్రాచీనకాలంలో కాలకేయులనే రాక్షసులు పగలంతా నీటిలో దాగొని, రాత్రియందు బయటకు వచ్చి ఆశ్రమాల్లోని బ్రాహ్మణులను చంపి తినేసేవారట. దేవతలు కూడా కాలకేయులను చంపలేకపోయారు. ఎందువల్ల ననగా కాలకేయులు నీటిలో దాక్కొనేవారు. అందువల్ల దేవతల కోరికపై అగస్త్య మహాముని సముద్రాల్లోని జలమంతనూ త్రాగివేశాడు. కాలకేయులు బయట పడ్డారు. వారిని దేవతలు చంపివేశారు.

ఇది పురాణ కథ. దీనిభావం యేమిటో చూద్దాం. ఒక రాక్షసజాతి ఏవో దీవుల్లో అరణ్యాల్లో దాక్కొని, రాత్రివేళ భారతదేశం చేరి మనుషులు చంపితిని పారిపోయి దీవుల్లో దాక్కొనేవారని చెప్పబడింది. సముద్రంలో దాక్కోవటం అంటే నీటి లోపల కాదు. సముద్రం మధ్య దీవుల్లో అని మనం గ్రహించాలి. లేకుంటే సముద్రగర్భంలో వారెలా జీవించగలరు? ఒకవేళ వారు జీవించినట్లయితే.... సముద్రగర్భంలో దేవతలు జీవించలేరా? సముద్ర గర్భంలోకి దేవతలు వెళ్ళలేరా? వారిని చంపలేరా? అందుచేత ఆ రాక్షసులు దీవుల్లో ఉన్నారనేదే నిజం. అయితే ఆ రాక్షసులను చంపచూసిన వారు దేవతలు కాదు. మానవులే! రాజులసైన్యాలే! పురాణకథ రమ్యత కోసం దేవతలే చంపచూశారని చమత్కారం.

అప్పుడు ప్రజలంతా అగస్త్య మహామునిని సహాయం కోరారు. ఎందుకంటే అగస్త్య మహాముని కేవలం ఉత్తరభారతం.... దక్షిణ భారతదేశాలను సమగ్రంగా దర్శించటమే కాదు. సముద్ర మధ్యలోని అనేక దీవులను కూడా పరిశీలించి, ఆ వివరాలన్నీ ఆకళింపు చేసుకున్నవాడు. ఆయన మంచి నావికుడు కూడా! నౌకాయానాలు విరివిగా చేసి సముద్రాలు, వాటిలోని దీవులు అన్నీ బాగా ఔపోశనపట్టాడని చెప్తారు. అందువలన రాక్షసులు ఎక్కడెక్కడ ఏ దీవుల్లో దాగి యుండగలరనే రహస్యాలను అగస్త్యుడు చెప్పేశాడు. అప్పుడా రాక్షసులను రక్షకభటులు చంపేశారు.

(ఈనాటికీ ఆఫ్రికాలో కొన్ని అడవుల్లో కెన్నీబాల్స్ అనే నరభక్షక జాతి అదేవిధంగా పగలు అడవుల్లో దాక్కొని, రాత్రిళ్ళు నరభక్షణకు బయలు దేరుతారట.)

ఇంతకూ ఈ కథలో మనం గ్రహించవలసిందేమంటే... అగస్త్యుడి కాలం నాటికే సముద్ర మార్గాలన్నీ ఔపోసన పట్టేంత నౌకాయానం మన భారతీయులకు ఉందని!

గుజరాత్‌లోని లోథాల్ వద్ద జరిగిన త్రవ్వకాల్లో రేవుపట్టణ గుర్తులు లభించాయి. క్రీ.పూ.2400 నాడే ఆ రేవునుండి ఈజిప్టుకు నౌకాయానం జరిగినట్లుగా ఋజువులు కనిపించాయి.

అంతకంటే ప్రాచీనకాలాన మహాభారతంలో యంత్రాలతో నడిచే నౌకల ప్రస్తావన వుంది. అంతకంటే ముందు రామాయణంలో వందమంది ప్రయాణించ గల నౌకల ప్రస్తావన వుంది. వీటికంటే ముందు మత్స్యావతార కాలంలో వైవస్వతుడు గొప్ప నావలో వేలాదిమందితో ప్రయాణించిన విషయం మనకు తెలిసిందే!

వేదాల్లో నౌకాయానం గూర్చి చాలాచోట్ల కన్పిస్తుంది. నౌకాయానం బాగా వుందంటే, నౌకానిర్మాణం వున్నట్లే కదా!

వరాహమిహిరుని "బృహత్సంహిత", భోజరాజుయొక్క "యుక్తి కల్పతరు" అనే గ్రంథాల్లో నౌకానిర్మాణం గూర్చి చాలా వివరాలున్నాయి. భోజరాజు తన గ్రంథంలో 26 రకాల ఓడల గూర్చి వివరించాడు.

ఆధునిక కాలారంభంలో కూడా (క్రీ.శ.1700 ప్రాంతంలో) భారతీయ ఓడలను చూసి బ్రిటీషు వ్యాపారులు, ప్రజలూ కూడా... తమ ఓడలకంటే హిందువుల ఓడలు చాలా బలంగా ఉంటాయనీ, చౌకగా తయారు చేయబడుతున్నాయనీ మెచ్చుకునేవారట. దానితో అసూయ చెందిన బ్రిటీషు పాలకులు భారతీయ ఓడలను, సరంగులను నిషేధించారట.

❀❀❀

19. వస్త్రాలు

ఈనాటి చరిత్రకారులనడిగితే... ప్రాచీన భారతీయులకు బట్ట కట్టడమే రాదు. విదేశీయులే నేర్పారు అంటారు.

అయితే వేదకాలంలోనే నూలు, పట్టు, ఉన్ని వస్త్రాల వివరణ వుంది. ఎంబ్రాయిడరీ కూడా వేదకాల స్త్రీలు చేసేవారు. గృత్సమదుడనే ఋషి మొదటగా ప్రత్తి మొక్కలనుండి ప్రత్తి తీసి దారం చేసి, వస్త్రాలు నేయటం కనుగొన్నాడని వేద ఆఖ్యానాల్లో చెప్పబడింది.

ప్రపంచంలో అన్ని దేశాలకు బహుప్రాచీనకాలం నుండి భారతీయ వస్త్రాల ఎగుమతులు జరిగిన ఋజువులున్నాయి. ఢక్కా మల్మల్ వస్త్రాలు గ్రీకు, ఈజిప్టు, అరబ్బు దేశాలకు విరివిగా ఎగుమతి అయ్యేవి.

రామాయణ, భారత కాలాల్లోని అనేక రకాల వస్త్ర ధారణ వివరాలు అందరికీ తెలుసు. చీర మొత్తం గుప్పిట్లో ఇమిడి పోయేంత సన్నని బట్ట నేయగల సమర్ధత, కేవలం భారతీయుల స్వంతం.

అటువంటి మన హిందువులకు వేరెవరో వస్త్రాలగూర్చి నేర్పాలా?

❀❀❀

20. సప్త ఋషులు

ఉత్తర ఆకాశంలో సప్తఋషీమండలం అనబడే ఏడు నక్షత్రాల సమూహం అందరికీ తెలిసే వుంటుంది. చాలా కాంతివంతమైన నక్షత్రాలు ఒక గుంపుగా ఉండి, కనువిందు చేస్తుంటాయి.

ఈ సప్త ఋషుల పేర్లు యేమిటి? సప్తఋషులనగా యెవరు? ఈ ఈ సప్త ఋషుల పేర్లు యేమిటి? సప్తఋషులనగా యెవరు? ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు తెలిసినవారు కొద్దిమందే వుంటారు. ఎన్నో ప్రయోగాల ద్వారా అనేక విజ్ఞానాంశాలను కనుగొని, వాటిని వేదాల్లో పొందుపరచిన ఏడుగురు ఋషులే ఈ సప్తఋషులు. ఆకాశంలో కాంతివంతంగా మెరిసే సప్తఋషీ మండలంలోని తారలకు ఆ సప్తఋషుల పేర్లను పెట్టారు. "వశిష్ఠుడు, గౌతముడు, భరద్వాజుడు, కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, జమదగ్ని" అనే ఏడుగురు సప్తఋషులుగా కొన్ని పురాణాల్లో చెప్పబడ్డారు.

1. వశిష్ఠుడు : కొన్నిరకాల అస్త్రాలను (ఆయుధాలను) కనుగొన్న శాస్త్రవేత్త.
2. గౌతముడు : గోదావరి నదిని ఏర్పరచిన ఇంజినీర్.
3. భరద్వాజుడు : విమానాలను కనుగొన్న మేధావి.
4. కశ్యపుడు : మానసిక శాస్త్రవేత్త. ఫ్రాయిడ్ సిద్ధాంతాలను, ఫ్రాయిడ్ కంటే వేలాది ఏళ్ళముందే నిరూపించాడు.
5. అత్రి : టెలిస్కోపును, బుధగ్రహాన్ని కనుగొన్న శాస్త్రవేత్త.
6. విశ్వామిత్రుడు : రాకెట్‌ను కనుగొన్న శాస్త్రవేత్త.
7. జమదగ్ని : గ్రహణాలపై పరిశోధన చేసిన మేధావి.

వీరి మేధావితనం కారణంగా ఆ ముఖ్యమైన తారలకు వారిపేర్లు పెట్టారు. (ధృవతార చుట్టూ సప్తర్షీ మండలం తిరుగుతూ వుంటుంది. ఈ ఉత్తరాకాశ తారల చుట్టూ ద్వాదశరాశి చక్రంతో సహా, మిగిలిన వేలాది తారలు ప్రదక్షిణం చేస్తుంటాయి. ధృవతార చుట్టూతిరిగే ఉత్తరాకాశ తారల్లో కాంతివంతమైన ముఖ్య తారామండలం సప్తర్షీ మండలమే! అందుకే మొత్తం తారామండలాల్లో ఈ మండలానికో ప్రత్యేకత ఏర్పడింది.)

ఒక విధంగా చూస్తే సప్తఋషీస్థానం అనేది ఒక పదవి. ఒక డిగ్రీ (పట్టా). ఎంతో గొప్ప ఋషులకు యిచ్చే ప్రత్యేక స్థానం. అందుకే ఈ పదవుల్లో ఆ ఋషులను నిలిపారు.

ఇక్కడ మరోవిషయం మనం పరిశీలించడం అవసరం. సప్తఋషుల పేర్లు ఏమిటి? అన్నప్పుడు కొందరు పండితులు మరో ఋషి జాబితాను కూడా చెబుతుంటారు. 1) పులహుడు 2) పులస్త్యుడు 3) క్రతువు 4) అత్రి 5) అంగీరసుడు 6) వశిష్ఠుడు 7) మరీచి. రెండు జాబితాలను చెప్పిన పండితులూ గొప్పవారే! మరి ఏ జాబితా సరైనది?... దీనికో సమాధానం వుంది. ప్రస్తుతం వున్న సప్తఋషీ మండలంలో ఋషి పీఠాలనలంకరించిన ఋషులు మొదటి జాబితాలోనివారే! ఈ రెండవ జాబితాలోని ఋషులు, అంతకంటే పూర్వకాలాన సప్తఋషులుగా ఉండేవారు. ఈ సప్తర్షీ పదవుల్లో ఒక్కొక్క మహాయుగానికి ఏడుగురు చొప్పున ఋషులు మారుతుంటారు. మన మహాయుగంలో మొదటి జాబితాలోని వారు వున్నారు. గత మహాయుగంలో 2వ జాబితా ఋషులుండేవారు. రెండు జాబితాలల్లోనూ అత్రి, వశిష్ఠుడు వున్నారు. అదెలా సాధ్యం అంటే... ఆనాటి అత్రి, వశిష్ఠులు ఈనాటి అత్రి, వశిష్ఠులు ఒకరు కాదు. అవే పేర్లుగల వారిపూర్వులు వారు. ఇకపోతే మరో సంగతి... ఏనాడో గడచిపోయిన మహాయుగంలో సప్తఋషులుగా ఎవరు ఉన్నారనే విషయం తరువాత వారికి ఎలా తెలిసింది? ఎవరు చూసివచ్చారు? ఈ సందేహాలకు నేటి ఆధునిక ఖగోళశాస్త్రజ్ఞులు చెబుతున్న విషయాలే సమాధానం. వారు ఇలా చెప్తున్నారు.

"ఈ సప్తర్షీ మండలం ప్రస్తుతం ఒక రూపంలో అమర్చబడి వుంది. కానీ ఆదికాలం నుండీ ఆ నక్షత్రాలు అదే రూపులో, అవే స్థానాల్లో లేవు.

కాలం గడిచే కొలదీ వాటి స్థానాలు జరిగిపోతున్నాయి. అందువల్ల ఆ తారామండలం రూపుమారిపోతుంది. అయితే ఆ రూపం మార్పు తెలియాలంటే, ఒకటి రెండు కాదు... కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది." అని చెప్పారు. ఈ సిద్ధాంతప్రకారం ఆధునిక శాస్త్రజ్ఞులు లక్ష యేళ్ళక్రితం ఈ తారామండలం మరో రూపంలో ఎలా వుండేదో, ప్రస్తుతం ఎలా ఉందో, మరోలక్ష ఏళ్ళకు మరోలా ఎలా ఉండబోతోందో... పలు రూపాల్లో ఆ తారల స్థానాలను మార్చి చూపిస్తూ... వేర్వేరు రూపాల సప్తర్షి మండలాల బొమ్మలను గీసి చూపించారు.

అదే విషయాన్ని ఈ ఆధునికుల కంటే ముందే పురాణకాలంలోనే ఋషులు కనుగొన్నారు. ఆ విషయాన్ని మనకందించేందుకు ఆ సప్తఋషీ తారలను సప్తర్షి పీఠాలుగా ఎంచి, వాటికి ఉత్తమ ఋషుల నామాలను పెట్టారు. ఆ తారల స్థానాలు మారినా, సప్తర్షిమండల స్వరూపం మారినా, అవి ఉత్తమ ఋషి పీఠాలు కనుక స్వరూపం బాగా మారినప్పుడు, ఋషిబృందం పేర్లు మార్పు చేశారు. కాలం మారే కొలదీ ఆ పదవుల్లో ఋషులు మారుతున్నట్లు చూపించారు. అయితే మరీచి, పులహుడు మొదలైన ఋషులందరూ కూడా నిజానికి మన మహాయుగంలోనివారే! కానీ గత మహాయుగంలో ఎవరెవరు జీవించారో తెలియదు కదా! అందువల్ల కొందరు సీనియర్ ఋషులపేర్లనే, గత యుగపు ఋషి పీఠాల్లో నిలిపారు.

ఏది ఏమయితేనేం? సప్తర్షి మండల స్వరూపం మారిపోతున్న విజ్ఞాన విషయాన్ని వేలాది ఏళ్ళ క్రితమే కనుగొన్న మన హిందూ ఋషులను అభినందించక తప్పదు.

పశ్చిమదేశాల వారు ఎంతటి వారంటే... తమ స్వంతం కాకపోయినా అది కాస్త గొప్పగానో, వింతగానో కనిపిస్తే చాలు... అది తమదే అని కేరింతలు కొట్టడం వారి నైజం. దానికి తలఊపడం మనలో కొందరి నైజం. అదెంత హాస్యాస్పదమో చూడండి.

❀❀❀

21. కాలమానం

సంవత్సరానికి 12 నెలలు అనీ, 360 రోజులనీ, రోజుకు 24 గంటలని, గంటకు అరవై నిమిషాలనీ, నిమిషానికి 60 సెకన్లనీ ఏర్పాటుచేసినవారు బాబిలోనియన్లు అని కొందరు ఆధునిక చరిత్రకారులు అంటూంటారు. దీనికి వారు చెప్పే హాస్యాస్పద ఋజువేమిటంటే.... "60" శబ్దమానం అంటే బాబిలోనియన్లకు ఇష్టమట. అందువల్ల ఆ విధంగా గంటకు 60 నిమిషాలు, నిమిషానికి 60 సెకన్లు, సంవత్సరానికి 360 రోజులని విభజించారని చెప్తారు.

పైగా కాలమానంలో ఉపయోగించే అంకెల పద్ధతి కూడా వారినుండే మనం నేర్చుకున్నామని కూడా అంటారు. ఇదెంత చిత్రమో చూడండి! బాబిలోనియన్ల విషయం పరిశీలిస్తే... కేవలం నిమిషాలు, సెకన్లు, సంవత్సరదినాలు మాత్రమే "60" అనే శబ్దంతో వున్నాయి. ఇక మన హిందువుల సంగతి చూద్దాం.

ప్రాచీన హిందూ ఖగోళశాస్త్రవేత్తలు వాడిన కాలమానం ఇలా వుంది. 60 సూక్ష్మ ఘడియలు 1 పరఘడియ, 60 పరఘడియలు 1 విఘడియ, 60 విఘడియలు 1 ఘడియ, 60 ఘడియలు ఒకరోజు.

మొత్తం కాలమానానికే పితామహులుగా బాబిలోనియన్లకు పట్టం కడితే, మరి ఇంత సూక్ష్మంగా కాలమానం చెప్పిన మనవారినేమనాలి? ఈ లెక్కలకు ఆద్యులెవరు?

అంతేకాకుండా గంటకు 60 ని॥, నిమిషానికి 60 సెకండ్లు అనే పద్ధతి కేవలం 13వ శతాబ్ది నుండి మాత్రమే వచ్చిందని ఈ ఆధునికులే అంటున్నారు. మరి మన కాలమానం రామాయణ, భారతకాలాల నుండీ కనిపిస్తుంది. ఆర్యభట్టాది హిందూ సైంటిస్టుల కాలం నుండీ వస్తున్నది. మరి ఎవరినుండి ఎవరు నేర్చుకొనే అవకాశం వుంది? ఆలోచించండి.

మరో విశేషం ఏమిటంటే.... "60" శబ్దం ప్రధానం కాదిక్కడ. "3" అనే అంకెది ప్రాధాన్యతగా కనిపిస్తోంది. ఆ విధంగా "3"తో పెనవేసుకున్న

కాలమాన రచయితలు ఖచ్చితంగా హిందువులే! అంటే వారి కాలమానం అంకెల్లో హెచ్చు సంఖ్యలు 3 గుణకంతో వుంటాయి. (అనగా 3చే నిశ్శేషంగా భాగించబడతాయి.) పైన వ్రాసిన ఘడియల మానమే కాదు. ఇంకా మన భారత కాలమానాల్లో... కాలాలు-3, ఋతువులు-6, మాసాలు-12, రోజుకు హోరలు-24, మాసానికి రోజులు-30, పుష్కరానికి సంవత్సరాలు-12... చివరకు సంవత్సర చక్రానికి సంవత్సరాలు 60. ఇంత చక్కగా ఏర్పరచబడిన అంశాల్లో చాలా విషయాలు... కేవలం ఖగోళ, భూగోళ విజ్ఞానానుసారంగా మాత్రమే ఏర్పాటు చేయబడ్డాయి. ఎవరికి తోచినట్లు వారు రచించిన కాలమానం కాదిది. ఇది వేలాది సంవత్సరాల కాలం నుండీ ఆచరించబడు తున్నట్లుగా వేద, పురాణేతిహాసాలు చెప్తున్నాయి. మన వారినుండే విదేశీయులు ఈ కాలమాన పద్ధతుల్ని సేకరించుకున్నారని చెప్పవచ్చు. ఎందుకంటే మన కాలమానంలో ఉన్నన్ని పద్ధతులు, విభాగాలు ఇతర జాతుల వారెవరి కాలమానాల్లోనూ లేవు. చివరకు... యుగానికి సంవత్సరాలు, మహాయుగానికి సంవత్సరాలు, కల్పకానికి సంవత్సరాలు కూడా "3"చేత నిశ్శేషంగా భాగించబడేవే. కేవలం ఖగోళ, భూగోళ విజ్ఞాన బంధమే కాకుండా, మూడు అంకె అంటే హిందువు లకు పవిత్రభావన కూడా ఉంది. అందుకే ముల్లోకాలు, త్రిమూర్తులు, త్రిమాతలు వంటి పవిత్రాంశాలెన్నో మన వాడుకలో ఉన్నాయి.

❀❀❀

22. రోజుకు ఎన్ని గంటలు?

సౌలభ్యం కోసం మన ప్రాచీనులు 'రోజు' ను చిన్న చిన్న విభాగాలుగా చేశారు. ఒకరోజు అంటే ఒక పగలు + ఒక రాత్రి కదా! దాన్నే సంస్కృత భాషలో "అహోరాత్రం" అంటారు. పగటి వేళను 12 భాగాలుగా, రాత్రివేళను 12 భాగాలుగా... మొత్తం 24 భాగాలుగా విభజించారు. మరి ఆ భాగానికి పేరు పెట్టాలి కదా! ఈ 24 భాగాలు, ఒక అహోరాత్రంలోవి కనుక "అహోరాత్రం" అనే పదంలోని మధ్య అక్షరాలు రెండింటితో ఆ భాగానికి "హోరా" అని పేరు పెట్టారు. ఆ విధంగా "రోజు"ను ప్రప్రథమంగా 24 హోరలుగా విడదీశారు హిందూ ఋషులు.

తదుపరి కాలంలో ఇతర విదేశీ జాతులన్నీ ఈ పద్ధతినే స్వీకరించాయి. ప్రస్తుతం అదే పద్ధతి ప్రపంచమంతా అమలులో వుంది. ఆ "హోర" అనే పేరు, ఇంగ్లీషువారి నోట నలిగి, నేటికి "హవర్" (HOUR)గా మారింది. ఈ "అహోరాత్రం" అనే పదం, దానినుండి పుట్టిన "హోర" అనే పదం సంస్కృత పదాలు. కనుక ఈ "హోర"ల విభాగ రచన, హిందువులదే అని ఖచ్చితంగా చెప్పవచ్చు. (కాలాన్ని తెలిపే గడియారాలను, పురాణకాలంలో 'ఘటికా యంత్రాలు' అనేవారు.

దినంలోని ఒక్కొక్క "హోర"కు ఒక్కొక్క గ్రహం అధిపతిగావుండి ఫలితాలను ఇస్తుందని, మన జ్యోతిషశాస్త్రం చెబుతుంది. అలా వరుసగా హోరకాలానికి ఒక గ్రహం మారుతూ ప్రభావం చూపుతుందట. ఏదయినా క్రొత్త కార్యక్రమం, శుభకార్య ప్రయాణం ఆరంభించాలంటే ఈ గ్రహఫలితాలను అనుసరించి, ఏ హోరలో మంచి జరుగుతుంది? ఏ హోరలో ఆటంకాలు రావచ్చు?... ఇలాంటి ముహూర్తాలను చూసేవారు. ఈనాటికీ మన పంచాంగాల్లో హోరాకాలం చూసుకుని కార్యక్రమాలు చేపట్టే అలవాటు కొందరిలో వుంది.

ఆ విధంగా "హోర" అనే కాల పరిమాణం ఏర్పడ్డాక, అందరికీ టైము ఎంతయిందో తెలియడం కోసం... రాజుల కోటల్లో, దేవిడీల్లో, గ్రామ పాలనా కార్యాలయాల్లో హోరా కాలం పూర్తికాగానే, ఆ రోజున ఎన్ని హోరలు పూర్తయితే, అన్ని సార్లు గంట వాయించేవారట. అంటే ఎన్ని గంటలు కొడితే, అన్ని హోరలు జరిగినట్లు లెక్క. అందుకే క్రమంగా హోరా కాలానికి 'హోర' అనే పదం బదులు "గంట" అనే పదం స్థిరపడిపోయింది. ఆ విధంగా రోజుకు 24 గంటలు అనే హిందూ విధానం క్రమంగా ప్రపంచవ్యాప్తమయింది.

❀❀❀

23. వారాలపేర్లు ఎవరు పెట్టారు?

ప్రస్తుతం మన ప్రపంచంలో చాలావరకు 'ఏడు రోజుల వారాన్నే' ఆచరిస్తున్నారు. ఎన్నో దేశాల ప్రజలు, ఇదే ఏడురోజుల వారాన్ని, అవే వారాల పేర్లతో ఆచరిస్తున్నారు. మన తెలుగు భాషలో 1) ఆదివారం

2) సోమవారం 3) మంగళవారం 4) బుధవారం 5) గురువారం 6) శుక్రవారం 7) శనివారం అంటాం. వివిధ దేశాలవారు, వివిధ ప్రాంతాలవారు కూడా వారి వారి భాషల్లో ఇవే పేర్లు వాడుకుంటున్నారు. మరి అన్ని దేశాలవారూ ఇవే వాడుతుంటే... ఇంతకూ వీటిని ప్రప్రథమంగా కనుగొన్నవారెవరు? వారానికి 7 రోజులుండాలని నిర్ణయించినదెవరు? వాటికి గ్రహాల పేర్లు పెట్టాలని సూచించిన దెవరు? "మేమే సూచించాము. మేమే సూచించాము." అంటూ ఈజిప్షియన్లు, బాబిలోనియన్లు, గ్రీకులు, మయజాతులు, ముస్లింలు, క్రైస్తవులు, చైనావారు, భారతీయులు... అందరూ పోటీ పడుతున్నారు. మరి నిజం ఏమిటి? ఎవరు కనుగొన్నారు? ఈ సమస్య ఎవరు తీరుస్తారు? దీనికోసం కొన్ని విదేశీ మేధావి గణాలు రంగంలోకి దిగాయి. ఏవో పరిశోధనలు చేశాం అన్నారు. చివరకు ఈ ఏడురోజుల వారాన్ని, వారాలపేర్లను బాబిలోనియన్ల స్వంతమని మూటకట్టి అప్పజెప్పారు. పైగా వారం అనే కాలవిభాగం కానీ, వారాలపేర్లు కానీ, మనుషులు తాము స్వంతంగా ఏర్పరచుకున్నవేననీ, వాటికి ఖగోళంతో గానీ, భూగోళంతో గానీ ఏవిధమైన సంబంధం లేదని తేల్చిపారేశారు. విదేశీ మేధావులిచ్చిన ఈ తీర్పుకు మన స్వదేశీ మేధావులు జేజేలు కొట్టడం మామూలే కదా! అలా కాలం జరిగిపోతుంది. మనవారు కొందరు మాత్రం, మనప్రాచీన విజ్ఞాన ప్రగతి పతాకం విజయవంతంగా ఎగరాలని ఎంత ప్రాకులాడినా, ఈ విదేశీ భజనలు వాటిని అడ్డుకుంటూనే ఉన్నాయి.

ఇంతకూ అసలు విషయం ఏమంటే...ఈ వారాలు, వాటి పేర్లు కనుగొన్నది ఖచ్చితంగా మన హిందూ ప్రాచీనులే! నవగ్రహ పూజ చేయడంలో ఆద్యులు హిందూ ఋషులు. అందులో ఛాయాగ్రహాలను తప్పించగా, మిగిలిన సాకార గ్రహాలు 7. కనుక వారానికి 7 రోజులు వుండాలని నిర్ణయించిన మొదటి మేధావులు హిందువులే!ఇలా చెప్పడానికి ముఖ్యంగా 3 కారణాలున్నాయి.

1) సూర్యచంద్రులను గ్రహాలుగా భావిస్తూ, వాటిని నవగ్రహాల్లో చేర్చి, హిందువులు వాటిని నవగ్రహదేవతలుగా పూజిస్తారని చాల విదేశీజాతుల వారు మనల్ని విమర్శిస్తుంటారు. (కొన్ని విదేశీ జాతులవారు కూడా సూర్య

చంద్రులను గ్రహదేవతలుగా పూజిస్తుంటారు. బహుశా ఆ అలవాటు మన నుండే వారికి సంక్రమించిందేమో) మరి వారాలపేర్లు పెట్టినప్పుడు, గ్రహాలు కానటువంటి 'సూర్యచంద్రుల పేర్లు' మిగతా గ్రహాలతో పాటుగా బాబిలోనియన్లు ఎందుకు అమర్చినట్లు? మన హిందువులు సూర్య చంద్ర సహిత నవగ్రహ పూజ చేసేవారు కనుక ఆ విధంగా పేర్లు పెట్టడంలో ఆశ్చర్యం లేదు. (మరి బాబిలోనియన్లు అలా చెయ్యరు కదా!)

2) పూర్వం కొందరు ఆఫ్రికన్లు 4 రోజుల వారాన్ని వాడేవారట. అంటే వారి వారానికి నాలుగే రోజులు. అలాగే ఆసియా, ఐరోపా, అమెరికాల్లో కొన్ని ప్రాంతాల్లోనూ ఐదు రోజుల వారం వాడినట్లు తెలుస్తుంది. చాల్డియన్లు ఆరురోజుల వారం యేర్పరచుకున్న కాలెండర్లు వుండేవి. ప్రాచీన రోమన్లు ఎనిమిది రోజుల వారాన్ని ఆచరించిన ఋజువులున్నాయి. ఈజిప్షియన్లు కూడా కొంతకాలం పదిరోజుల వారాన్ని వాడుకున్నారు. గ్రీకులు, చైనీయులు కూడా కొంతకాలం పదిరోజుల వారాన్నే వాడుకున్నారు. అలా ఎందరో ఎన్నోరకాల వారాలు వాడుకున్న ఋజువులున్నాయి. కానీ హిందువులు మాత్రం ఆనాటినుండి ఈనాటి వరకు, ఏడురోజుల వారాన్నే ఆచరిస్తున్నారు. అటువంటి హిందువులకు వేరెవరో ఏదో నేర్పాలా?

చాల్డియన్లు (జాబిలోనియన్లు)కు కూడా జ్యోతిషం గూర్చి తెలుసునని, సూర్యచంద్రులతో సహా గ్రహాల ప్రభావం మానవులపై వుంటుందని వారు నమ్మేవారనీ, అందువలన వారే ఈ వారాలను రచించారనీ, మరో మిథ్యావాదాన్ని ముందుకు తెచ్చారు కొందరు పెద్దలు.

చాల్డియన్లకు కూడా అటువంటి సూర్యచంద్ర సహిత నవగ్రహాల ననుసరించిన జ్యోతిషం వుండవచ్చు. కానీ జ్యోతిషశాస్త్రం పుట్టింది హిందువుల వద్దే అనేది నిజం. ఈ జ్యోతిష శాస్త్రాన్ని హిందువుల నుండే చాల్డియన్లు, ఇతర జాతులూ నేర్చుకున్నారు. మనకైతే వేదకాలంనుండీ జ్యోతిషశాస్త్రం కొనసాగుతుంది. రామాయణ, మహాభారతాల్లో కూడా మన

జ్యోతిషశాస్త్రం, నవగ్రహ సంచార విషయాలు అన్నీ వున్నాయి. అంటే చాల్డియన్లకంటే ముందు కాలం నుండీ మనకు ఈ శాస్త్రాలు వున్నాయని ఖచ్చితంగా తెలుస్తుంది.

3) ఇక ఈ వారాల గూర్చి మరో ముఖ్యమైన ఋజువు ఉంది చూడండి. వారాల పేర్లను ఒకసారి పరికించండి. ఒక వరుస, ఒక పద్ధతి ఉన్నట్లుగా కనిపించదు. అంటే ఆదిత్యుడి (సూర్యుని) పేరున ఆదివారంతో వారం మొదలవుతుంది సరే! తదుపరి సోముడి (చంద్రుని) పేర సోమవారం వచ్చింది. అంటే మన కంటికి కనిపించే గ్రహ పరిమాణం ఆధారంగా ఈ వారాల వరుస వచ్చిందేమో అనుకుంటే... మూడవరోజు మంగళుడి (కుజుని) కంటే పెద్ద ఆకృతిలో కనిపించే శుక్రుడు, గురువు వెనుకబడిపోయారు. గ్రహాల సైజును బట్టి వరుస ఏర్పడిఉంటే, అన్నింటికన్నా పెద్ద గ్రహమైన గురుడు రెండవ స్థానంలోకి, శని మూడవ స్థానంలోకి రావాలి. కానీ వాటికంటే ముందుగా చంద్రుడు రెండవ స్థానంలో, మంగళుడు (కుజుడు) మూడవ స్థానంలో, అతిచిన్న వాడయిన బుధుడు నాలుగవస్థానంలో వచ్చారు. అంటే గ్రహపరిమాణం ప్రకారం కూడా వారాల వరుస ఏర్పడలేదని తెలుస్తుంది.

సూర్యుని నుండి మొదలై వరుసగా పేర్లు పెట్టుకుంటూ వెళ్తే... సూర్యునికి బాగా దగ్గరగా ఉన్న బుధగ్రహం రెండవ స్థానంలోను, ఆ తరవాత దగ్గర గ్రహం శుక్రుడు మూడవ స్థానంలోను.... అలా రావలసి ఉంది. అలా అయితే ఆదివారం తరువాత రెండవరోజుగా బుధవారం రావాలి. తరవాత శుక్రవారం రావాలి. మరి రెండవరోజుగా సోమవారం ఎందుకొచ్చినట్లు?

పోనీ సూర్యునికి అతిదూరంలో వున్న గ్రహం నుండి వారాల లెక్క మొదలయిందని అనుకుంటే... రెండవ రోజు శనివారం రావాలి. అలా రాలేదు. అనగా మొత్తం మీద ఇవేవీ వారాల వరుసకు మూలకారణం కాదని తెలుస్తుంది.

అయితే ఒక వరుస లేకుండా అడ్డదిడ్డంగా ఈ వారాలకు గ్రహనామాలు ఎందుకు వచ్చాయి? బాబిలోనియన్లు కావచ్చు. లేదా మరో

విదేశీజాతివారు కావచ్చు. ఎవరయినా సరే, ఈ వారాల వరుస దేనిని బట్టి ఏర్పరచారు అనేదే ప్రశ్న.

ఆ ప్రశ్నకు విదేశీయులవద్ద సమాధానం లేదు. కారణం.... వారెవరూ ఈ వారాల పేర్లను, వాటి వరుసను తయారుచేయలేదు. అయితే కుహనా మేధావులు మరోప్రక్కదారి పడుతూ ఇలా చెప్పుకొచ్చారు. 'ఈ వారాల పేర్ల వరుసను బాబిలోనియన్లు ఖగోళ, భూగోళాలతో ఏ విధమైన బంధం లేకుండానే సరదాగా ఏర్పాటు చేసేశారనీ, మిగిలిన ప్రపంచమంతా దాన్నే అనుసరించిందనీ, మన హిందువులు కూడా అమాయకంగా దాన్నే ఆచరిస్తున్నారనీ' తేల్చి పడేశారు. వాళ్ళ సంగతి సరే... అలాగే అంటారు వాళ్ళు. యథార్థంగా మనసంగతి ఇప్పుడు చూద్దాం. దినం, వారం, పక్షం, మాసం, సంవత్సరం..... అన్నీ ఖగోళాధారంగా ఏర్పరచుకోవటం మన ప్రాచీన హిందువుల అలవాటు. ఆవిధంగానే ప్రాచీన హిందువులు ఈ వారాల పేర్లను, వాటి వరుసనూ తయారుచేశారు. మనవారు ఏర్పరచిన వారాలపేర్ల వరుసకు ఒక అద్భుతమైన కారణం ఉంది. ఆ విషయాన్ని ఇప్పుడు తెలుసు కుందాం.

మన హిందువులు పూజించే గ్రహాలు తొమ్మిది. అవి సూర్యుడు, చంద్రుడు, బుధుడు, శుక్రుడు, కుజుడు, గురుడు, శని, రాహువు, కేతువు. ఈ నవగ్రహాలచారం ఆధారంగా జ్యోతిషగ్రంథాలు నడుస్తాయి. నవగ్రహ దేవతలుగా వీరిని పూజిస్తాం. వీటినుండి హోరా కాలాలకు అధిదేవతలను ఎంపిక చేశారు. వీటిలో రాహువు, కేతువు సాకారగ్రహాలు కాదు. అవి ఛాయా గ్రహాలని వారు గుర్తించినందునే, ఆ రెండు గ్రహాలనూ వారం పేర్ల ఎంపిక నుండి తొలగించారు. సూర్యుడు ఒక గ్రహం కాదనీ ఒక నక్షత్రమనీ వారికి తెలుసు. అయినా సూర్యుని ప్రభావం జీవులపై ఉంటుంది కాబట్టి మరియు సాకారగోళం కాబట్టి సూర్యుణ్ణి తొలగించలేదు. ఒక ప్రక్క వుంచారు. అలాగే చంద్రుడు గ్రహం కాదు. ఉపగ్రహం. కనుక చంద్రుణ్ణి

ఓ ప్రక్క నుంచారు. ఇక మిగిలింది ఐదు గ్రహాలు. వీటిని ఒక వరుసలో నిలపాలి. ఏ గ్రహాన్ని ముందుగా వుంచాలి? మిగిలినవాటిని ఏ వరుసలో వుంచాలి? అని ఆలోచించారు. ఈ 5 గ్రహాలూ సూర్యునిచుట్టూ తిరిగేవే. ఆ విధంగా సూర్యుని చుట్టూ ఒకసారి ప్రదక్షిణ పూర్తిచేయడానికి ఏ గ్రహం ఎక్కువ సమయం తీసుకుంటుందో ఆ గ్రహాన్ని, ప్రథమస్థానంలోకి తీసుకొచ్చారు. అదేవిధంగా ఆయాగ్రహాల ప్రదక్షిణ కాలాల్లో ఎక్కువ కాలం తీసుకునే వరుసను బట్టి, వాటి స్థానాలను నిర్ణయించారు. అంటే సూర్యుని చుట్టూ తిరిగిరావటానికి శనిగ్రహానికి ముప్పయి సంవత్సరాలు పడుతుంది కనుక, శనిగ్రహాన్ని ప్రథమ స్థానంలో వుంచారు. తరువాత గురుగ్రహం ప్రదక్షిణకాలం పన్నెండు సంవత్సరాలు కనుక, గురుణ్ణి రెండవస్థానంలో వుంచారు. తరువాత కుజుడి ప్రదక్షిణకాలం రెండు సంవత్సరాలు కనుక, మూడవ స్థానంలో వుంచారు. శుక్రుడి ప్రదక్షిణ కాలం రెండువందల నలభై మూడు రోజులే కనుక, నాలుగవ స్థానంలో నిలిపారు. ఆపైన బుధగ్రహ ప్రదక్షిణ కాలం ఎనభై ఎనిమిది రోజులు కనుక, దాన్ని ఐదవస్థానంలో ఉంచారు. అలా మొత్తం 5 గ్రహాల అమరిక తరువాత ఆరవస్థానంలో ఉపగ్రహమైన చంద్రుణ్ణి వుంచారు. మరి సూర్యుడి స్థానం యెక్కడ? సూర్యకేంద్ర సిద్ధాంతం బాగా తెలిసినవారు కనుక, సూర్యుణ్ణి మధ్యస్థానంలోనే నిలబెట్టారు. అప్పుడు గ్రహాల వరుస ఇలా వస్తుంది. శని - గురుడు - కుజుడు - సూర్యుడు - శుక్రుడు - బుధుడు - చంద్రుడు.

మన పూర్వీకులు తాము ఏర్పరచిన 1 నుండి 24 హోరలతో ఒక పట్టికను తయారుచేశారు. (వారాలపేర్లను నిర్ణయించడానికే ఈ పట్టికను రూపొందించారు.) రోజుకు 24 హోరలనీ, వరుసగా ఒక్కొక్క హోరకు ఒక్కొక్క గ్రహం అధిదేవుడవుతాడని చెప్పుకున్నాం కదా! అలా ఏ హోరకు ఏ గ్రహం అధిపతి అవుతాడో తెలిపే పట్టిక ఇది. అందరిలో సూర్యుడు ముఖ్యుడు కనుక మొదటి హోరను సూర్యుడితో ప్రారంభించి, వరుసగా హోరకు ఒక గ్రహం చొప్పున 24 హోరల్నీ వరుసగా మళ్ళీ మళ్ళీ గుర్తిస్తూ వెళ్ళారు.

శని	గురుడు	కుజుడు	సూర్యుడు	శుక్రుడు	బుధుడు	చంద్రుడు
			మొదటిరోజు			
-	-	-	①	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
						2వ రోజు
19	20	21	22	23	24	①
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
		3వ రోజు				
23	24	①	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
					4వ రోజు	
20	21	22	23	24	①	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
	5వ రోజు					
24	①	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
				6వ రోజు		
21	22	23	24	①	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
7వ రోజు						
①	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24				

1 అనే అంకెతో మొదటి హోరాధిపతి ఎవరి గడిలో గుర్తించబడి ఉందో, దాన్నిబట్టి ఏడుగ్రహాల వరుసనూ ఏర్పాటు చేయడం జరిగింది. అతి ముఖ్యుడైన సూర్యునితో మొదటిహోరను ప్రారంభించారు కనుక... మొదటి హోరాధిపతి (మొదటి హోర...1 అనే అంకె) ప్రథమంగా సూర్యుని గడిలో వచ్చింది కనుక, వారంలోని మొదటిరోజును ఆదిత్యుని (సూర్యుని) పేరుతో 'ఆదివారం'గా ఏర్పరచారు. రెండవరోజు మొదటి హోరాధిపతి (మొదటిహోర... 1 అనే అంకె) చంద్రుని (సోముని) గడిలో వచ్చింది కనుక, ఆయన పేరున ఆ రోజు 'సోమవారం' అయింది. మూడవ రోజు మొదటి హోరాధిపతి కుజుడు. కనుక కుజుని (మంగళుని) పేరుతో 'మంగళవారం' ఏర్పడింది. నాలుగవరోజు మొదటి హోరాధిపతి బుధుడు కనుక, ఆ రోజును 'బుధవారం' అన్నారు. ఐదవరోజు మొదటి హోరాధిపతి గురుడు కనుక, ఆ రోజు 'గురువారం' అయింది. ఆరవరోజు మొదటి హోరాధిపతి శుక్రుడు కనుక, ఆ రోజు 'శుక్రవారం' అయింది. ఏడవ రోజు మొదటి హోరాధిపతి శని కనుక, ఏడవ రోజు 'శనివారం' గా చెప్పబడింది.

వారాలపేర్లు, వరుస ఏర్పడిన విధానం ఇది. ఇంత మెలికలతో కూడిన ఈ విధానం చూశాకనైనా, ఇది హిందువుల ఆవిష్కరణ అని గుర్తించడం బుద్ధిమంతుల లక్షణం. విదేశీ జాతుల వారెవరికీ ఈ విధానం ఏమిటో తెలియకపోయినా, అన్ని ప్రాంతాలవారూ ఈ పద్ధతినే తమ తమ భాషల్లోకి మార్చుకుని వారాలను వాడుకుంటున్నారు. (కొందరైతే ఆ పద్ధతి తామే కనుగొన్నామని బుకాయిస్తున్నారు కూడా!)

ఈ పట్టికలో గ్రహాల వరుస ఎలా ఏర్పాటు చేశారనే విషయం మరో విధంగానూ చెప్పవచ్చు. ముందుగా సూర్యునికి దూరంగా వున్న గ్రహంతో మొదలుపెట్టి, వరుసగా సూర్యుని వరకూ వ్రాసుకోవాలి. అనగా ముందుగా అతి దూర గ్రహం 'శని'తో మొదలెట్టి వ్రాయగా... శని - గురు - కుజ - శుక్ర - బుధ - సూర్య అని వస్తాయి. సూర్యకేంద్ర సిద్ధాంత ప్రకారం సూర్యుడు మధ్యలో వుండాలి కనుక... కుజ, శుక్రుల మధ్యకు సూర్యుణ్ణి చేర్చాలి. అప్పుడు సూర్యుడు ఖాళీ చేసిన చివరిస్థానాన్ని చంద్రుడితో భర్తీ చేయాలి.

అప్పుడు శని - గురు - కుజ - సూర్య - శుక్ర - బుధ - చంద్ర అవుతుంది. మొదట చెప్పినదానికి సరిపోయింది కదా ఇప్పుడు.

ఈసారి మనం తిథుల పేర్లు ఎలా వచ్చాయో తెలుసుకుందాం రండి.

"రోజు" అనే కాలాన్ని మన హిందువులు 3 రకాలుగా లెక్కిస్తారు. 1) సూర్యోదయం నుండి తరువాత సూర్యోదయం వరకు ఒక రోజు అనేది ఒకరకం. 2) చంద్రకళల ఆధారంగా లెక్కించటం. చంద్రుడు అమావాస్య నాడు అసలు కనిపించడు. కారణం యేమిటంటే చంద్రుడి యొక్క రాత్రి భాగం మనవైపు, పగటిభాగం ఆవలివైపు వుండడం వలన, నల్లని ఆ రాత్రి చంద్రుడు మనకు కన్పించడు. చంద్రుడి ఆత్మభ్రమణం వలన రోజురోజుకు కొంత భాగం చొప్పున చంద్రుడి పగటిభాగం మనకు కనిపిస్తుంటుంది. అలా రోజుకు కొంత భాగం చొప్పున పెరిగి 15 రోజులకు పూర్తి చంద్రబింబం కనిపిస్తుంది. అదే పూర్ణిమ (పౌర్ణమి). ఆ 15 రోజులను 'శుక్లపక్షం' లేక 'శుద్ధ పక్షం' అంటాం. ఆ మరునాటినుండి రోజుకు కొంత భాగం చొప్పున బింబం తరిగిపోతూ 15 రోజులకు మళ్ళీ అమావాస్య వస్తుంది. ఈ 15 రోజులను 'బహుళ పక్షం' లేక 'కృష్ణపక్షం' అంటాం. ఇలా రోజూ పెరగడం, తరగడాన్నే 'చంద్రకళలు' అంటాం.

అలా ఏరోజుకు చంద్రుడు ఎన్ని భాగాలు పెరిగింది? లేక తరిగింది? అని గుర్తించేందుకు ఈ కళలకు పేర్లు పెట్టారు. పేర్లంటే నిజంగా పేర్లు కాదు. ఎన్నో భాగం? అని చెప్పే మానం.

అమావాస్య మరునాటికి ఒక భాగం చంద్రుడు దర్శనమిస్తాడు. అలా "ఒక భాగం" కనిపిస్తుంది. అది ప్రథమ భాగం కనుక, ఆ రోజుకు "ప్రథమ" అని పేరు పెట్టారు. ప్రథమ → పదమ → పాదమ → పాడ్యమిగా రూపాంతరం చెంది నేటికి 'పాడ్యమి' తిథిగా మిగిలింది. రెండవరోజు రెండు భాగాలు కన్పించేరోజు కనుక "ద్వితీయ" అన్నారు. ఆ పేరే క్రమంగా ద్వితీయ → ద్విదీయ → 'విదియ'గా మారిపోయింది. ఆ మరునాడు మూడవ దినం కనుక, తృతీయ అన్నారు. ఆ పదం క్రమంగా తృతీయ → తతీయ

→ 'తదియ'గా మారింది. (ఈనాటికీ ఒక అక్షయతృతీయ రోజును మాత్రం తృతీయ అనే అంటారు). నాలుగవరోజు అని చెప్పటానికి "చతుర్థి" అన్నారు. కాలక్రమేణా చతుర్థి → చతుతి → 'చవితి'గా మారిపోయింది. అక్కడినుండి వరుసగా 5వ రోజును పంచమి, ఆరవరోజు షష్ఠి, ఆ మరునాడు సప్తమి... అలా ఆ రోజుయొక్క సంఖ్యను తెలిపే విధంగా అష్టమి, నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి అంటూ... చంద్రుడు పెరిగే, (తరిగే) భాగాల సంఖ్యను లెక్కిస్తాం. అలా సంస్కృత అంకెలతో తిథినామాలు ఏర్పడ్డాయి. పౌర్ణమి వైపు పయనించే రోజులను శుద్ధపక్షం అంటాం కనుక, ఆ పక్షంలోని తిథినామానికి ముందు "శుద్ధ" అనే పదాన్ని చేర్చి పలకాలి. అనగా శుద్ధపాడ్యమి, శుద్ధ విదియ, శుద్ధ దశమి, శుద్ధత్రయోదశి...ఆ విధంగా!

పౌర్ణమి మరునాటి నుండి మళ్ళీ అదే అంకెల పేర్లతో తిథులుంటాయి. అమావాస్య వైపు పయనించే ఆ తిథి నామాలకు ముందు "బహుళ" అని చేర్చాలి. మరి అది బహుళపక్షం కదా! ఈ పక్షంలో చంద్రుడు తరగిపోయే భాగాల సంఖ్యను లెక్కిస్తాం.

ఈ మానం వలన రోజు లెక్క తెలియడంతో పాటు, చంద్రుడు ఏ రోజున ఏ స్థాయిలో ఉన్నాడనే ఖగోళ విజ్ఞానం కూడా తెలుస్తుంది.

అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి ఉంది. తిథులన్నింటి పరిమాణాలు సమంగా వుండవు. ఒక తిథి (అనగా ఒక భాగం పూర్తి కావడానికి పట్టే కాలం) ఎన్ని గంటల ఎన్ని నిమిషాలు ఉంటుందో, తదుపరి తిథి అంతే సమయం వుండదు. ఒక తిథి సమయం హెచ్చుగా మరొకటి తక్కువగా వుంటాయి. అందుకే తిథి ఎంత సమయం వుంటుంది? ఎన్నిగంటల ఎన్ని నిమిషాలకు మొదలై, ఎన్ని గంటల ఎన్ని నిమిషాలకు పూర్తవుతుంది? అనే విషయాలను క్షుణ్ణంగా పరిశోధించి పంచాంగాల్లో వ్రాసి మనకు అందించారు మన ప్రాచీన హిందూ మేధావులు.

ఇక రోజును లెక్కించే 3వ రకం సంగతి చూద్దాం.

చంద్రుడు రాశిచక్రం పొడవునా సంచారం చేసేటప్పుడు రాశి చక్రంలో చెప్పబడిన 27 నక్షత్రాల ప్రక్కగా పయనిస్తాడు. ఆ ప్రయాణంలో చంద్రుడు ఒక్కొక్క నక్షత్ర పరిధిలో సుమారుగా ఒక్కొక్క రోజు వుంటాడు. కానీ అన్ని నక్షత్ర పరిధుల్లో సమంగా ఉండడు. ఒక తారా పరిధిలో ఎక్కువ సమయం ఉండవచ్చు. మరో తారా పరిధిలో తక్కువగా వుండొచ్చు. ఆ సమయాలను కూడా చక్కగా పరిశోధించి పంచాంగాల్లో చేర్చారు. ఇది "రోజు"ను కొలిచే మూడవ పద్ధతి. అలా చంద్రుడు ఏ తారాపరిధిలో ఉంటాడో, ఆ రోజును ఆ నక్షత్రం పేరుతో వ్యవహరిస్తారు. దీనివలన పంచాంగంలో చూసినంతనే ఆకాశంలో చంద్రుడు ఏ స్థానంలో వున్నదీ మనం గ్రహించవచ్చు.

అలాగే రవి, బుధ, శుక్ర, కుజ, గురు, శని సంచారాలను కూడా ఖచ్చితంగా లెక్కించి పంచాంగాల్లో చేర్చారు. వాటివలన ఆకాశంలో ఏ గ్రహం ఎక్కడవుందో మనం గుర్తించవచ్చు. మన ఆచారాలు మూఢాచారాలు కావనీ, అవి పూర్తిగా విజ్ఞాన భరితమైనవనీ ఇందుమూలంగా స్పష్టంగా తెలుస్తుంది.

సూర్యుడు ఒక నక్షత్రపరిధిలో వుండే 15 రోజుల కాలాన్ని, ఆ నక్షత్రం పేరుతో "కార్తె" అంటాం.

చంద్రుడు పౌర్ణమినాడు ఏ నక్షత్ర పరిధిలో వుంటాడో, ఆ నక్షత్రం పేరుతో ఆ మాసం యొక్క పేరు ఏర్పడుతుంది.

గురుడు ఏ రాశిలో వుంటే, ఆ రాశికి సంబంధించిన నదికి పుష్కరాలు నిర్వహిస్తాం. (ఒక్కో రాశికి ఒక్కొక్క పవిత్ర నదితో జత యేర్పరచారు).

ఇంత క్షుణ్ణంగా ప్రతి విజ్ఞాన విషయాన్నీ కనుగొని, ఇతర జాతులకు తెలియని ఎన్నో విషయాలను కూడా మన వేద, పురాణాల్లో భాగాలుగా, ఆచార, సంప్రదాయాలుగా మన పూర్వీకులు మనకు అందించగా... వాళ్ళకేమీ తెలియదనీ, పరాయివారే మనకు అన్నీ నేర్పారనీ, తప్పుడు కూతలు కూస్తుంటారు మనలోనే కొంతమంది. వారి మూర్ఖత్వాన్ని ఖండించవలసిన బాధ్యత మనపై ఉంది.

❀❀❀

24. రాశి చక్రం

రాశిచక్రం గురించి మనకు తెలియదనీ, దాన్ని బాబిలోనియన్లే మొదటగా గుర్తించి అందరికీ నేర్పారనీ కుహనా మేధావులు అంటుంటారు. రాశిచక్రమే కాదు. రాశిచక్రం, గ్రహచారాల ఆధారంగా యేర్పడిన జ్యోతిషశాస్త్రం కూడా బాబిలోనియన్లే కనుగొని మనకు నేర్పారని కూడా వాళ్ళు అంటారు. రాశిచక్రం, జ్యోతిషశాస్త్రం... ఇవన్నీ మనకు వేద, రామాయణ, భారత కాలాల నుండీ ఉన్నవనే విషయం వారికి తెలియదు. జ్యోతిషాలలో అనేక రకాలున్నాయి. వాటిలో కొన్ని రకాలను అనంతర కాలంలో కొన్ని విదేశీజాతులు తెలుసుకున్నాయి. అయితే మరీ లోతుగా అతి ప్రాచీనకాలంనుండీ గ్రహ, తారల గమనాల ఆధారంగా జన్మనక్షత్రం, నామనక్షత్రం, జన్మరాశి, గ్రహచారం మాత్రమే కాకుండా ప్రతిరోజు, ప్రతిమాసం, ప్రతి సంవత్సరం, ప్రతి పండగ అన్నీ గ్రహ, తారల స్థానచలనాల ఆధారంగా ఈనాటికీ ఎక్కువగా ఆచరించే జాతి హిందూజాతే! చావు, పుట్టుక, అన్నప్రాసన, చదువు, పెళ్ళి.... ఇలా ఏ కార్యక్రమానికైనా... పంచాంగం ప్రకారం అడుగు ముందుకు వేసే సంప్రదాయం మనది. మరి ఇవన్నీ బాబిలోనియన్లే కనుగొని వుంటే, ఆ ఆచారాలు వారిలో ఎంతవరకు ఆచరించబడుతున్నాయో, కుహనా మేధావులు చెప్పాలి. దానికి వారు సమాధానం చెప్పలేరు గానీ... అర్థవంతమైన మన ఆచారాలను మాత్రం మూఢాచారాలంటూ పిచ్చివిమర్శలు చేస్తూంటారు.

జ్యోతిష శాస్త్రానికి ఆద్యులు బాబిలోనియన్లే అనడానికి ఒక మేధావి చెప్పిన ఋజువేమిటంటే.... బాబిలోనియా ప్రాంత త్రవ్వకాల్లో కొన్నివేల మట్టిఫలకాలు దొరికాయట. అవి ఆనాటివారి లైబ్రరీకి చెందినవి కావచ్చుని భావించబడింది. అవి క్రీ.పూ.900 ప్రాంతంలో తయారైన ఫలకాలుగా గుర్తించబడ్డాయి. వాటిలో జ్యోతిష శాస్త్రానికి సంబంధించిన అనేక వివరాలున్నాయట. వాటిమీద అమిత నమ్మకంతో వాటిని అనుసరించే ఆనాటి ప్రజలు, రాజులు కూడా కార్యక్రమాల్ని నిర్వర్తించుకునేవారట. అందుకని వారే జ్యోతిషానికి ఆద్యులని కొందరు నిర్ణయించి ముద్రవేసేశారు.

అయితే ఇక్కడ గుర్తించవలసిన విషయాలు మరో రెండు వున్నాయి.

1) ఆ మట్టిఫలకాలపై వ్రాయబడిన విజ్ఞాన విషయాలు పూర్తిగా బాబిలోనియన్ల స్వంతం కాదు. ఆనాటి రాజుగారు జ్యోతిషంపై అభిమానం కలవారై ప్రపంచం లోని వివిధ ప్రాంతాలనుండి యెన్నో విజ్ఞాన శాస్త్రప్రతులను తెప్పించుకుని, వాటి సారాంశాన్ని ఆ ఫలకాలపై వ్రాయించినట్లుగా... ఆ ఫలకాలే సాక్ష్యమిస్తున్నాయి. వాటిలో ఉన్న అంశాల్లో చాలావరకూ మన ప్రాచీన హిందూ ఖగోళవిజ్ఞాన అంశాలే ఉన్నాయి. అంటే జ్యోతిషానికి ఆద్యులు వారు కాదని తెలుస్తూనే ఉంది.

2) భారతదేశంలో జ్యోతిషశాస్త్రం క్రీ.పూ.1000కి ముందే వుంది. మహాభారతంలో ఎన్నోచోట్ల గ్రహ, తారల గమనాలు, తిథి, నక్షత్రాలు, ముహూర్తాలు, జ్యోతిషశాస్త్ర విషయాలు, వాటి ఫలితాలు, జన్మనక్షత్రాలు, రాశిసంక్రమణాలు వగైరాలు కొల్లలుగా వున్నాయి. దుర్యోధనుడు అశుభ ముహూర్తాన జన్మించినందున అతని వల్ల సర్వనాశనం కలుగుతుందని, అతను పుట్టగానే జ్యోతిషం చెప్పబడిన విషయం అందరికీ తెలిసిందే కదా! అలాంటి ఋజువులెన్నో వున్నాయి. అంతకంటే ముందు కాలం అయిన రామాయణంలోనూ తిథి, నక్షత్రాలు, జన్మనక్షత్రాలు... యింకా అనేక జ్యోతిష సంబంధ విషయాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. అంతకంటే ముందు నుండీ వున్న వేదాలు.... వాటిలో కెల్ల ప్రాచీనమైన ఋగ్వేదంలో కూడా జ్యోతిష శాస్త్ర వివరాలున్నాయి. అంత ప్రాచీన విజ్ఞానవైభవం మనకు ఉండగా కేవలం క్రీ.పూ.900 తర్వాత కాలంలో ఏర్పడిన బాబిలోనియా లైబ్రరీయే జ్యోతిషానికి మూలం అనడం చాలా హాస్యాస్పదం.

ఇక రాశిచక్రం విషయానికి వద్దాం.

నక్షత్రరాశులంటే అందరికీ తెలుసుకదా! మేషం, వృషభం, మిధునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం. ఈ 12 నక్షత్రరాశులు ఒకదాని వెనుక ఒకటిగా ఒక వృత్తాకారంలో వున్నట్లు కనిపిస్తాయి. ఈ పన్నెండు రాశుల వృత్తాన్నే 'రాశిచక్రం' అంటాం.

ముందుగానే చెప్పుకున్నాం కదా! సూర్యాది నవగ్రహాలు ఆకాశంలో

27 ముఖ్యనక్షత్రాల మీదుగా ప్రయాణిస్తున్నట్లుగా ఉంటాయని! దాన్నే 'గ్రహచారం' అంటాం. ఆ 27 నక్షత్రాలతో కూడుకున్నదే రాశిచక్రం. మన హిందువులు ఒక్కొక్క నక్షత్ర పరిధినీ నాలుగేసి భాగాలుగా విభజించారు. ఆ భాగాలనే "పాదాలు" అంటారు. 9 పాదాలు కలిపి ఒక్కొక్కరాశి అవుతుంది. అనగా ఉదాహరణకు... 27 నక్షత్రాల్లో మొదటితార అశ్విని 4 పాదాలు + భరణి 4 పాదాలు + కృత్తిక 1 పాదం కలసి 'మేషరాశి' అవుతుంది. అలాగే కృత్తిక 2, 3, 4 పాదాలు + రోహిణి 4 పాదాలు + మృగశిర 2 పాదాలు కలసి 'వృషభరాశి' అవుతుంది. అదేవిధంగా మొత్తం అన్నిరాశులూ గుర్తించబడ్డాయి. వీటిని గుర్తించి రాశివిభజన చేసిన వాళ్ళెవరు? అనేదే మన ప్రస్తుతాంశం. ఆ గుర్తింపు బాబిలోనియన్లదని కొందరి వాదం. వారి వాదానికి వివరణ ఏమంటే... సూర్యుడు మేషరాశిలో చేరితే మేకలు ఈనుతాయట. వృషభరాశిలో చేరినప్పుడు ఎడ్లను నాగలికి కట్టి భూమి దున్నాలట. కర్కాటకంలో చేరినప్పుడు సూర్యుడు పీతలాగ వెనక్కి నడుస్తాడట. తులా రాశిలో వున్నప్పుడు రాత్రింబవళ్ళు సమానంగా వుంటాయట. ధనూరాశిలో వున్నప్పుడు వేటకు అనువైన సమయమట. కుంభరాశిలో వున్నప్పుడు వర్షాలు బాగా కురుస్తాయట. ఇలా కొండ గుర్తులతో తమ కార్యక్రమాల సమయాలను తెలుసుకునేందుకు ఆకాశంలో నక్షత్రరాశులను వారు యేర్పరచుకున్నారట. అదీ వారివాదం. మిగిలిన రాశులగురించి వారేమీ చెప్పలేకపోయారు.

క్రీ.పూ.3000 నాటికి ఈజిప్టువారు కేవలం సిరియస్‌తో సూర్య సహోదయం లెక్కల్లోనే వున్నారు. క్రీ.పూ.3000 - 1000 మధ్యనే బాబిలోనియన్ల ఖగోళం వికసించినట్లు దాఖలాలు ఉన్నాయి. క్రీ.పూ. 600లోనే బాబిలోనియన్లు రాశిచక్రాన్ని తెలుసుకున్నారని, క్రీ.పూ.200లో హిప్పార్కస్ విషువచ్చలనం కనుగొన్నాడనీ చెప్తారు. మరి హిందూ ఖగోళ విజ్ఞానం ఈ అన్ని కాలాలకంటే అతి ప్రాచీనమైనది కదా!

పైగా... పైన చెప్పిన కొండగుర్తులు కూడా కొన్ని రాశులకే వున్నాయి. అందులో వారి మేకలు ఎప్పుడు ఈనేవో మనకు తెలియదు. కానీ వృషభ సంక్రమణకాలంలో పొలాలు దున్నడం, కర్కాటక, తులారాశుల కొండ

గుర్తులు నిజమనే చెప్పవచ్చు. కానీ ధనుస్సంక్రమణకాలం మంచి శీతాకాలం కదా! మరి వేటకు అనువైన కాలమెలా అవుతుంది? అలాగే కుంభ సంక్రమణ కాలం కూడా శీతాకాలం చివర వుంటుంది. అప్పుడు వర్షాలు ఎలా కురుస్తాయి?

ఈ విధంగా చూస్తే నిజానికి ఈ కొండగుర్తులు, రాశి గుర్తింపులు వారి స్వంతం కాదనే అనిపిస్తుంది. హిందువుల నుండి గ్రహించిన రాశి వివరాలు కొన్నింటికి తమ కొండగుర్తులకు ముడివేసుకుని వుంటారు.

ఇక్కడ మరో చిన్న విషయం చర్చించి ముందుకెళ్దాం.

రాశులగూర్చి వివరించే సమయంలో వరాహమిహిరుడు కుంభరాశిని "రిక్త కుంభ స్కంధ ధారి" అని వర్ణించాడట. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ గొబ్బూరి వెంకటానంద రాఘవరావు అనే పండితుడు వరాహమిహిరుని తీవ్రంగా విమర్శించారు. ఆ విధంగా వరాహమిహిరుడు వ్రాయడం, మనదేశ దౌర్భాగ్యం అనీ, సిగ్గుపడవలసిన విషయమనీ విమర్శించారు. కారణం యేమంటే... కుంభరాశిని ఖగోళ పండితులు, వరుణదేవుడు ఒక కుండను భుజంపై దాల్చినట్లుగానో లేక ఆ కుండలోని నీటిని భూమిపై కుమ్మరిస్తున్నట్లు గానో చిత్రిస్తుంటారు. వరుణుడు కుండతో నీటిని భూమిపై పోస్తుంటాడనీ (అదే వర్షం అన్నమాట), దానివలన పంటలు బాగా పండుతాయనీ, ఇంకా అలాంటి అర్థాలనిచ్చే కొన్ని వరుణ మంత్రాలు వేదాల్లో ఉన్నాయి. ఆ మంత్రాలనూ, చిత్రించబడిన వరుణ చిత్రాలనూ ఋజువుగా చూపిస్తూ గొబ్బూరివారు విమర్శించారు. "రిక్త కుంభ స్కంధధారి" అంటే ఖాళీ కుండను భుజంపై ధరించినవాడు (వరుణుడు) అని అర్థం. ఎంతో నీటిని వర్షంగా కురిపించే వరుణుడి కుండను 'ఖాళీకుండ' అనటం ఘోర తప్పిదంగా ఆయన చాలా మండిపడ్డారు. కానీ మన పంచాంగాలనే రచించిన మేధావి "వరాహ మిహిరుడు". ప్రస్తుతం విషువద్రేఖా చలనం వలన ఆయన వ్రాసిన పంచాంగాన్ని మళ్ళీ తిరగవ్రాయవలసిన పరిస్థితి వచ్చినా, అలా వ్రాయగల మేధావి లేక, ఆయన వ్రాసిన పంచాంగాన్నే వాడుకుంటున్నాం. అంతటి మేధావి ఆయన! (విషువద్రేఖ మేషంలో వుండగా

వరాహమిహిరుడు పంచాంగం వ్రాశాడు. ప్రస్తుతం విష్వద్రేఖ మీనంలోకి మారిపోయి వుంది. అందువలన దానికి అనువుగా పంచాంగాలు సరిదిద్దవలసిన అవసరం వుంది) అలాంటి మేధావిని మనం కంగారుపడి విమర్శించడంలో ఔచిత్యం లేదు. కాస్త తర్కించి ఆలోచించగలగాలి.

మరి వరాహమిహిరుడు - గొబ్బూరివారు... ఇద్దరిలో ఎవరి మాట నిజం? రెండూ నిజమే? ఎందుకంటే ఖగోళ విషయాల్ని పండితులు ముఖ్యంగా రెండు పద్ధతుల్లో చూస్తారు. 1) సూర్య సహోదయం. (అనగా తూర్పువైపు ఆకాశంలో సూర్యునితో కలసి ఉదయించే నక్షత్రాల/రాశులస్థితిని ప్రామాణికంగా తీసుకోవడం) 2) పగటివేళ పూర్తయి రాత్రి సమయం ప్రారంభంలో... అనగా రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో తూర్పున ఉదయించే నక్షత్రాలు / రాశిని ప్రామాణికంగా తీసికోవడం. ఈ రెండింటిలో గొబ్బూరివారు రాత్రివేళ తూర్పున కుంభరాశి ఉదయించే కాలాన్ని లెక్కలోకి తీసుకున్నారు. అది శ్రావణమాస ప్రాంతం కనుక, మంచి వర్షాకాలం. కనుక ఉదయించే కుంభం (నిండుకుండ) నుండి జలధారలు మెండుగా కురిసే కాలం. ఇది గొబ్బూరివారి నిర్ణయం. కానీ వరాహమిహిరుడు సూర్య సహోదయాన్ని లెక్కలోకి తీసుకున్నాడు. అనగా కుంభసంక్రమణ కాలం. అనగా శీతాకాలం చివరిదశ. అపుడు వర్షాలుండవు కదా! అందుకే కుండ ఖాళీగా వుందన్నాడు. మరి సూర్యుడు కుండలో (కుంభరాశిలో) చేరితే, ఆ వేడికి కుండలో నీరు ఆవిరైపోయి కుండ ఖాళీ అయిపోదా మరి! ఈ వివాదానికి కారణం, గొబ్బూరి వారి అపార్థపు ఊహ మాత్రమే. ఆయన వేదాల్లో నుండి చూపిన ఉదాహరణలో... వరుణుడు నిండు కుండలో నీటిని వర్షించి పంటలు పండిస్తాడని వుంది. అయితే అది సూర్యుడు కుంభసంక్రమణ వేళలో అని వేదం చెప్పలేదు కదా! కేవలం వరుణుడి "జనరల్ డ్యూటీ"లను వేదంలో వర్ణించారంతే! ఆ డ్యూటీ వర్షాకాలానికి చెందినది మాత్రమే! ఈ ప్రకారం చూడగా... కుంభ సంక్రమణకాలంలో వరుణుడు "రిక్త కుంభ స్కంధధారి" అనేది నిజమే!

ఇక మన హిందువుల రాశిచక్ర విషయానికి వద్దాం.

మన హిందూ ఋషులు ఏవో కొండ గుర్తులకోసం ఆకాశంలో రాశులను, రాశిచక్రాన్నీ రచించలేదు. సూర్య చంద్రాది గ్రహాలన్నీ చక్కగా తిరగడానికి భగవంతుడు వేసిన చక్రపుబాటయే ఈ రాశిచక్రం అని వేదాల్లో వర్ణించబడింది. అనగా సూర్య చంద్రాది గ్రహాలు ఎల్లప్పుడూ ఒక విధమైన బాటలో చరిస్తుంటాయని వేద ఋషులకు తెలుసన్నమాట. అప్పుడా బాట పొడవునా ఉన్న ముఖ్య నక్షత్రాలను ఇరవై ఏడింటిని గుర్తించి వాటికి పేర్లు కూడా పెట్టారు వారు. ఆ 27 తారల పేర్లు ఋగ్వేద కాలం నుండీ వున్నట్లు ఋజువులున్నాయి మనకి. (కాలక్రమంలో కొన్ని పేర్లు మార్పు చేయబడ్డాయి) వారు గ్రహ గమనాలను బాగా పరిశీలించి... సూర్యచారం, చంద్రచారం లెక్కలు కట్టారు. ఒక్కసారి రాశిచక్రం చుట్టి రావడానికి సూర్యునికి ఒక సంవత్సరం పడుతుందనీ, ఆ సంవత్సరకాలంలో చంద్రుడు 12 మార్లు తిరుగుతున్నాడనీ గుర్తించారు. అంటే చంద్రుడు ఒకమారు తిరిగేసరికి సూర్యుడు 1/12 బాటలో నడుస్తాడు. అందువలన ఆ లెక్కలు గుణించడం కోసం, రాశిబాటను 12 భాగాలుగా విభజించారు. ఆ 12 భాగాల్లోని నక్షత్రాలను వాటి ఆకారాలను బట్టి మరియూ వాటిలో సూర్యుడు నడిచేకాలంలో కలిగే మార్పులను బట్టి రాశులను, రాశి నామాలను ఏర్పరచారు. మన హిందూ ఋషులు ఏర్పరచిన రాశిచక్రం ఇలా తయారయింది.

"ఆకాశంలో 12 ఆకుల చక్రం వుంది. దానిలో 720 మంది పిల్లలు జంటలు జంటలుగా తిరుగుతున్నారు" అనే ఋగ్వేద వాక్యానికి అర్థం చెప్పుకుందాం. 12 ఆకుల చక్రం అనగా 12 రాశుల రాశిచక్రం. ఆ చక్రాన్ని ఒకసారి సూర్యుడు తిరిగి వస్తే 1సంవత్సరం కనుక, ఆ సంవత్సరంలోని రోజులు 360 కాబట్టి... ఆ రోజుల్లోని 360 పగలు భాగాల్ని తెల్లని పిల్లలనీ, 360 రాత్రిభాగాల్ని నల్లని పిల్లలనీ చమత్కరించింది వేదం. మొత్తం 720 మంది పిల్లలంటే ఇదీ భావం.

ఋగ్వేదం ప్రథమమండలంలో దీర్ఘతముడనే ఋషి ఈ ఖగోళ, కాలమాన విశేషాలను వివరించాడు. ఋగ్వేదం ఒకటవ మండలం, 164వ సూక్తంలో 11, 12, 15, 48 మంత్రాల్లో రాశిచక్రం, రాత్రింబవళ్ళు,

ఋతువులు, మాసాలు, అధికమాసం, సూర్యచారం, చంద్రచారం... మొదలైన ఖగోళ విషయాలను, కాలమాన విషయాలను దీర్ఘతముడు వివరించాడు. అలాంటి ఖగోళ విషయాలను అంతకువుందు మరేజాతివారూ, మరేదేశస్థులూ పరిశీలించిన ఋజువులు లేవు. (అయినా ప్రపంచచరిత్రలో అతిప్రాచీన గ్రంథం ఋగ్వేదమే కదా!)

ఈ రాశులకు ఈ రూపాలనూ, పేర్లను మన ఋషులు ఎందుకు పెట్టారో చూద్దాం. ఏ విజ్ఞానాంశమైనా, ధార్మిక విషయమైనా ఒక పురాణ కథగానో, దైవ స్వరూపాలగానో మలచి మనకు అందించటం మన ఋషుల అలవాటు కదా! అందుకే ఈ రాశుల విషయంలో కూడా అదే పద్ధతి అవలంభించారు. ఋగ్వేదం మొదలుకొని వేదాలు... పురాణాలు... రామాయణ, మహాభారతాలు అన్నింటిలోనూ ఈ రాశుల వివరం, 27 నక్షత్రాల వివరం సంగ్రహంగా ఉన్నాయంటే... మన హిందూ ఋషులు ప్రపంచంలోని ఇతర జాతులందరి కంటే ముందు కాలంనుండే అవన్నీ తెలుసుకుని ఉన్నారనేది సత్యం. (వేదాల ప్రాచీనతకు కొన్ని ఋజువులను మా "సులభశైలిలో వేదవిజ్ఞానం" పుస్తకంలో వ్రాశాం చూడండి).

ఇంతకూ మనవారు ఈ రాశులకు ఏ రూపాలను ఎలా ఇచ్చారో చూద్దాం. కృత్తికా నక్షత్రం ఒకానొక కాలంలో గొప్ప అగ్నిహోత్రంగా వెలుగొంది, ప్రేలిపోయిందని, ఇంతకుముందు చెప్పుకున్నాం కదా! అందుకే కృత్తికకు అధిదేవుడు అగ్నిదేవుడయ్యాడు. మరి పురాణాలప్రకారం అగ్నిదేవుని వాహనం గొర్రె. అస్తమయవేళ కృత్తికకు క్రిందిభాగాన ఈరాశి వుండటం వలన, ఈ రాశిపై అగ్నిదేవుడు ఎక్కినట్లుగా వర్ణిస్తూ ఈ రాశిని 'మేషరాశి'గా గుర్తించారు.

అదేవిధంగా రెండవ రాశిని 'వృషభరాశి' అన్నారు. రోహిణి తారలను ఎప్పుడైనా పరిశీలించారా? ఇంగ్లీషు అక్షరం "వి" మాదిరిగా వుంటాయి. దాన్ని ఎద్దు శిరస్సుగానూ, దానికి కొంత దూరంలో గల రెండు తారలను ఎద్దుకొమ్ములుగానూ చిత్రిస్తుంటారు. అలా ఆ తారలు వృషభ శిరస్సుగా ఉండటం వలన 'వృషభరాశి' అయింది.

ఇక మిథునరాశిలో తారలు, ఇద్దరు వ్యక్తులు ప్రక్కప్రక్కగా నిలబడి చెట్టాపట్టాలేసుకున్నట్లుగా చిత్రించడానికి తగినట్లుంటాయి. వారినే మనవారు పార్వతీ పరమేశ్వరుల జంటగా వర్ణించారు. ఈ తారలు ఉదయించే సమయాన, వీరికి పై భాగంలో వృషభరాశి వుంటుంది కదా! ఆ దృశ్యాన్ని వృషభపతాకం కలిగిన శివపార్వతులని అన్నారు. ఇక అస్తమయ సమయంలో మిథునరాశికి క్రింది భాగాన వృషభరాశి ఉంటుంది. ఆ దృశ్యాన్ని వృషభ వాహనం ఎక్కిన శివపార్వతులుగా వర్ణించారు.

తదుపరి రాశి 'కర్కాటకం'. ఈ రాశిలో చేరినప్పుడు సూర్యుడు వక్రచారంలో వుంటాడు. కనుక పీతలాగ వెనక్కి నడిపించే ఈ రాశిని 'కర్కాటకం' అన్నారు (పాశ్చాత్యుల వివరణ కూడా ఇదే!).

ఆ తరువాత వచ్చే రాశి 'సింహరాశి'. ఈ నక్షత్రాల అమరిక నిజంగానే సింహం మాదిరిగా వుంటుంది. దాని తరువాత వచ్చే రాశి 'కన్యారాశి'. ఈ కన్యనే మనవారు దుర్గామాతగా పూజిస్తారు. సింహ - కన్య రాశులు రెండూ కలసి సింహవాహనంపై కూర్చున్న దుర్గామాతగా వర్ణిస్తారు. ఈ రెండు రాశులు ఆకాశమధ్యంలో ఉన్నప్పుడు, పశ్చిమాన వృషభం అస్తమిస్తుంటుంది. (వృషభం అనగా ఎద్దు/దున్నపోతుగా భావిస్తే) సింహవాహిని ఉచ్ఛదశలో ఉండి విజయం సాధించినట్లు, మహిషాసురుడు మరణిస్తున్నట్లుగా (అస్తమిస్తున్నట్లుగా) కూడా వర్ణించారు.

తదుపరి రాశి 'తుల'. ఈ రాశిలో సూర్యుడు వుండే కాలంలో రాత్రింబవళ్ళ సమయాలు సమానంగా వుంటాయి. కనుక అలా సమభాగాలు చేసిన ఆ రాశిని 'తులారాశి' అన్నారు (పాశ్చాత్యుల వివరణ కూడా ఇదే!).

ఇక 'వృశ్చికరాశి' గూర్చి వేరే చెప్పాలా? ఆ నక్షత్రాలను చూస్తే ఎవరైనా చెప్పవచ్చు, అది తేలు ఆకారంలో ఉందని! అందుకేదాన్ని 'వృశ్చికం' అన్నారు. ఈ రాశి ఉదయిస్తుంటే, మృగశిర అస్తమిస్తూ వుంటుంది. మృగశిరను కొందరు ఋషులు వృత్రాసురుడిగా వర్ణించారు. వృశ్చికంలోని జ్యేష్ఠ నక్షత్రానికి అధిదేవుడు ఇంద్రుడు. ఈ ఇంద్రుడు ఉదయించేవేళ పశ్చిమాన వృత్రుడు అస్తమించడాన్నే 'వృత్రాసుర సంహారం'గా కూడా చెబుతారు.

ఆ తరువాత వచ్చే రాశి 'ధనూరాశి'. (ధనస్సు అనగా విల్లు). విల్లు ఎక్కుపెట్టి పూలబాణాలు వేస్తున్న మన్మథుడిగా ఈ రాశిని వర్ణిస్తారు. తూర్పున ఈ రాశి ఉదయించే వేళ, మిథునం పశ్చిమాన వుంటుంది. (తూర్పున ఉన్న తారలకు పశ్చిమ అంచున ఉండే తారలు, ఉత్తరదిశ తారలకు దక్షిణదిశ తారలు ప్రత్యర్థులవుతారని ఖగోళ పండితులంటారు) అందుకే మన్మథుడు శివునిపై పూలబాణాలు వేస్తున్నట్లు చెబుతారు. మరియు మిథునం తూర్పున ఉదయించే వేళ, పశ్చిమాన ధనుస్సు అస్తమిస్తుంటుంది. అనగా శివుడి మూడవనేత్ర జ్వాలలకు మన్మథుడు మరణిస్తున్నాడని అంటారు.

దాని తరువాత రాశి 'మకరరాశి'. తల, తోక పైకెత్తి పొట్టపై ఆధారపడి నిలుచున్న మొసలి ఆకారంలో వుంటాయి ఈ నక్షత్రాలు. (కొందరు దీని మేకతల, చేపతోక గల జంతువుగా ఊహిస్తారు. కానీ వజ్రవైఢూర్యాలు పొదిగిన నెక్లెస్ అంటే అన్నిటికంటే బాగుంటుందేమో! దాని ఆకారం అలా వుంటుంది). అయితే ధనూరాశి అస్తమించేవేళ ధనూరాశికి పై భాగాన ఈ మకరరాశి వుంటుంది కదా! (మన్మథుడు మకరధ్వజుడు. అతని పతాకంపై మకరం వుంటుంది). అందుకే ఈ రాశి పేరు 'మకరం'గా స్థిరపడిపోయింది.

ఆ తరువాత వచ్చేది 'కుంభరాశి'. నిజానికి ఇందులో వరుణుడి రూపం, కుండరూపం అంతగా లేకపోయినా, ఆ రూపంలోనే చిత్రించారు. కారణం ఇంతకుముందు చెప్పుకున్నాం కదా! రాత్రివేళ కుంభరాశి ఉదయించే రోజుల్లో కుంభవృష్టి కలుగుతుందని! అందువల్ల ఆ రాశికి ఆ పేరే పెట్టారు. మరోవిషయం ఏమంటే వరుణుడి ఝుండాపై మొసలి వుంటుంది. తూర్పున ఉదయించేవేళ కుంభరాశిపైన మకరం వుంటుంది. దానినే మకరధ్వజుడైన వరుణుడిగా వర్ణించారు.

చివరగా మిగిలింది 'మీనరాశి'. రెండు చేపలను ఒక వరుణపాశంతో కలిపి వుంచినట్లు చిత్రించారు. కుంభరాశి ద్వారా వరుణుడు కురిపించిన వర్షాలకు నిండిన జలాశయాల్లో మీన సంపద రాశులు రాశులుగా పెరిగి పోతుంది. అదే వరుణుడికి మీనజాతికి గల సంబంధం. అందుకే మీనరాశిలో రెండు చేపల తోకలను కలుపుతూ వరుణపాశాన్ని చిత్రించడం జరిగింది.

నిజం చెప్పాలంటే ఆకార పూర్వకంగా చూస్తే వృషభం, సింహం, వృశ్చికం మాత్రమే సరైన పోలికలు కలిగి వుంటాయి. మిథునం, మకరం, మీనం కొంతవరకు పోలికలు కలిగి వుంటాయి. మిగిలిన ఆరు రాశులకు పేరుకు తగిన ఆకారాలు అంతగా కనిపించవు. అయినా పైన మనం చెప్పుకున్న కారణాలరీత్యా, మన పూర్వులు ఇలా విభాగాలు చేశారు. వారికి ముఖ్యంగా కావలసింది రాశి చక్రపు బాటపై 12 గుర్తులు. ఎందుకంటే నవగ్రహాలు ముఖ్యంగా సూర్యుడు ఏరోజున ఎక్కడ వున్నదీ, ఎంత దూరం ప్రయాణించినదీ లెక్కలు కావాలంటే ఇలా 12 స్టేషన్లు తప్పనిసరి. ఆ విధంగా వుంటే అటు కాలమానం, ఇటు జ్యోతిషశాస్త్రం చక్కగా సాగి పోతాయి. అందుకే పూర్వ హిందువులు ఈ రాశి చక్రాన్ని ఏర్పాటు చేశారు.

పాశ్చాత్యుల్లో కూడా ఈ ద్వాదశరాశుల గూర్చి జాతికొక రకమైన పురాణకథలున్నాయి. నమ్మకాలు వున్నాయి. కానీ ఆ కథలన్నీ చాలావరకూ అసహజంగా ఏర్పరచుకున్నవే! మన పూర్వులు తయారుచేసిపెట్టిన రాశులను తమ స్వంతం చేసుకోవాలనుకున్న పాశ్చాత్యులు, తమ పురాణ కథలను అల్లుకున్నట్లుగా కనిపిస్తోంది.

పైగా వాటికి సంబంధించిన వారి ఆచారాలు కూడా వింతగానే వుంటాయి. విష్వద్రేఖ వృషభంలో వుండే కాలంలో ఈజిప్టియన్లు వృషభాలను పూజించేవారట. ముఖంపై తెల్లని మచ్చగల నల్లని వృషభాన్ని 'దేవుని వృషభం'గా పూజించేవారట. మొక్కుబడులు చెల్లించేవారట. ఆ పూజలకు పూజార్లు ఉండేవారట. ఆ వృషభాలు 25 సం॥ మించి బ్రతికితే వాటిని నీటిలో బలవంతంగా ముంచి చంపేసి, పాతిపెట్టి గోరీలు కట్టించేవారట. దాని స్థానే మరో వృషభం, దేవ వృషభమయ్యేదట.

అలాగే కృత్తికా నక్షత్రాల విషయంలో కూడా కృత్తికా యుగపు ఈజిప్టియన్లకి వింత ఆచారం వుండేదట. కృత్తికలు బహుచెడ్డవట. కృత్తికలు నడి ఆకాశంలో అర్ధరాత్రివేళ ప్రకాశించే రోజుల్లో, వారి జాతికి గొప్ప అరిష్టాలు కలుగుతాయని ఈజిప్టులో ఒక జాతివారి నమ్మిక. అలా అరిష్టాలు కలగకూడదని నరబలులు ఇచ్చేవారట. అదికూడా సజీవదహనం చేసేవారట.

వారేకాదు, ఈ కృత్తికల అరిష్టనివారణ కోసం బ్రిటన్, స్వీడన్ లాంటి దేశాల్లో కూడా నరబలి సాగించేవారట.

సూర్యుడు వృశ్చికరాశిలో ఉన్నప్పుడు ఈజిప్టియన్లు చావుమైల పాటిస్తారట. ఎందుకంటే ఆ వృశ్చికం కుట్టడం వల్లనే ఒరయన్ (ఓసిరిస్ అనే దేవుడు) చనిపోయాడట.

సింహరాశి, కన్యారాశుల కలయికను సింహారూఢ దుర్గామాతగా మనం భావిస్తాం. కానీ ఈజిప్టియన్లు మనిషిముఖం కలిగిన సింహంగా భావించి అటువంటి భారీ విగ్రహాలను నిర్మించేవారట.

ఇలాంటివే అనేక మూఢనమ్మకాలు, ఆచారాలు విదేశీయుల్లో ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ ఇలా ఉండగా, మనవాళ్ళలోనే కొందరు మూర్ఖులు, మన హిందూజాతిని మూఢాచారాల జాతిగా విమర్శిస్తుంటారు.

❀❀❀

25. వేదాల, రామాయణ, భారత కాలాలు ఎప్పుడు?

ఇంతవరకూ మనం అనేకచోట్ల వేదకాలం, రామాయణ, మహాభారత కాలాలు అని ఉదహరించడం జరిగింది. ఇంతకూ ఆ కాలాలు ఎప్పుడనేది తెలుసుకుందాం.

(i) వేదకాలం

వేదాలు నిర్దిష్టంగా ఒకే కాలానికి చెందినవి కావు. ఎన్నో వేల సంవత్సరాలపాటు నిర్విరామంగా వేదరచన సాగింది. అయితే వ్రాయబడిన మొత్తం వేదం మనకు పూర్తిగా లభించడంలేదు. కేవలం 1% వేదమే లభిస్తుంది. ఆ 1% వేదం ద్వారా "నేటికి 10,000 సంవత్సరాల పూర్వం నుండీ" వేదరచన జరిగినట్లు తెలుస్తుంది. (మరిన్ని వివరాలకు మా "సులభశైలిలో వేదవిజ్ఞానం" చదవండి)

(ii) రామాయణ కాలం

రామాయణ కాలాన్ని నిర్దిష్టంగా చెప్పడం ఒకింత కష్టమే! అయితే

త్రేతాయుగాంతంలో జరిగినట్లు మన గ్రంథాలు చెబుతున్నాయి. ఆ త్రేతాయుగం మన మహాయుగంలోనిది కాదనీ, గతించిన మహాయుగం లోని త్రేతాయుగం అని వాదించేవారు కూడా వున్నారు. అయితే ఆ వాదం నిజంకాదు. అది మరీ విపరీతమనిపిస్తుంది. కాబట్టి మన మహాయుగపు త్రేతాయుగాంతంలోనే రామాయణం జరిగిందని చెప్పవచ్చు. అలా చెప్పినా కూడా నేటి ఆధునిక చరిత్రకారులు వ్యతరేకిస్తూనే ఉన్నారు. ఎందుకంటే నేటికి కలియుగం 5000 సం॥+ ద్వాపరయుగం సుమారు 8 లక్షల సం॥+ త్రేతాయుగంలో సుమారు లక్ష సం॥... మొత్తం మీద సుమారుగా పదిలక్షల సంవత్సరాల పూర్వం రామాయణం జరిగినట్లు అవుతుందనీ, ఆనాటికి భూగోళంపై మానవజాతి అవతరిస్తూ ఉందనీ... శ్రీరాముని వంటి తెలివి, నాగరికత కలిగిన జనం ఆనాడు లేరనీ...వారు అంటున్నారు. ఇప్పుడు మనం ఆ విషయాల్ని కాస్త పరిశీలిద్దాం. ప్రస్తుతం మనదేశంలో ఉన్నప్రజలు ప్రాచీనకాలంలో మధ్య ఆసియా నుండి వచ్చిన "ఆర్యులు అనే జాతి" అని పాశ్చాత్య చరిత్రకారులు అంటారు. అయితే అదంతా తప్పు అని, ఇప్పుడు ఋజువు అవుతోంది. మన శివపురాణం, మత్స్యపురాణాల ప్రకారం ఈ వివరాల్ని పరిశీలించి చూద్దాం.

'ఆర్యులు' అంటూ పాశ్చాత్యులు చెప్పిన ప్రజలను మనం "వేదమార్గీయులు" అంటాం. వారు వచ్చినది మధ్య ఆసియా నుండి కాదు. అట్లాంటిస్‌గా నేడు చెప్పబడుతున్న మేరు పర్వతం (ఉత్తరధ్రువం) నుండి భారతావనికి వచ్చారు. వారు వచ్చిన కాలం కేవలం క్రీ.పూ. 2000 అంటారు పాశ్చాత్యులు. కానీ వేద మార్గీయులు భరతఖండం చేరేనాటికి గంగానది పుట్టనేలేదు. అంత ప్రాచీన కాలంలో వచ్చారు. ఆ వేదమార్గీయజాతివాడే శ్రీరాముడు. అందుకే వారు అంత నాగరికులు, తెలివైనవారు అయ్యారు. అలాగే పాతాళం అనబడే అంటార్కిటికా ఖండంనుండి వచ్చిన రాక్షసజాతి సింహళంలోనూ, దక్షిణ భారతంలోనూ స్థిరపడ్డారు. అందుకే వారికీ కొంత నాగరికత వుంది. ఇక మిగిలింది... దక్షిణ భారతంలోనే పుట్టి పెరిగిన వానర, భల్లూకజాతులు. ఈ రెండు జాతులూ మానవజాతిగా రూపొందుతూ వున్నకాలం అది. నేటికి పదిలక్షల ఏళ్ళక్రితం మానవజాతి ఆవిర్భవిస్తూ

ఉందని ఆధునికులు చెప్పిన "క్వాటర్నరీ" కాలం... ఆ వానర, భల్లూకాలనుండి జరుగుతున్న మానవపరిణామానికి సరిపోతుంది.

ఆ కాలంలో ఉత్తర భరతఖండంలో తప్ప మిగిలిన ప్రపంచంలో అన్నిచోట్ల ఈరకంగానే మానవజాతి ఆవిర్భావదశలో ఉంది. అందుకే ఆధునికులు చేసిన పరిశోధనల్లో ఆ విధంగా తెలిసింది. ఈవిషయాన్ని వాల్మీకి మహర్షి ముందే చెప్పాడు. రామాయణంలో క్లుప్తంగా ప్రపంచ వర్ణన కూడా చేశాడాయన. ప్రపంచంలో వివిధ దేశాల్లోని అనేక రకాలైన వానరసైన్యాల రూపురేఖల్ని వివరించాడు. ఆ వివరణ చూస్తే ఈనాటి నల్లచర్మపు భారతీయుల సంగతి, తెల్లతోలు పాశ్చాత్యుల సంగతి, చైనా, జపాన్ ప్రజల మధ్య వ్యత్యాసాలు గుర్తుకొస్తాయి. ప్రపంచంలో అన్ని ప్రాంతాల్లోనూ అనేకరకాల వానరజాతులు ఉన్నట్లుగా రామాయణం చెబుతుంది. వారందర్నీ సుగ్రీవుడు తనకు సహాయంగా పిలిపించుకుని, లంకపైకి దండెత్తాడు. ఈచిన్న ఉదాహరణ చాలు ఆలోచించగలిగేవారికి. మన వేదమార్గీయులు విజ్ఞానం సాధించే నాటికి, ప్రపంచంలో అన్నిచోట్ల మానవజాతి ఇలా ఆవిర్భావదశలో ఉంది. ఈ విషయాలన్నింటివల్లా రామాయణం 10 లక్షల ఏళ్ళక్రితం జరిగిందని చెప్పవచ్చు.

రామాయణ కాల నిరూపణకు మరిన్ని విషయాలు మా 5వ పుస్తకం "ధర్మసందేహాలు - ధార్మిక సమాధానాలు" లో చూడండి.

(iii) మహాభారత కాలం

మహాభారతం క్రీ.పూ. 3200 ప్రాంతంలో జరిగిందని చెప్తారు మన హిందువులు. క్రీ.పూ. 500ల ప్రాంతంలో అని విదేశీయులంటారు. చాలకాలం నుండి ఈ వివాదం కొనసాగుతుంది. మహాభారతం క్రీ.పూ. 3000కు ముందే జరిగిందని నిరూపిస్తూ, కొందరు హిందూ పండితులు ఋజువులు చూపించారు. ఆ వివరాలతో పుస్తకాల్ని కూడా వ్రాశారు. అయినా ఆధునిక సైన్సు తప్ప మరేదీ లేదని భావించే "వన్‌సైడ్ కుహనా మేధావులు" తమ మూర్ఖత్వాన్ని విడువకుండా వాదిస్తూనే ఉన్నారు. అయితే మనకున్న ఋజువుల్ని చూద్దాం. మహాభారతంలో అక్కడక్కడ వివిధ

సమయాల్లోని గ్రహస్థితుల గురించి, నక్షత్రరాశుల గురించి ప్రస్తావించటం కనబడుతుంది. వాటి ఆధారంగానే మహాభారతం జరిగి నేటికి 5000 సం॥ దాటినట్లుగా మన పండితులు ఋజువుల్ని చూపించారు.

మహాభారతంలో కనిపిస్తున్న కొన్ని ఋజువులను పరిశీలిద్దాం.

1) అరణ్యపర్వంలో నహుషుడు అనే పెద్దపాము ఒకటి భీముణ్ణి చంపి తినడానికి ప్రయత్నిస్తుంది. అంతలో ధర్మరాజు వచ్చి దానికి శాపవిమోచనం కలిగిస్తాడు. ఆ మహాసర్పం పూర్వకాలంలో నహుషుడనే మహారాజు. అతడు చేసిన పుణ్యకార్యాల ఫలితంగా ఇంద్రపదవి నలంకరించాడు. అప్పుడు అతడు చూపిన అహంకారం ఫలితంగా శాపగ్రస్తుడై పెద్దపాముగా మారి, చాల సంవత్సరాలుగా జీవిస్తున్నాడు.

నహుషుడు అనబడే నక్షత్రం ఉత్తర ఆకాశంలోవుంది. ఆ తార కొంత కాలంపాటు విష్వద్రేఖకు ఆధారమయింది. అలా జరిగిన కాలం క్రీ.పూ. 4500 ప్రాంతం. ఆ తదుపరి కాలంలో పాముగామారి భీముణ్ణి పట్టుకున్నాడు. అనగా భీముడి కాలం సుమారు క్రీ.పూ. 3200 ప్రాంతమని మనం భావించవచ్చు.

(ఈ నహుషుడి కథను మరో పుస్తకంలో వివరంగా వ్రాస్తున్నాం. చదవండి.)

2) మన కల్పకాలు, మహాయుగాలు, యుగాలు లెక్కలన్నీ కాస్త తెలివి గలిగిన ఋషులు కల్పించి వ్రాసినవని కొందరి భావన. కానీ నిజానికి ఆ లెక్కలన్నీ ఖచ్చితంగా ఖగోళపరమైనవే! ఖగోళపరంగా లెక్కించి చూడగా సృష్టి ఆరంభ సమయంలో నవగ్రహాలు మేషరాశిలో కూడివున్నాయట. అక్కడి నుండే అన్ని గ్రహాలూ గ్రహచారం ఆరంభించాయట. అదే విధంగా ప్రతి యుగారంభం నాడు కూడా మేషంలో నవగ్రహకూటమి జరుగుతుందట. (ఆ గ్రహకూటముల ఆధారంగానే హిందూకాలమానమైన యుగాలు, కల్పకాల లెక్కలు ఏర్పడ్డాయి). మహాభారత యుద్ధానంతరం 36 సంవత్సరాలకు శ్రీకృష్ణుడు తన అవతారాన్ని చాలించాడు. ఆ తరువాత మేషంలో నవగ్రహ కూటమి జరిగి క్రీ.పూ. 3102 లో కలియుగం

ఆరంభమయింది. అంటే మహాభారతకాలం అంతకుముందే అని తెలుస్తుంది కదా!

3) మన హిందూపండితులు మహాభారతంలోని కురుక్షేత్ర సంగ్రామం క్రీ.పూ. 3138లో జరిగిందని లెక్కవేశారు. దానికొక ఋజువుంది. భీష్ముడు కురుక్షేత్రంలో గాయపడి పడిపోయి, అంపశయ్యుడయ్యాడు. 'ఆ రోజులు దక్షిణాయన కాలమనీ, ఉత్తరాయన కాలం వరకూ బ్రతికి ఉండి, ఉత్తరాయనంలో మరణిస్తే పుణ్యం వస్తుందనీ' శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు. తాను కోరినంతవరకూ మృత్యువు దరిచేరని వరం కలిగినవాడు భీష్ముడు. అందువలన సుమారు నాలుగునెలలు తన ప్రాణాలను నిలుపుకుని, ఉత్తరాయనం ప్రవేశించాక ఏకాదశి రోజున చనిపోయాడు. అది మాఘమాసం శుద్ధ ఏకాదశి. మాఘమాసం శుద్ధసప్తమి రోజున సూర్యుడు దక్షిణాయనం ముగించి, ఉత్తరాయనం ప్రారంభించాడు. అందుకే ఆనాటినుండీ ఈ నాటికీ మనం మాఘశుద్ధసప్తమి రోజున "రథసప్తమి" అనే పండుగను, మాఘశుద్ధ ఏకాదశి రోజున "భీష్మఏకాదశి" అనే పండుగనూ జరుపుకుంటున్నాం.

అయితే ఆ ఘటన జరిగిన కొంతకాలానికి విష్వచ్ఛలన కారణంగా ఉత్తరాయన, దక్షిణాయన కాలాలు మారిపోయాయి. ఆ సంఘటన సౌరమానం ప్రకారం జరిగినా, మనం ఈనాటికీ చాంద్రమానం ప్రకారం ఆ పండుగలను జరిపేసుకుంటున్నాం. లేనట్లయితే విష్వద్రేఖ, ఆయనాంతాలు మారినప్పుడల్లా మళ్ళీ మళ్ళీ పండుగల్ని మార్చేసుకోవడం గజిబిజిగా ఉంటుంది కదా! అందుకే చాంద్రమానానికి పండుగల్ని సరిపెట్టుకుని ఆచరిస్తున్నాం.

నిజానికి ప్రస్తుతం ఉత్తరాయన ఆరంభం డిశంబర్ 22న జరుగుతుంది. కానీ మహాభారత కాలంలో ఉత్తరాయనారంభం ఫిబ్రవరిలో జరిగేది. దీనికి కారణం భూగోళం యొక్క విష్వచ్ఛలనం.

ఉత్తరాయన ఆరంభకాలాలు ఎలా మారుతున్నాయో ఈ క్రింద పట్టికలో చూడండి.

మహాభారత కాలం	వృషభయుగం	క్రీ.పూ. 4200-2050	ఫిబ్రవరి (మాఘమాసంలో) కుంభరాశిలో ఉత్తరాయనారంభం
వరాహమిహిర కాలం	మేషయుగం	క్రీ.పూ. 2050- క్రీ.శ.100	జనవరి (పుష్యమాసంలో) మరకరాశిలో ఉత్తరాయనారంభం
ప్రస్తుత కాలం	మీనయుగం	క్రీ.పూ. 100- 2250	డిశంబర్ (మార్గశిరంలో) ధనూరాశిలో ఉత్తరాయనారంభం

పట్టిక చూశారు కదా! విష్వద్రేఖ మీనరాశిలో వుంటే అది మీనయుగం. ప్రస్తుతం అదేవుంది. అందుకే ఉత్తరాయనం డిశంబర్‌లో జరుగుతుంది. విష్వద్రేఖ మేషంలో వుంటే అది మేషయుగం. అది క్రీ.పూ. 2050 నుండి క్రీ.శ.100 వరకు. ఆ కాలంలో ఉత్తరాయనారంభం జనవరి (పుష్యమాసం)లో జరిగేది. విష్వద్రేఖ వృషభంలో ఉన్నకాలం వృషభయుగం. అది క్రీ.పూ. 2050 నుండి క్రీ.పూ. 4200 మధ్యకాలం. ఆ కాలంలో ఉత్తరాయనారంభం ఫిబ్రవరినెలలో కుంభరాశిలో జరిగినట్లుగా రథసప్తమి, భీష్మఏకాదశి సాక్ష్యం చెబుతున్నాయి. అంటే మహాభారతకాలం క్రీ.పూ. 2050-4200 మధ్యకాలం అనగా క్రీ.పూ. 3200 ప్రాంతం అనేది యథార్థం.

ఆ కాలానికే అయనాంతాలు, తిథులు, నక్షత్రాలు, మాసాలు, అధికమాసాలు, విష్వద్రేఖ, ధృవతారల మార్పు వగైరా యెన్నో విషయాలు మన హిందువులు కనుగొన్నారని మహాభారతం సాక్ష్యమిస్తుంది. ఆ కాలానికి విదేశీయుల విజ్ఞానం అంతగా వికసించలేదు. అందుకు మన ప్రాచీన ప్రాభవాన్ని సహించలేక మహాభారతాన్ని నవీనకాలపు గాథగా చిత్రించాలని వాళ్ళు అనేక తిప్పలు పడ్డారు. కానీ ఎన్నటికీ మార్చలేని ఖగోళ ఋజువుల్ని ఎవరు మాత్రం ఎలా మార్చగలరు?

మొత్తం మీద మహాభారతం జరిగి 5 వేల (క్రీ.పూ. 3000+ క్రీ.శ.2000) సంవత్సరాలయిందని తెలుస్తుంది. మెల్లమెల్లగా విదేశీయులంతా కూడా దీన్ని అంగీకరిస్తున్నారు.

❀❀❀

26. వృక్షశాస్త్రం, వైద్యశాస్త్రం

వృక్షశాస్త్రంలో మన జగదీశ్‌చంద్రబోస్ జగద్విఖ్యాత శాస్త్రజ్ఞుడని అందరికీ తెలుసు. ఆయనకంటే పూర్వకాలంలో కూడా మన భారతీయులు వృక్షశాస్త్ర పరిశోధనలు క్షుణ్ణంగా చేశారు. వృక్షాల్లోని కణనిర్మాణం గూర్చి ప్రప్రథమంగా పరిశోధన చేసినవారు పరాశరమహర్షి. వృక్షకణాల గూర్చి విస్తృతమైన వివరణ ఇచ్చాడాయన. ఎంత విస్తృతమంటే మైక్రోస్కోపులో చూసి పరిశోధించి తెలుసుకునే దానికన్నా విపులంగా వివరించాడు. మామూలు కంటికి కనిపించని కణంలోని విభాగాలను వర్ణించాడంటే బహుశా మైక్రోస్కోపులాంటి సాధనం ఏదో పరాశరుడి వద్ద వుండివుంటుంది. భారతంలోని భీష్ముడికంటే ముందువాడైన పరాశరుడు వ్రాసిన "వృక్షాయుర్వేదం" గ్రంథంలో ఇలాంటి మంచి వివరాలెన్నో ఉన్నాయి. అతి పెద్ద వృక్షాలను చిన్నసైజులో ఇంటివద్ద పెంచుకునే 'బోన్‌సాయ్' అనే చైనా వారి పద్ధతిని, చాలా ప్రాచీనకాలంలోనే చరకుడు తన గ్రంథమైన 'వామన తరువృక్షాది విద్య' లో చెప్పాడు.

వైద్యశాస్త్రవేత్తలయిన "చరకుడు", "జీవకుడు" "సుశ్రుతుడు" మొదలైనవారు కూడా వృక్షశాస్త్రం గూర్చి అద్భుతమైన వివరాలను అందించారు.

వైద్యానికి పనికొచ్చే వృక్షజాతి గురించి మన ప్రాచీన హిందువులు ఎంతగా పరిశోధించారంటే... పూర్వకాలంలో గురుకులంలో వృక్ష, వైద్యశాస్త్రాలను పూర్తిచేసిన విద్యార్థులకు, స్వగృహాలకు వెళ్ళేముందు ఒక పరీక్ష పెట్టేవారట. అరణ్యాల్లో అంతా తిరిగి, దేనికీ పనికిరాని ఒకమొక్కను తేవాలనేదే ఆ పరీక్ష. ఒకవేళ ఎవరయినా ఏదయినా ఒకమొక్క పనికిరాదని తెస్తే, వారు పరీక్ష ఫెయిలయినట్లే! మళ్ళీ వారు గురుకులంలో ఉండిపోయి,

ఆ మొక్క యొక్క విశిష్టత కూడా నేర్చుకుని తిరిగి పరీక్షకు హాజరు కావాలి. ఏనాడయితే అన్నిమొక్కలు, వృక్షాల విశిష్టత, ఉపయోగం నేర్చుకుంటారో అప్పుడేవారి విద్యాభ్యాసం ముగిసినట్లు లెక్క.

ఇక వైద్యం సంగతి ప్రత్యేకించి వేరే చెప్పనక్కర్లేదు. మన ప్రాచీన హిందూ వైద్యం అంటే ఆయుర్వేదమే! మన ఋగ్వేదానికి ఉపవేదం ఆయుర్వేదం. దీనిలో సమస్త రోగాల వివరాలు, ఔషధవిజ్ఞానం, రసాయనశాస్త్రం, శరీరవిజ్ఞానం, వివిధ ఆపరేషన్ల రకాలు, విధానాలు అన్నీ ఉన్నాయి. ఆ విధంగా వైద్యశాస్త్రానికి కూడా మనవారే ఆద్యులు.

రామాయణంలో సుషేణుడు హిమాలయాల్లోని మూలికలను కూడా వివరించాడు. విరిగిన అవయవాలను అతుకుటకు, గాయాల్ని మాన్పుటకు, చర్మకాంతిని సరిచేయుటకు, మృత్యుదరిలో ఉన్నవారినైనా తిరిగి క్షణాల్లో జీవింపచేయుటకు మూలికలను వివరించాడు. రామాయణ, మహాభారతాల్లో, వేదాల్లో గల వైద్య అద్భుతాలను గురించి మేము వ్రాసిన "పురాణాల్లో సైన్స్" "సులభశైలిలో వేదవిజ్ఞానం" లో చదవండి.

మన ప్రాచీన హిందూవైద్య గ్రంథాల్లో ఎనిమిది రకాల ఆపరేషన్లు వివరించబడ్డాయి. మహాభారతంలో నారదుడు కూడా శస్త్రచికిత్సల్లో 8 రకాలున్నాయని చెప్పాడు. అవి 1. ఛేద్యక్రియ (కోయుట). 2. భేద్యక్రియ (లేపరోస్కోపి) 3. లేఖ్యక్రియ 4. వేద్యక్రియ (చెడిన భాగములను తీసివేయుట) 5. ఐష్యక్రియ (శరీరభాగాలను కోసి రోగనిర్ధారణ చేయుట అనగా... పెథాలజీ) 6. ఆహార్యక్రియ (హానికర ఉత్పత్తులను నిరోధించుట. అనగా కాన్సరు నిరోధం) 7. విశ్రవ్యక్రియ (వ్యర్థజలమును తీసివేయుట) 8. సీవ్యక్రియ (గాయాలకు కుట్లు వేయుట)

ఇవన్నీ కలియుగపు ప్రథమ సర్జను శుశ్రుతుడు వ్రాసిన శుశ్రుత సంహితలో కూడా ఉన్నాయి.

ప్రస్తుతం మనడాక్టర్లు చేసే వైద్యాలు, ఆపరేషన్లు ఇవే కదా! ఇంకా అనేక రకాల వైద్యాలు.... ఎముక విరిగినప్పుడు కట్లు, నేత్ర, ఇ-ఎన్.టి., ప్రేగులు యొక్క ఆపరేషన్లు, కాన్సర్ కంతులు తొలగించుట, శిశుజనన

ఆపరేషన్లు, నాడీమండల ఆపరేషన్లు, ప్లాస్టిక్ సర్జరీలు... అన్నీ కూడా శుశ్రుతుడికి తెలిసిన విద్యలే! కళ్ళలోని కాటరాక్ట్ తొలగించే శస్త్రచికిత్సలు కూడా శుశ్రుతుడు చేసినట్లుగా ఋజువులున్నాయి.

కశ్యపుడు, గర్గుడు, గౌలవుడు, జీవకుడు, విదేహుడు, నిమి, కంకాయనుడు, పుష్కలావతుడు, గోపరక్షితుడు, ప్రవర్తకుడు, సుశ్రుతుడు, చరకుడు, నాగార్జునుడు, భోజుడు, వాగ్భటుడు, దైవాంశ సంభూతులైన ధన్వంతరి, అశ్వినులు మొదలైన హిందూ వైద్యులంతా మనకు వందనీయులే!

❀❀❀

27. కాగితం తయారీ

క్రీ.శ. 105లో చైనీయులు కనుగొన్న కాగితం తయారీని అనంతర కాలంలో హిందువులు నేర్చుకున్నారనేది నేటి కుహనా మేధావులు చెప్పే అబద్ధపు పాఠం. అంతకంటే ఐదువందల ఏళ్ళకు పూర్వమే మన హిందువులు ప్రత్తినుండి కాగితం తయారుచేసే వారని "యాజ్ఞవల్క్యస్మృతి" ఋజువు చూపుతుంది.

అంతేకాక క్రీ.శ. 600 తరువాత మనదేశం వచ్చిన చైనా యాత్రికులు మనదేశంలో వాడబడుతున్న కాగితాలను చూసి అబ్బురపడి, వారి గ్రంథాల్లో మెచ్చుకుంటూ వ్రాసుకున్నారట.

గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీస్ కూడా మనదేశంలో విరివిగా కాగితాల వాడకం జరిగేదని తనగ్రంథంలో వ్రాసుకున్నాడు.

ఈవిధంగా ఎందరో విదేశీయులు మన ప్రాచీన కాగితం గూర్చి ఆశ్చర్యపోయారంటే, అప్పటివరకూ వారికి కాగితం గూర్చి తెలియక పోవటమే!

కాగితాన్ని వెదురుగుజ్జుతో చేయడాన్ని మాత్రం మొదటగా చైనావారు కనిపెట్టారు. మన ప్రాచీనఖ్యాతిని సహించలేని పాశ్చాత్యులు, ఆ విషయాన్ని ఆసరాగా తీసుకుని, కాగితం కనుగొన్న ఖ్యాతిని చైనావారికి దత్తం చేశారు.

ఇదే విధంగా పంచదార తయారీని కూడా చైనావారికే అంటగట్టేశారు. కానీ నిజానికి బెల్లం, పంచదార కూడా మన భారతీయులు కనుగొన్నవే! రామాయణ, మహాభారతాల్లో పంచదార ప్రసక్తి కనిపిస్తుంది. మన సంస్కృత పదం శర్కర (చెక్కెర) క్రమంగా మారి మారి.... ఇంగ్లీషు 'సుగర్' గా రూపొందిందనే విషయం మరచిపోకండి.

❀❀❀

28. గణితం

ఈనాటికీ ప్రపంచంలోకెల్ల గణితమేధావులకు నిలయం మన భారతదేశమే!

అసలు ప్రాచీనకాలంలో గణితశాస్త్రాన్ని కనుగొన్నది హిందువులే! ఈ విషయమై కొన్ని వివరాలు మా "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు" లో వ్రాశాం చదవండి.

అతి పెద్ద సంఖ్యామానం, స్థానవిలువలు, బీజగణితం, కలనగణితం, ట్రిగనామెట్రీ, రేఖాగణితం, డెసిమల్‌పద్ధతి, π విలువను కనుగొనడం... ఇవన్నీ హిందువుల ఆవిష్కరణలే!

గణితశాస్త్రాన్ని పరిపూర్ణంచేసిన "సున్న"ను హిందువులే కనుగొన్నారు అనేది ప్రపంచమంతా ఒప్పుకున్న విషయమే! ఉపనిషత్తులలో కూడా ఈ సున్న ప్రస్తావన కనిపిస్తుంది. π అనే గణితసూత్రాన్ని పైథాగరస్ అనే పాశ్చాత్యుడి పరం చేయాలని చాలమంది ఆరాటం. కానీ అతనికంటే ఎన్నో వందల యేళ్ళ పూర్వంవాడైన మన ఆర్యభట్టు π విలువ 3.143 అని తన ఆర్యభట్టీయ గ్రంథంలో వివరించాడు. మహావీరుడు, భాస్కరాచార్యుడు, బుధాయనుడు వంటి పండితులు ఎంతోమంది గణిత శాస్త్రాన్ని ఎంతగానో పరిపుష్ఠం చేశారు.

రేఖాగణితం కూడా మనకు పాశ్చాత్యుల నుండి వచ్చినట్లు వాదించే మూర్ఖులున్నారు. రేఖాగణితం మన వేదకాలంనుండీ ఉంది. వేదఋషులు దాన్ని 'శుల్బసూత్రాలు' అనేవారు. శుల్బం అనగా త్రాడు. త్రాడుతో కొలత వేసి యజ్ఞ మండపాలు, వేదికలు నిర్మించేవారు.

అలాగే భూమి కొలతలకు ఈ రేఖాగణితాన్ని ఋషులు వాడేవారు. "జ్యా" అనగా భూమి. కనుక భూకొలతలకు వాడే ఈ సూత్రాలను "జ్యామితి" అనేవారు. అదే నేడు "జామెట్రీ" అనే పదంగా ప్రపంచమంతా వాడుతున్నారు.

ఇంకా వృత్తాలు, త్రిభుజాలు, చతుర్భుజాలు.... పంచ, షట్, అష్ట భుజాలకు సంబంధించిన కొలతలు, వైశాల్యం, పరిధి వగైరా లెక్కలు... పట్టకం, ఘనం, శంఖువు, గోళంల కొలతల సూత్రాలు.... ఇవన్నీ భాస్కరాచార్య, బ్రహ్మగుప్తాది హిందూ శాస్త్రవేత్తల గణితగ్రంథాల్లో నేటికీ కనిపిస్తుండగా.. అవన్నీ తామే హిందువులకు నేర్పినట్లు చెప్పుకోవడం విదేశీయుల దుస్సాహసం. బీజగణితం, అంకగణితం కూడా భాస్కరాచార్యుని "లీలావతి గణితం"లో సవివరంగా ఉన్నాయి.

ఆనాడూ, ఈనాడూ కూడా గణితశాస్త్ర ప్రముఖులం మన హిందువులమే!

❀❀❀

29. మన ప్రాచీన లోహ పరిజ్ఞానం

పూర్వం మన భారతదేశాన్ని 'రత్నగర్భ' అనేవారు. వివిధ రకాల రత్నాల, వజ్రాల గనులు, టన్నులకొలదీ బంగారం కలిగిన దేశం మనదికావడమే దీనికి కారణం. పూర్వకాలం నుండీ ఎన్నో విదేశీ మూకలు మనదేశాన్ని దోచుకుంటూ రత్నాల, వజ్రాల రాశుల్నీ, టన్నులకొద్దీ బంగారాన్నీ తమతమ దేశాలకు తరలించుకుపోయారని చరిత్ర చెప్తోంది. మనదేశ మహారాజులు బంగారాన్ని కేవలం ఆభరణాలకే కాదు. వివిధ కట్టడాలకు, వివిధ ప్రయాణ సాధనాలకు, సింహాసనాలకు, ఆయుధాలు మొదలగువాటికి కూడా విరివిగా వాడినట్లు చరిత్ర చెప్తోంది. మన దేశ సంపదలపై కన్నువేసిన విదేశీ ముష్కరులెంతో మంది మనవారిపై దౌర్జన్యాలు, దండయాత్రలూ జరిపారు. ఆనాడు అంతటి సంపన్నదేశం మనది. అయితే మనవాళ్ళు అతి ప్రాచీన కాలాన అంత బంగారాన్ని ఎన్నోవిధాల ఉపయోగించుకున్నారనే విషయాన్ని గురించి ఓసారి ఆలోచించిచూడండి. బంగారం అనేది ఎక్కడ పడితే అక్కడ

భూమిలో త్రవ్వేస్తే, దొరికేది కాదు. పైగా అది దొరికినా, బహునల్లని 'క్వార్ట్జ్' రూపంలో లభిస్తుంది. పరిశ్రమలు, యంత్రాల సాయంతో చాలాకష్టపడి క్వార్ట్జ్ నుండి బంగారాన్ని సంగ్రహించవలసి ఉంటుంది. నేడు మనం, మన ఆధునిక యంత్రపరికరాల సాయంతో ఏ ఏ నేలల్లో ఎక్కడెక్కడ బంగారం నిక్షిప్తమైఉందో ముందుగా కనుగొని, ఆ తర్వాత క్వార్ట్జ్ నుండి విడగొట్టి, బంగారాన్ని సంగ్రహించగలుగుతున్నాం. ఇది నేటి మన టెక్నాలజీ! మరి మన పూర్వీకులు టన్నులకొద్దీ బంగారాన్ని భూమి నుండి వెలికి తీయగలిగారంటే.. వారికీ ఓ టెక్నాలజీ ఉండేదనేది తిరుగులేని యథార్థం కదా! అయితే విదేశీయులచే నాశనం చేయబడిన మన ప్రాచీన విజ్ఞాన సంపదలో ఇటువంటి మహత్తర టెక్నాలజీలు ఎన్నింటినో మనం కోల్పోయాం. ఇలా భూమినుండి బంగారం తీయడంలోనే కాదు. 'పాదరసం నుండి బంగారం తయారీ' అనే 'రసవాదం' కూడా మన ప్రాచీనులకు తెలుసు. దీన్నిబట్టి మన ప్రాచీన హిందువులకు పరమాణు నిర్మాణం గురించి కూడా తెలుసునని అర్థమౌతోంది. (వివరాలకు మా "పురాణాల్లో సైన్స్" గ్రంథం చదవండి). బంగారం విషయంలోనే కాదు. ఏనాటికీ తుప్పు పట్టకుండా ఉండే ఇనుప (Iron) నిర్మాణాల్ని కూడా వారు చేయగలిగేవారు. (ఉదాహరణకు మన ఢిల్లీ నగరంలోని ఇనుపస్తంభాన్ని నేటికీ చూడవచ్చు.) భూమినుండి జింక్‌ను సంగ్రహించి, దాన్ని వాడుకునే విధానాన్ని తెలుసుకున్న ప్రథములు హిందువులే! మన ప్రాచీన హిందువుల లోహపరిజ్ఞానం అపారమని మనకు అనేకవిధాల తెలియవస్తుంది.

❀❀❀

30. ప్రాచీన హిందూ ఖగోళ విజ్ఞానం

పాశ్చాత్యుల కంటే ఎన్నో వేలయేళ్ళ పూర్వమే మన హిందూ ఋషులు కనుగొన్న ప్రాచీన ఖగోళ విషయాలను క్లుప్తంగా పరిశీలిద్దాం.

భూమి గోళాకారం గురించి ముందుగా కనుగొన్నది తామేనని చరిత్రలో వ్రాసుకున్నారు విదేశీయులు. ప్రపంచాన అతి ప్రాచీన గ్రంథాలయిన మన

వేదాల్లో.... భూమిని 'భూగోళం' అని మన మహర్షులు సంబోధించడం గురించి వాళ్ళు ఆలోచించలేకపోయారు. వారి సంగతి వదిలేయండి. మనదేశంలోని కొంతమంది మూర్ఖులు కూడా ఈ విషయాన్ని నేటికీ గ్రహించలేకపోతున్నారు. సరే, అదలా ఉంచి... అసలు విషయానికి వద్దాం. ముందుగా 'విశ్వం' (Universe) సంగతి చూద్దాం.

ఈ విశ్వం ఎలా ఏర్పడింది? అనే విషయంపై ఆధునిక శాస్త్రజ్ఞులు అనేక పరిశోధనలు చేశారు. అనేక సూత్రాలను ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యమయింది... "బిగ్‌బ్యాంగ్" సూత్రం. అయితే వీరందరికంటే అనేక వేల ఏళ్ళక్రితమే మన హిందూఋషులు ఇదే సూత్రాన్ని పురాణ పరిభాషలో గ్రంథస్థం చేశారు. (వివరాలు మా "పురాణాల్లో సైన్సు"లో చదవండి). ఆదిశక్తి ఆజ్ఞమేరకు శ్రీమహావిష్ణువే ఈ సకల విశ్వాన్నీ సృష్టిస్తాడు. మళ్ళీ తనలో ఐక్యం చేసుకుంటాడు. అదే బిగ్‌బ్యాంగ్ మరియు విశ్వముకుళిత సూత్రాల సారాంశం.

విశ్వంలో అనేక గెలాక్సీలు, నెబ్యులాలు ఉన్నాయి. వాటిలో ఒక ముఖ్యమైన గెలాక్సీ "మిల్కీవే (అదే...పాలపుంత). పాలపుంత ఎందుకంత ముఖ్యమైనదంటే... మన సూర్యకుటుంబం అంతా, ఆ పాలపుంతలోని ఒక చిన్న భాగం కాబట్టి! ఆధునికులు కనుగొన్న ఈ విషయం కూడా మన హిందువులకు చాల ప్రాచీనమైనదే! అనంతంగా వ్యాపించి వున్న పాలపుంతలో ఎక్కడో మధ్యలో ఒకచోట వుంది మన సౌర (సూర్య) కుటుంబం. ఇది చాల విచిత్రం కదా! మన భూమిపై నుండి చూస్తే... ఆకాశంలో పాలపుంత ఎన్నో కోట్ల మైళ్ళదూరంలో కనిపిస్తుంది. కానీ మన భూమి, ఆ పాలపుంత మధ్యలో వుందంటే చిత్రంగా లేదూ! కానీ అది నిజం!! అందుకే ఒక సమయంలో (భూమిపై) పూర్వార్థ గోళం నుండి చూసినా, పశ్చిమార్థ గోళం నుండి చూసినా.... మరెక్కడి నుండి చూసినా ఆకాశంలో పాలపుంత వుంటుంది. కారణం.... పాలపుంత మధ్యలో మన 'భూగోళం' (మొత్తం సౌరకుటుంబం) వుండటమే! అలాంటి విచిత్ర విషయాన్ని కూడా మన ఋషులు గుర్తించారు.

మన పురాణాల్లో పాలపుంతను 'ఆదిశేషుడు' అనే మహా సర్పంగా

వర్ణించారు. ఎక్కడినుండి చూసినా ఆకాశంలో ఈ భూగోళం చుట్టూ ఒకరింగులా వ్యాపించి ఉంది ఈ పాలపుంత. దాని ఆది, అంతం అనేవి కనిపించవు. అందుకే ఆదిశేషుడికి "అనంతుడు" అని మరో పేరు పెట్టారు.

అయితే ఈ పాలపుంత మధ్య మధ్య కాస్త కాస్త చీలిపోయి పాయలైనట్లుగా కూడా కనిపిస్తుంది. అలా ఏడుచోట్ల చీలినట్లుగా గమనించిన కొందరు ఋషులు ఆదిశేషుడికి ఏడు పడగలుంటాయని వర్ణించారు.

అనేక కోటానుకోట్ల నక్షత్రాలతో ఏర్పడిన తారాతోరణమే ఈ పాలపుంత. ఆ విషయం కూడా ఋషులకు తెలుసు.

అందుకే ఆదిశేషుడికి వేయి పడగలనీ, కోటిపడగలనీ పలువిధాల కీర్తించారు మరికొందరు ఋషులు. ఒక్కొక్క నక్షత్రం ఒక్కొక్క పడగ అని వారి భావం.

మన గ్రంథాల్లో ఈ భూగోళాన్ని 'ఆదిశేషుడే' సదా మోస్తూ వుంటాడనివున్న వర్ణనను చూసిన ఆధునికులు హేళన చేస్తూ వుంటారు. వారికి తెలిసినది కేవలం భూగోళం శూన్యంలో తేలియాడుతుందని మాత్రమే! కానీ భూగోళం శూన్యంలో ఉన్న మాట, పాలపుంత మధ్యలో ఉన్నమాటా కూడా తెలుసు కాబట్టే ఋషులు.... భూమి పాలపుంతలోని ఒక చిన్న భాగం కనుక, ఆదిశేషుడు మోస్తూ వున్నాడని చమత్కరించారు. శ్రీమన్నారాయణుడు ఎల్లప్పుడు పాలసముద్రంలో ఆదిశేషు పాన్పుపై శయనించి ఉంటాడని మరో చమత్కారం కూడా చేశారు. ఎందుకంటే సకల విశ్వం (విశ్వరూపం) విష్ణువే! ఆ శ్రీమన్నారాయణ ప్రత్యక్ష స్వరూపం మన సూర్యుడు (సూర్యనారాయణుడు) అంటాయి మనగ్రంథాలు. ఎందుకంటే జీవరాశి సృష్టికీ, దాని మనుగడకూ, ఆ సకల సృష్టినీ మనం చూడడానికీ, విశ్వంలోని సూర్యుడే మూలకారణం. అందుకే కొన్ని సందర్భాల్లో సూర్యనారాయణ స్వరూపాన్ని శ్రీమన్నారాయణ స్వరూపంగా వర్ణిస్తారు ఋషులు. అందుకే పాలపుంతపై (మధ్యలో) వుండే సూర్యుణ్ణే శేషశయనుడైన విష్ణువుగా చమత్కరించారు. (ఆ పాలపుంతనే కొందరు ఋషులు క్షీరసాగరంగానూ, మరికొందరు ఆదిశేషువుగానూ వర్ణించారు.)

సూర్యుడితో పాటు భూమి, భూమిమీది ధనరాశులు అన్నీ ఆ పాలపుంతపైనే ఉండడం వల్ల... సూర్యుడి అదిదేవుడు విష్ణు, భూగోళ అదిదేవత భూదేవి, ధనాధిదేవత శ్రీదేవి (వెరసి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీమన్నారాయణుడు) ఆదిశేషుడిపై కొలువై వున్నాడని వర్ణించారు.

ఈ విశ్వం, పాలపుంత.... ఇంకా ఇతర ఖగోళాంశాల గూర్చి మరెన్నో రహస్యాలను మన ఋషులు గుర్తించారు. కాని ప్రస్తుతం మన చర్చనీయాంశం సౌరకుటుంబం కనుక, ఇక గ్రహ విషయాలను చూద్దాం.

హిందువుల లెక్కప్రకారం గ్రహాలు తొమ్మిది. అవి సూర్యుడు, చంద్రుడు, బుధుడు, శుక్రుడు, కుజుడు, గురుడు (బృహస్పతి), శని, రాహు, కేతువులు. వీటిలో ముఖ్యుడు సూర్యుడు.

సూర్యుని గురించి :- నిజానికి సూర్యుడు గ్రహంకాదు. పాలపుంతలో గల కోటానుకోట్ల నక్షత్రాల్లో ఒక చిన్న నక్షత్రమే 'మన సూర్యుడు'. ఈ విషయం ప్రాచీన హిందువులకు తెలియదనీ, అందుకే సూర్యుణ్ణి నవగ్రహాల్లో చేర్చారనీ చాలమంది మూర్ఖుల అభిప్రాయం. ఇక్కడ మనం ఒక విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవలసి ఉంది.

సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ, రాహుకేతువుల్నీ (జ్యోతిష) గ్రహాలుగా చెప్పడంలోని అంతరార్థం:-

మన జ్యోతిష శాస్త్రంలో వాడబడిన 'గ్రహము' అనే పదానికి 'ప్లానెట్' (Planet) అనే ఆంగ్లపదంతో ఎట్టి సంబంధమూ లేదు. విదేశీయుల ఆధునిక విజ్ఞానం (సైన్స్) ప్రకారం సూర్యకుటుంబంలో చెప్పబడిన గ్రహాలు (Planets) వేరు. మన ప్రాచీన హిందువులు చెప్పిన (జ్యోతిష) నవగ్రహాలు వేరు. విదేశీయులు చెప్పిన ప్లానెట్స్, కేవలం సూర్యుని చుట్టూ తిరిగే గోళాలు మాత్రమే! మన కాలమాన, పంచాంగ, జ్యోతిషశాస్త్రాల్లో చెప్పడిన నవగ్రహాల విషయం అలాకాదు. సూర్యకుటుంబంలో ఉంటూ మన భూమి మీదవున్న జీవ, నిర్జీవాలపై ప్రభావాన్ని చూపించే వాటిని జ్యోతిష (నవ) గ్రహాలుగా తీసుకున్నారు మన ప్రాచీన మేధావులు. ఒక నక్షత్రం చుట్టూ తిరిగే గోళాన్ని మాత్రమే "గ్రహము" అంటారనుకునే వెర్రితనం నుండి మనం బయటపడాలి. తెలుగు పదమైన "గ్రహము" అనేది, ప్లానెట్ అనే ఆంగ్లపదానికి సాటి అయిన అర్థం కాదు. మన ప్రాచీన హిందువులు చెప్పిన

నవగ్రహాల పరిజ్ఞాన మూలసూత్రమే వేరు. దేన్నయినా ప్రభావితం చేసి లాగుతూ, తన ఆధీనంలో ఉంచుకునే ప్రతీదీ "గ్రహమే!" అందువల్ల మన భూమిపై ఉన్న జీవ, నిర్జీవాలకు చెందిన స్థితిగతులను ప్రభావితం చేయగల అంతరిక్ష అంశాలను "గ్రహములు" గా స్వీకరించారు మన పూర్వీకులు. ఈ సిద్ధాంతప్రకారమే "సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ, రాహుకేతువుల్నీ" గ్రహములుగా చెప్పారు వాళ్ళు. ఈ జ్యోతిష నవగ్రహాలకు మనం "గ్రాహకులు"గా లెక్క. గ్రాహకులపై వివిధ రకాల ప్రభావాలను కలిగించేవే "గ్రహాలు!!"

ఇదీ మనప్రాచీన నవగ్రహాల అర్థం, అంతరార్థం, పరమార్థం!!

సూర్యుడు ఒకతార (నక్షత్రం) అని, మన ప్రాచీన ఋషులకు బాగా తెలుసుననే విషయం మనకు "తారాశశాంకం" అనే పురాణకథ వలన తెలుస్తుంది. (తారాశశాంకం కథ, దాని అంతరార్థ వివరాల కొరకు మా "పురాణాల్లో సైన్సు" చదవండి). సౌరకుటుంబంలోని గ్రహాలన్నీ సూర్యుడి నుండి పుట్టినవే అని కూడా మన ఋషులు గుర్తించారు. వాటి వివరాలు ఈ వ్యాసంలో ముందు ముందుచూద్దాం.

జ్యోతిషశాస్త్రం కొరకు మాత్రమే సూర్యుణ్ణి ఒక గ్రహం మాదిరిగా లెక్కించారు. కానీ సూర్యుడు నక్షత్రమేననీ, సూర్యుని చుట్టూ గ్రహాలన్నీ తిరుగుతాయనీ, భూమిచుట్టూ సూర్యుడు తిరగడనీ భూమే సూర్యుని చుట్టూ తిరుగుతుందనీ ఋషులకు తెలిసినా కూడా.... మన మామూలు కంటికి సూర్యుడే రాశిచక్రంలో తిరుగుతున్నట్లు కనిపిస్తుంది కనుక, 'సూర్యచారం' పేరుతో సూర్యుడు ఏ సమయంలో, ఏ రాశిలో వుంటాడో... ఎంతకాలానికి ఒక రౌండు పూర్తి చేస్తాడో లెక్కగట్టి... ఇటు కాలమానంలోనూ, అటు జ్యోతిషశాస్త్రంలోనూ సూర్యచారాన్ని ఉపయోగించుకున్నారు.

రాశిచక్రంలోని ఒక్కొక్క తార వద్ద 15రోజుల పాటు వుంటాడు సూర్యుడు. ఆ 15 రోజులను "కార్తె' అంటారు. సూర్యుడు ఒకరాశినుండి ఒక రాశిలోకి మారడాన్ని 'రాశిసంక్రమణం' అంటారు. ఒక రౌండుపూర్తి కావటానికి పట్టే కాలాన్ని 'సౌరసంవత్సరం' అంటారు. అలా సూర్యుడి నడకలతో కాలమానాన్ని కొలవడం సాగించారు.

ఏనాడో మేరు పర్వత నివాస కాలం నుండీ కూడా సూర్యుడి గూర్చి పరిశోధించారు మన ఋషులు. సూర్యోదయానికి ముందుగా లేత కాంతులను 'ఉషస్సు' అంటారు. దానినే 'ఉషాదేవి' అనీ, మధ్యాహ్న భానుడి కాంతులను 'పద్మిని' అనీ, సాయంసంధ్యాకాలపు కాంతిని 'సంధ్యాదేవి' అనీ, చీకటిపడేవేళ అణగారే కాంతి 'ఛాయాదేవి' అనీ... ఆ నలుగురూ సూర్యునికి భార్యలని చమత్కరించారు.

అలాగే సూర్యోదయం సమయంలో దూసుకొచ్చే తెల్లని సూర్య కిరణాలు... పట్టకాలవంటి వర్షపు చినుకుల నుండి ప్రసరించి ఏడురంగులుగా విడివడిన వేళను గుర్తించిన ఋషులు...ఆ ఏడురంగులనే "సూర్యరధాశ్వాలు" (ఏడుగుఱ్ఱాలు)గా వర్ణించారు. ఆ తదుపరి ఆకాశంలో వచ్చే అరుణవర్ణ కాంతినే సూర్యరధసారథి 'అరుణుడు' (అనూరుడు) అని వర్ణించారు. ఆ తరువాత అసలు సూర్యబింబం దర్శనమిస్తుంది. ఆసమయంలో సూర్యబింబం కిరణాలు లేకుండా పూర్ణబింబంగా కనిపిస్తాడు. కిరణాలు, అధికవేడిలేని ఆ బింబాన్నే నోట్లో పళ్ళులేని 'పూషుడు' అని వర్ణించారు. ఇంకా ఆ సూర్య బింబంలోని మార్పులు, సూర్యకాంతి విస్తరణ వగైరా వివరాల కొరకు మా "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు" లో 'వామనావతారకథ' ను చదవండి.

సూర్యరశ్మి నుండి 'డి' విటమిన్ లభిస్తుందనే విషయాన్ని కూడా ఋషులు గుర్తించారు. అందుకే ఒకవైపు వ్యాయామం, మరోవైపు "డి," విటమిను పొందడం... రెండూ కలసి వచ్చేలా 'సూర్యనమస్కార విధి'ని ఏర్పరచారు.

ఈనాడు సౌరశక్తి నుండి కరెంటు తయారీ, వంట వండడం తదితర ప్రక్రియలకు బాగా ప్రచారం జరుగుతుంది. అలాంటి 'సోలార్‌కుక్కర్' తయారీకి కూడా పురాణకాలంలోనే పునాది వేయబడింది. సోలార్‌కుక్కర్‌తో వండిన భోజనం తిన్న మొదటి మానవుడు, కాశీరాజు అయిన 'దివోదాసు' అనే శివభక్తుడని శివపురాణం చెప్తోంది.

ఇంకా సూర్యుని గూర్చిన ఎన్నో విజ్ఞానవిషయాలు మన వేద,

పురాణేతిహాసాల్లో వున్నాయి. వాటిలో కొన్ని మా ఇతర రచనల్లో ఉదహరించాం. అందుకే ఇందులో క్లుప్తంగా పరిచయం చేశాం.

చంద్రుని గురించి :- తరువాత గ్రహం "చంద్రుడు". నిజానికి ఇదీ గ్రహం కాదు. ఉపగ్రహం. ఆ విషయం ఋషులకు తెలిసినా కాలమానం లెక్క మరియు జ్యోతిషశాస్త్రం కొరకు చంద్రుణ్ణి గ్రహాల జాబితాలో చేర్చారు.

చంద్రుడు చాలాకాలం క్రితం భూమినుండి విడివడిన భాగమే అని కొంతమంది ఆధునిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం. మన ఋషులు ఏనాడో ఈ సంగతిని వెల్లడించారు. భూమినుండి చంద్రుడు విడిపోయిన ప్రదేశంలో భూమిపై పెద్ద గుంట యేర్పడి, నీటితో నిండిపోయిందనీ, అదే 'పసిఫిక్ మహాసముద్రం' అని కొందరు ఆధునికులు తీర్మానించారు. అదే విషయాన్ని వేలాది సంవత్సరాలకు ముందే మన హిందువులు 'సాగరమథనంలో... సముద్రం నుండి చంద్రుడు పుట్టి ఆకాశానికెగిరి వెళ్ళాడని' చమత్కరించారు.

మన భూగోళానికి అదిదేవుడు 'శివుడు'. భూమితోపాటు భూమి చుట్టూ తిరిగేది 'చంద్రుడు'. అందుకే శివుని సిగలో అలంకారంగా చంద్రుణ్ణి వర్ణించారు.

చంద్రకళలు ఏర్పడటానికి కారణం ఋషులకు బాగా తెలుసు. చంద్రుడు ఏ రోజు, ఎన్నిగంటలకు ఎంతభాగం పెరుగుతాడో, ఎంత భాగం తరుగుతాడో క్షుణ్ణంగా నిమిషాలతో సహా లెక్కించి పంచాంగంలో 'తిథుల' పేరిట చేర్చినట్లుగా వేద, పురాణాల వలన తెలుస్తుంది. అలాగే ఏ నక్షత్రపరిధిలో చంద్రుడు ఎంత సమయం విహరిస్తాడో కూడా లెక్కించారు. వీటికి సాక్ష్యం పురాణకాలం నుండీ వస్తున్న పంచాంగాలే!

తిథి, నక్షత్రం, పక్షం, మాసం, చాంద్రమాన సంవత్సరం... యిలా చంద్రుని ఆధారంగా కాలమానం కూడా యేర్పరచారు మన హిందువులు. ఇంకా చంద్రుడికి, భూమికి మధ్యదూరం.... చంద్రుడి కొలతలు, ఉపరితల లక్షణాలు అన్నీ పరిశోధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈనాటి ఆధునికులు చంద్రుని గురించి కనుగొన్న విషయాలన్నీ, మన ఋషులు ఏనాడో గుర్తించినవే!

బుధుని గురించి :- సూర్యుడికి అతి దగ్గరగా వుండే గ్రహం బుధుడు. ఈ బుధుణ్ణి మామూలు కంటితో చూసి గుర్తించటం చాల కష్టం. ఎందుకంటే సూర్యుడికి దగ్గరగా వుండటం వలన, సూర్యకాంతిలో ఈ చిన్నగ్రహం సులభంగా కనిపించదు.

ఒకానొక సంపూర్ణ సూర్యగ్రహణం రోజున మన ఋషులు చేసిన పరిశోధనల్లో ఈ బుధగ్రహం గుర్తించబడింది. ఆ కొద్ది సమయంలోనే బుధగ్రహం గూర్చి క్షుణ్ణంగా పరిశీలనచేసి ఆ గ్రహంయొక్క లక్షణాల్నీ, ఉపరితల విషయాల్నీ కనుగొన్నారు. చంద్రుడి ఉపరితల లక్షణాలు, బుధగ్రహ లక్షణాలు చాలవరకూ ఒకే విధంగా వున్నాయని గుర్తించిన ఋషులు... చంద్రుడికి బుధుడు కుమారుడనీ, తండ్రిపోలిక వచ్చిందనీ చమత్కరిస్తూ 'తారాశశాంకం' అనే పురాణకథ రచించారు. ఆకథలో సూర్యుణ్ణే (తారను) బుధుడి తల్లిగా చమత్కరించారు. ఎందుకంటే నవగ్రహాలు సూర్యుడినుండే ఏర్పడ్డాయి కదా మరి!

(ఈ కథ పూర్తి అంతరార్థం కావలసిన వారు మా "పురాణాల్లో సైన్సు" పుస్తకంలోని "తారాశశాంకం" చదవండి.)

మరి ఈ సంఘటన జరిగిన ఎన్నోవేల ఏళ్ళ తరువాత గాని, పాశ్చాత్యులకు బుధగ్రహం గూర్చి తెలియలేదు. పైగా బుధుణ్ణి గురుగ్రహ పుత్రుడని భ్రమపడుతున్నాయి గ్రీకుల పురాణాలు.

శుక్రుని గురించి :-సూర్యుడి నుండి రెండవగ్రహం శుక్రుడు. తెల్లగా వెన్నముద్దలా మెరిసిపోతూ దర్శనమిచ్చే అందాలగ్రహం శుక్రుడు. ఖగోళంలో చంద్రుని తరువాత అతి ప్రకాశవంతంగా కనిపించే గ్రహం ఇదే! ఈ శుక్రుణ్ణి 'ఉదయతార' మరియు 'సంధ్యాతార' అని కూడా అంటారు. ఎందుకంటే ఈ గ్రహం ఉదయ సంధ్యాకాలంలో అనగా సూర్యోదయానికి ముందు తూర్పు దిక్కున, మరోసారి సాయం సంధ్యవేళ... అనగా సూర్యాస్తమయం తరువాత పశ్చిమాకాశంలోనూ ప్రకాశిస్తూ కనిపిస్తుంది.

ఉభయ సంధ్యాకాలాల్లో రాక్షసుల శక్తి అపారంగా పెరుగుతుందని

మన పురాణాలంటాయి. శుక్రుడు కూడా ఉభయసంధ్యల్లో బాగా ప్రకాశిస్తాడు కదా! అందువల్ల ఆ రాక్షసులకు అపారశక్తిని ప్రసాదించేది ఈ శుక్రుడే అని, శుక్రుణ్ణి 'రాక్షసుల గురువు' గా అభివర్ణించారు.

అంతేకాక సౌరకుటుంబంలో అన్నిగ్రహాలూ ఎడమనుండి కుడివైపుగా తిరుగుతూ సూర్యప్రదక్షిణం చేస్తుంటాయి. కానీ శుక్రగ్రహం మాత్రం అన్ని గ్రహాలకూ వ్యతిరేకంగా కుడి నుండి ఎడమకు తిరుగుతూ సూర్యప్రదక్షిణ చేస్తుంది. ఈ విధంగా సకల గ్రహదేవతలకూ వ్యతిరేకంగా నడుస్తున్నందున దేవతలకు వ్యతిరేకులైన రాక్షసులకు గురువుగా చమత్కార వర్ణన చేశారు.

శుక్రగ్రహం కూడా సూర్యుని నుండే ఏర్పడిందని తెలిసినా రాక్షసగురువు కనుక, ఇతణ్ణి సూర్యపుత్రుడుగా చెప్పకుండా, భృగువు కుమారుడని చెప్పారు. ఎందుకంటే భృగువు అనబడే నక్షత్ర సమీపంలో ఈ శుక్రగ్రహం ఉండగా, ఋషులు ఈ గ్రహాన్ని కనుగొన్నారు. అందుకే అలా ఇతణ్ణి భృగుపుత్రుడని పురాణాల్లో వ్రాశారు.

శుక్రచారంలో ఒక్కొక్కసారి సూర్యుడున్న రాశిలోకే శుక్రుడు వచ్చినప్పుడు సూర్యుడు అడ్డుపడటంవలన శుక్రుడు మనకు కనిపించడు. దాన్నే మనవారు 'శుక్రమౌఢ్యం' అంటారు. ఈ శుక్రమూఢకాలం ప్రారంభ, అంత్యసమయాలను ఖచ్చితంగా లెక్కించి, ఎప్పుడెప్పుడు శుక్రమూఢాలు కలిగేదీ ముందుగానే తెలిసేలా పంచాంగాల్లో వివరించారు.

ఇంకా శుక్రుడి నడకలను కూడా చక్కగా లెక్కించి జ్యోతిషగ్రంథాల్లో చేర్చారు. ఈ శుక్రుడి గూర్చిన పురాణగాథలు ఎన్నో విజ్ఞానాంశాల్ని తెలియజేస్తాయి. శుక్రుడు ఏకాక్షి (ఒక కన్నుగ్రుడ్డి) అంటాయి పురాణాలు. దానికి కారణం 'వామనావతారకథ' అంతరార్థంలో తెలుస్తుంది. (మా "పురాణగాథల్లో సైన్సుఅద్భుతాలు" పుస్తకంలో 'వామనావతారకథ' చదవండి).

కుజుని గురించి :- ఈ కుజుడి అసలు పేరు అంగారకుడు. 'మంగళుడు' అనే మరోపేరు కూడా వుంది. ఆ పేరు మీదనే మనం 'మంగళవారం' అనే పేరు వాడుతున్నాం.

కుజుడు అంటే భూమి యొక్క కుమారుడు అని అర్థం. సూర్యునికీ, భూమికీ కలిపి ఈ కుజుడు పుట్టినట్లుగా ఒక పురాణకథ ఉంది (ఇక్కడ సూర్యుణ్ణి విష్ణువుగా వర్ణించారు)

బుధజననం కథలో స్త్రీరూపంలో వర్ణించబడిన సూర్యుణ్ణి ఇక్కడ పురుషునిగా వర్ణించారు. కుజుడు కూడా సౌరకుటుంబంలో వాడే కనుక సూర్యపుత్రుడని వర్ణించారు.

కుజుడు కూడా మన భూగోళం లాగానే కొంచెం ప్రక్కకు ఒరిగిఉండి తిరుగుతుంటాడు. అందుకే కుజుడిపైన కూడా ఋతువులేర్పడతాయి. ఆ విషయాన్ని మన ఋషులు గుర్తించారు. అంతేకాదు, ఇంకా మరిన్ని కుజగ్రహలక్షణాలను కూడా వారు కనుగొన్నారు. ఆ లక్షణాలన్నీ భూగోళ లక్షణాలకు దగ్గరగా వున్నాయని, అయితే భూగోళం కంటే కుజుడు చిన్నగోళం కనుక, భూమికి కుజుడు కుమారుడని చమత్కరించారు.

మహర్షులు చెప్పిన భూమి, కుజగ్రహల పోలికలు... నేటి ఆధునిక శాస్త్రవేత్తలు చెప్తున్న పోలికలతో సరిగ్గా సరిపోతున్నాయి. అవి ఏమిటో చూద్దాం.

1. భూమి తనచుట్టూ తాను తిరగటానికి 23 గం॥56ని॥ కాగా, కుజుడి ఆత్మభ్రమణానికి కూడా సుమారుగా అంతే సమయం పడుతుంది. (కుజుడి భ్రమణసమయం 24 గం. 37ని॥. అనగా కేవలం 41 నిముషాలే తేడా.)

2. భూగోళం 23 ½^0 ప్రక్కకు ఒరిగి తిరుగుతుంది. అలాగే కుజుడు సుమారు 24^0 ఒరిగి తిరుగుతున్నాడు.

3. సౌరకుటుంబంలోని గ్రహాలన్నింటిలో కేవలం ఈ రెండు గ్రహాలపైనే ఋతువులు ఏర్పడుతున్నాయి.

4. భూమిపై ప్రాణవాయువు వుంది. కుజుడిపై కూడా నేడు కొద్దిగా ప్రాణవాయువు వుంది. (ఒకానొకప్పుడు భూమిపై వున్నంత హెచ్చు ఆక్సిజను వుండేదని శాస్త్రజ్ఞులంటారు.)

5. భూమిపై వాతావరణం వుంది. కుజుడిపై ప్రస్తుతం వాతావరణం

నశించిపోయినా... అతి ప్రాచీనకాలంలో వాతావరణం వుండేదనీ, జీవరాశి, నదులు, సరస్సులు వుండేవనీ శాస్త్రజ్ఞులంటున్నారు.

6. ఈ రెండుగ్రహాలూ సూర్యుని చుట్టూ తిరిగే వేగం కూడా యించుమించు సమానమే! అనగా సంవత్సరం పొడవు, రెండుగ్రహాలకూ సమానమే!

ఇలాంటి పోలికలన్నింటినీ ఋషులు ఏనాడో పాశ్చాత్యుల కంటే ముందుగా కనుగొన్నారు. కనుకనే భూమి పోలికలు గల కుజుడు 'భూమికి కుమారుడని' వర్ణించారు.

కుజగ్రహం ఎఱ్ఱనిమట్టి కలిగివుంటుంది. అందుకే ఆ గ్రహం ఎరుపురంగులో వుంటుంది. అందుకే దానిని మనవారు 'లోహితాంగుడు' అని కూడా అంటారు.

కుజుడిపై ఒకానొకనాడు వాతావరణం, జీవరాశి, నదులు వగైరాలుండేవనీ, నేటికీ కొద్దిపాటి వాతావరణం వుండే వుంటుందనీ, అందువల్లనే పచ్చటినాచు కొన్నిప్రాంతాల్లో మొలిచి... నశిస్తూ వుంటుందనీ కొందరు ఆధునిక విజ్ఞానుల భావన. ఈ విషయాన్ని ముందుగా ప్రతిపాదించిన పాశ్చాత్యుడు హెచ్.ఎమ్.జోన్స్.

అయితే ఇదే విషయాన్ని ఎన్నోవేలయేళ్ళ క్రితం మన హిందువులు గ్రహించారు. మర్మగర్భంగా ఆ విషయాన్ని పురాణాల్లో వ్రాశారు. అదే కల్పకాల లెక్క. కల్పకం అంటే ఒక గ్రహం మీద సృష్టి ఆరంభమై, తిరిగి నశించేంత వరకూ గల కాలాన్ని "కల్పకం" అంటారు. ఒక కల్పకం తరువాత కొంత కాలానికి మరో కల్పకం ఆరంభమవుతుంది. ప్రస్తుతం మనం ఉన్నది "శ్వేత వరాహకల్పకం". పురాణాల లెక్కప్రకారం ఇది రెండవకల్పకం. మరిమొదటిదైన 'ఆదివరాహకల్పకం' ఎప్పుడు ఎక్కడ జరిగినట్లు? ఎందుకంటే ఒకగ్రహంపై సృష్టి జరిగి... నశించాక, మళ్ళీ అదేగ్రహంమీద సృష్టి జరిగే అవకాశంలేదు. సౌరశక్తి తగిన పాళ్ళలో అందే మరోగ్రహం మీదనే మళ్ళీ క్రొత్త సృష్టి జరుగుతుంది.

కుజగ్రహ ఉపరితల విశేషాలను క్షుణ్ణంగా పరిశీలించిన మన

ప్రాచీనులు... ఒకానొకనాడు కుజునిపై వాతావరణం వుండేదని, జీవరాశి వుండేదనీ, పరిస్థితుల మార్పు దృష్ట్యా అక్కడసృష్టి నశించి, భూమిపై ఆరంభమయిందని గుర్తించారు. అందుకే కుజునిపై జరిగిన కల్పకానికి ఆదివరాహకల్పకం అనీ, మన ప్రస్తుత కల్పకానికి శ్వేతవరాహకల్పకం అనీ పేర్లుపెట్టారు. అయితే కుజగ్రహ జీవరాశి పూర్తి వివరాలు తెలియనందున ఆదివరాహకల్ప యుగగాథలు ఏవీ మన పురాణాల్లో వ్రాయబడలేదు. కానీ ఆ కల్పకం జరిగిందనే విషయం మాత్రం వ్రాశారు. మన కల్పకంలో మాత్రం ప్రథమ మన్వంతరం నుండీ వివరాలను పరిశోధించి పురాణాల్లో వ్రాశారు.

ఈ విధంగా కుజగ్రహ వివరాలను కూడా ముందుగా కనుగొన్నది మన హిందువులేనని ఋజువవుతుంది.

ఇంకా కుజగ్రహం నడకలు వగైరాలు బాగా లెక్కించి, వాటిని మన జ్యోతిష గ్రంథాల్లో చాల ఖచ్చితంగా వివరించారు.

గురుని గురించి:- తరువాత గ్రహం పేరు 'బృహస్పతి'. మరి ఈ 'బృహస్పతి' కి 'గురుడు' అనే పేరు ఎందుకు వచ్చిందో చూద్దాం. 'బృహస్పతి దేవతల గురువు కనుక' అని కొందరు అంటారు. అయితే మరో నిజం కూడా ఉంది. అదేమంటే... సౌరకుటుంబంలోని గ్రహాలన్నింటిలో ఈ గ్రహమే పరిమాణంలో పెద్దగ్రహం. ఈ నిజాన్ని మన ప్రాచీన హిందువులు మొదటగా కనుగొన్నారు. గురువు అంటే పెద్ద, లఘువు అంటే చిన్న... అని అర్థాలున్నాయి. ఈ గ్రహం అన్నిటికన్న పెద్దగ్రహం అని గమనించి, దీనిని గురుగ్రహం అనీ.... దేవగురువు బృహస్పతి దీనికి అదిదేవుడనీ గుర్తించారు.

ఈ గురుడిని మన ఋషులు, అపర సూర్యుడు అనీ, సూర్యుని అపరావతారం అనీ వర్ణించారు. ఎందుకంటే సూర్యుడికీ, గురుగ్రహానికీ కొన్ని పోలికలున్నాయని తమ పరిశోధనలో మన ఋషులు గమనించారు.

నిజంగానే సూర్యుడికి, గురుడికీ పోలికలున్నాయని నేటి శాస్త్రజ్ఞులు కూడా అంటున్నారు. వాటిని తెలుసుకుందాం.

1. గురుడు సౌరకుటుంబంలోని గ్రహమే అయినా, ప్రత్యేకంగా చిన్న

నక్షత్రంగా వుండదగినంత పరిమాణం గురుడికి వుందని చెబుతున్నారు.

2. సూర్యుని ఆత్మప్రదక్షిణం అంతా ఒకేమారు జరుగదు. అంటే సూర్యగోళం యొక్క ధృవప్రాంతాలు ఒకవేగంతోనూ, మధ్యభాగం మరోవేగం తోనూ తిరుగుతుంటాయి. కారణం ఏమిటంటే సూర్యగోళం ఘనపదార్థం కాదు. అదేవిధంగా గురుగ్రహం కూడా కొంతకొంత భాగాలు వేర్వేరు వేగాలతో ఆత్మభ్రమణం చేస్తాయి.

3. సూర్యునికి చాలా దూరంలోవున్న గ్రహం కనుక, దీనిపై ఉష్ణోగ్రత -200^0 (మైనస్ రెండువందల డిగ్రీలు) ఉండాలట. కానీ ఈ గ్రహం చాలా ఉష్ణంతో మంటల్ని కలిగి ఉంటుంది. అంటే ఈ గ్రహంలో స్వయం ఉష్ణోత్పత్తి వుందన్నమాట. ఆ విధంగా మామూలు గ్రహాలకు వుండదు. సూర్యుడికే స్వయం ఉష్ణోత్పత్తి వుంది.

4. సూర్యుడి సాంద్రత, గురుడి సాంద్రత చాల తక్కువ. ఆకారంలో ఈ రెండూ కూడా భూగోళానికంటే వందల, వేలరెట్లు పెద్దసైజు కలిగి ఉన్నా... వాటి సాంద్రత మాత్రం భూమి సాంద్రత కంటే రెట్టింపు కూడా లేదట. ఎందుకంటే రెండూ వాయుగోళాలే!

5. సూర్యుడి మీద మచ్చలు వున్నట్లే, గురుడిమీద కూడా మచ్చలున్నాయట. (ఎగసిపడే మంటలే మచ్చలుగా కనిపిస్తాయి)

ఇలాంటి పోలికలను విదేశీశాస్త్రవేత్తలకంటే ఎన్నోవేల సంవత్సరాల పూర్వమే మన హిందువులు కనుగొన్నారు. కనుకనే ఈ గురుగ్రహం సూర్యుని అపరావతారం అనీ, అపరసూర్యుడనీ కీర్తించారు.

గురుగ్రహం యొక్క చలనాన్ని కూడా లెక్కలు కట్టి, జ్యోతిషగ్రంథాల్లో చేర్చారు.

అంతేకాదు. గురుడు సుమారుగా ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క సంవత్సరం చొప్పున 12 సంవత్సరాలకు ఒక రౌండు పూర్తి చేస్తాడని గుర్తించి... పుష్కరకాలం అనీ, బృహస్పతి మానం అనీ కాలమాన లెక్క ఏర్పరచారు. మరియు ఆకాశంలోని 12 రాశులకూ భరతఖండంలోని 12

పుణ్య నదులతో సంబంధం ఏర్పరచి, గురుడు యొక్కరాశి ప్రవేశకాలంలో పుణ్య పుష్కర స్నానాలను నిర్దేశించారు. అందువలన ప్రజలందరికీ గురుగ్రహనడకల విజ్ఞానం గుర్తుండిపోవడమే కాక, భరతఖండంలోని పవిత్రనదీస్నానాలతో పునీతులయ్యే అవకాశం కూడా లభించింది.

ఈ గురుగ్రహం కూడా సూర్యుడికి దగ్గరగా (సూర్యుడున్న రాశిలోకి) వెళ్ళినప్పుడు, గురుడు మనకు కనిపించడు. అదే 'గురుమౌఢ్యం'. ఈ మౌఢ్యం లెక్కలు కూడా వేసి, వాటిని పంచాంగంలో చేర్చారు ఋషులు.

శని గురించి :- మన ఋషీశ్వరులు చెప్పిన గ్రహాల్లో ఆఖరిగ్రహం 'శనిగ్రహం'. సూర్యుడికి సుమారు 90 కోట్ల మైళ్ళదూరంలోవుండి సూర్యప్రదక్షిణలు చేసే ఈ శనిగ్రహాన్ని కూడా, మన ప్రాచీనులు బాగా పరిశీలించారు. శని ఒక సూర్యప్రదక్షిణ చేయడానికి సుమారు 30 సంవత్సరాలు పడుతుంది. అంత ఎక్కువ సమయం తీసుకుంటాడు కనుకనే శనికి "మందుడు" అని పేరు పెట్టారు. ద్వాదశ రాశుల్లో శనిప్రయాణ సమయాలను లెక్కించి, శనిచారం పేరుతో జ్యోతిష గ్రంథాల్లో, పంచాంగాల్లో చేర్చారు.

శని గురించి తెలిసిన వివరాలతో శనిస్తోత్రాలు వ్రాశారు.

ఇలా మొత్తం ఏడుగ్రహాల గురించీ పరిశోధించి, ఎన్నో విజ్ఞాన విశేషాలను పురాణకథలుగా వ్రాశారు మన మహర్షులు. మనం ప్రస్తుతం కొన్ని ఉదాహరణల్ని మాత్రమే చర్చించడం జరిగింది.

ఇక హిందువులు చెప్పిన నవగ్రహాల్లో చివరిరెండు గ్రహాల విషయం చూద్దాం.

రాహువు, కేతువుల గురించి :- అసలు... రాహుకేతువులనే గ్రహాలులేనేలేవనీ, అవి ప్రాచీన హిందువుల భ్రమ అనీ, ఎక్కడా లేని గ్రహాలను పేర్కొంటూ మూర్ఖంగా పంచాగాలు, జ్యోతిషాలు, పూజలు, శాంతి హోమాలూ అంటూ హడావుడి చేస్తున్నారనీ... ఎందరో నాస్తికులు, పరమతస్థులు, విదేశీయులూ హేళనగా మాట్లాడుతుంటారు.

నిజానికి రాహువు, కేతువు అనేవి గోళాకారంలో కనిపించే గ్రహాలు కావని మన మహర్షులకు తెలుసు. రాహుకేతువులంటే రాక్షసశరీర ఖండాలనీ, సూర్యచంద్రులను మ్రింగే పాములనీ చమత్కరిస్తూ పురాణకథ వ్రాశారు వారు. అలా ఎందుకు చమత్కరించారో తెలుసుకుందాం!

రాహుకేతువులనేవి గోళాలు కావు కనుకనే, వాటిని "ఛాయాగ్రహాలు" అని చెప్పారు. మరియు నవగ్రహాల్లో రాహుకేతువులను చివరిగ్రహాలుగా లెక్కిస్తారు. నిజానికి రాహుకేతువులు గురు, శనిలకంటే దూరంలో వుండవు. అయినా వాటిని ఆఖరుగ్రహాలుగా ఎందుకు చెప్తారంటే, అవి నిజమైన సదృశగోళాలు కాదు కనుక! గోచరమయ్యే గోళాలను ముందుగా వర్ణించి, చివరిగా ఈ ఛాయాగ్రహాలను వర్ణించారు.

ఖగోళంలో చంద్రుడు తిరిగే బాట, సూర్యుడు తిరిగే మార్గం (నిజానికి సూర్యుడు తిరగడు. భూమి తిరగటం వలన అలా కనిపిస్తుంది.)... ఈ రెండూ అండాకార వృత్తాలుగా వుంటాయి. ఈ రెండు వృత్తాలూ పరస్పరం రెండుచోట్ల ఖండించుకుంటాయి. ఆ ఖండన బిందువులనే నేటి ఆధునికులు "నాడ్స (NODS)" అంటారు. వారికంటే ఎన్నోవేల ఏళ్ళముందు ఆ బిందువుల విషయం గుర్తించిన మహర్షులు... ఒక నాడ్‌కు "రాహువు" అనీ, మరో నాడ్‌కు "కేతువు" అనీ నామకరణం చేశారు. సరిగ్గా ఆ బిందువు (నాడ్) దగ్గరకు సూర్యుడు గానీ, చంద్రుడు గానీ వస్తే... దానికి గ్రహణం కలుగుతుందని గ్రహించి,'రాహుకేతువులను' పాములనీ, అవి సూర్య చంద్రులను మ్రింగుతుంటాయనీ చమత్కార పురాణకథలు వ్రాశారు.

భూమి తిరగడం వల్ల 'రవిచారం', చంద్రుడు తిరగడం వల్ల 'చంద్రచారం' కలుగుతాయి. అవి అలా తిరుగుతూ స్థానచలనం పొందటం వల్ల ఏర్పడే ఖండన బిందువులు కూడా స్థానచలనం పొందుతుంటాయి. అదే రాహుచారం, కేతుచారం అంటే!

కనిపించే గ్రహాల కదలికల్ని లెక్కగట్టడం అంతకష్టంకాదు. కానీ కళ్లకు కనిపించని, ఆకారం అంటూ లేని ఊహాబిందువుల కదలికల్ని (రాహుకేతు చారాలను) గంటలు, నిమిషాలతో సహా లెక్కించి, అవి ఏనాడు

ఎక్కడ వుంటాయో, వాటివల్ల సూర్యచంద్రుల్లో యెవరికి, యెప్పుడు, యెంత సమయం గ్రహణం కలుగుతుందో... పురాణ కాలంనాడే చెప్పగలిగిన మన హిందూమేధావుల ముందు.. దేశ, విదేశ విజ్ఞానులూ, అజ్ఞానులూ కూడా శిరస్సులు వంచి నమస్కరించవలసిందే!

నేటికి నాలుగువేల ఏళ్ళకుముందు విదేశీయులెవరికీ గ్రహణాల గూర్చి తెలియదు. ఆ తదుపరికాలంలో కూడా కేవలం సారోస్ చక్రం ఆధారంగానే గ్రహణాల లెక్కచూసేవారు. కానీ మనవారు అలాకాదు. వేదకాలంనుండీ (పైన చెప్పిన లెక్కప్రకారం) గ్రహణ విషయాల్ని లెక్కించ గలిగేవారు.

అలాగే గ్రహణసమయాల్లో మనవారు ఆచరించే ఆచారాలను మూఢవిశ్వాసాలుగా ఎందరో విమర్శిస్తూ ఉంటారు. కానీ ఆ ఆచారాల్లోని శాస్త్రీయతను, నేడు చాలమంది క్రమంగా అర్థం చేసుకుంటున్నారు. గ్రహణకాల చెడుతరంగాల నుండి రక్షించుకునేందుకు మన పూర్వ మేధావులు చెప్పిన జాగ్రత్తలు పాటించడం ఎంతయినా ఉత్తమమే!

❄❄❄❄❄❄

ఇక్కడితో హిందువుల నవగ్రహ వివరాలు పూర్తయ్యాయి. అయితే వాటి గూర్చి ఇంకా వివరంగా వ్రాయాలంటే, చాలా పెద్దగ్రంథం అయి పోతుంది. అందుకే క్లుప్తంగా ముఖ్యవిషయాలు మాత్రం ప్రస్తావించాము.

ఈ నవగ్రహాలకు అధిదేవతలు వున్నారు. ఈ గ్రహాధిదేవతలు హిందువులకు పూజనీయం. ఈ గ్రహాల అనుకూలతకోసం పూజలు, హోమాలు చేస్తారువారు. అవి నిజంగా ఫలితాన్ని ఇస్తాయా అంటే... అది అనుభవపూర్వకంగా తెలుసుకోవలసిందే!

ఈ నవగ్రహాల ఆధారంగా కాలమానాలు, పంచాంగాలు, జ్యోతిష గ్రంథాలూ కాలక్రమేణా అనేకం యేర్పడ్డాయి.

గ్రహశకలాల (యాస్టిరాయిడ్స్) గురించి :- కుజగ్రహానికీ, గురుగ్రహానికీ మధ్యలో యాస్టిరాయిడ్ బెల్ట్‌వుంది. ఈ బెల్ట్‌లో చిన్న గులకరాయి సైజునుండి పెద్దపర్వతం సైజువరకు, అనేక రకాల సైజులు

కల బండరాళ్ళవంటి అక్రమాకార వస్తువులు గుంపులు, గుంపులుగా కోట్ల సంఖ్యలో తిరుగుతూ వుంటాయి. వీటిని దూరం నుండి చూస్తే రాళ్ళతో కూర్చిన పెద్దబెల్ట్‌లాగ అనిపిస్తుంది. అదే "గ్రహశకలాల వలయం". అన్ని గ్రహాల వలెనే ఈ గ్రహశకలాలు కూడా నిరంతరం సూర్యప్రదక్షిణ చేస్తుంటాయి.

ఈ గ్రహశకలాల వలయం గూర్చి హిందువులకు తెలియదనీ... ఒకవేళ తెలిస్తే, 'వాటిని కూడా వారి పురాణాల్లో చేర్చేసే వారే!' అంటూ కొందరు హేళన చేస్తుంటారు.

అయితే మన ప్రాచీన హిందువులకు యాస్టిరాయిడ్స్ 'బెల్ట్' గురించి తెలుసోలేదో గానీ, యాస్టిరాయిడ్స్ (గ్రహశకలాల) గురించి మాత్రం తెలుసు.

అదెలా అంటే... యాస్టిరాయిడ్స్ అన్నీ కలసికట్టుగా ఒక వలయంగా తిరుగుతూ వున్నా... కొన్ని యాస్టిరాయిడ్స్ మాత్రం బెల్ట్‌లో కలవకుండా, స్వతంత్రంగా వేరే ఆర్బిట్స్‌లో సూర్యప్రదక్షిణలు చేస్తుంటాయి. అటువంటి స్వతంత్ర గ్రహశకలాలు అలా తిరుగుతూ, తిరుగుతూ ఒక్కొక్కసారి ఏదయినా పెద్దగ్రహానికి దగ్గరగా వెళ్తే ఆ గ్రహాకర్షణకు లోనై, ఆ గ్రహంపై పడిపోతాయి. అలాంటి శకలాలు అపుడప్పుడూ మన భూమికి చేరువగా కూడా వచ్చి పోతుంటాయి. అవి భూమ్యాకర్షణకు లోనై, భూమిపై పడి పోతాయేమోనని శాస్త్రజ్ఞులు భయపడుతుంటారు. అతి ప్రాచీన కాలంలో అలా కొన్ని శకలాలు భూమిపై పడ్డాయట కూడా! అలా పడితే... పది ఆటంబాంబులు ప్రేలినంత విధ్వంశం జరుగుతుంది. ఆ విధంగా ఈనాటికీ మన భూవాసులను భయపెట్టే శకలాలకు సైంటిస్టులు పేర్లు కూడా పెట్టారు. ఆధునికులు పేర్లుపెట్టిన శకలాల్లో "ఇకారస్" అనేది ముఖ్యమైనది. అది చాలసార్లు మనల్ని భయపెడుతుందట.

అలాంటి స్వతంత్ర గ్రహశకలాలను మన ప్రాచీన హిందువులు గుర్తించారు. ఆ విషయాన్ని తదుపరి తరాల ప్రజలకు అందించేందుకు ఒకపురాణకథను వ్రాసి, రామాయణంలో చేర్చాడు వాల్మీకి మహర్షి.

రామాయణం సుందరకాండలో హనుమంతుడు సాగరాన్ని

దాటుతున్నప్పుడు, సాగరం నుండి పైకి వచ్చిన "మైనాకుడు" అనబడే ఒక పర్వతం, హనుమంతుణ్ణి తనపై కాస్సేపు విశ్రాంతి తీసుకోమని కోరడం జరిగింది. "నువ్వు నాకెందుకు సాయం చేయాలనుకుంటున్నావు"? అని హనుమంతుడు అడుగగా, మైనాకుడు తన కథను చెప్పాడు.

ఆ కథ ప్రకారం చూస్తే....

"పూర్వం కొన్ని పర్వతాలకు రెక్కలుండేవి. అవి గాలిలో ఎగురుతూ వచ్చి, తమ ఇష్టం వచ్చిన చోట భూమిపై దిగేవి. అలా దిగటం వల్ల ఎన్నో ప్రాంతాల, ప్రాణుల విధ్వంశం జరిగేది. అందుకని ఇంద్రుడు కోపించి, వజ్రాయుధంతో ఆ పర్వతాల రెక్కలను తెగనరకసాగాడు. అలాంటి పర్వతాల్లో ఒక పర్వతమే ఈ మైనాకుడు. ఇంద్రుని వలన రెక్కలు తెగిన మైనాకుడు, హాహాకారాలు చేస్తూ కూలిపోతుంటే వాయుదేవుడికి జాలి కలిగి, మైనాకుణ్ణి పడిపోకుండా పట్టుకుని జాగ్రత్తగా హిందూ మహాసముద్రంలో దించాడు. ఆ కృతజ్ఞత వల్లనే వాయుకుమారుడైన హనుమకు సాయం చేయబోయాడు మైనాకుడు. అదీ విషయం! దీని అంతరార్థం తెలిసింది కదా! ఈనాడు ఒక గ్రహశకలానికి 'ఇకారస్' అని నేటివారు పేరు పెట్టినట్లే... ఆనాడు వాల్మీకి ఒకగ్రహశకలానికి మైనాకుడని పేరుపెట్టి, పురాణకథ వ్రాశాడు. (చాలా ప్రాచీన కాలంలో ఒక గ్రహశకలం భూమ్యాకర్షణకు లోనయి, హిందూమహాసముద్రంలో పడిపోయిందనీ, అలా సముద్రంలో పడిపోయినా సరే, విధ్వంశాలేవీ జరుగలేదనీ గుర్తించిన హిందూఋషి వాల్మీకి ఈ కథను మనకు అందించాడు.)

ఇకపోతే ఉల్కలు, తోకచుక్కలు, నెబ్యులాలు అన్నీ మన ప్రాచీనులకు వేదకాలం నుండీ బాగా తెలుసు. ఉల్కలను 'ఉల్కలు' గానే వ్యవహరించేవారు. తోకచుక్కలను "ధూమకేతువులు" అనేవారు. వేదాల్లోని కొన్ని మంత్రాల ఆధారంగా ఈ తోకచుక్కలను "సినీవాలి" అనే సంతాన ప్రదాయిని అయిన దేవతగా పూజించేవారని కూడా తెలుస్తుంది. నెబ్యులాలను "నీహారికలు" అనేవారు. అనేక నీహారికల వివరంకూడా వేద, పురాణేతిహాసాల్లో వుంది. ఆధునికులు చెప్తున్న హార్స్ నెబ్యులా, రింగ్‌నెబ్యులా, క్రాబ్ నెబ్యులా వంటిఎన్నో నీహారికల ప్రస్తావన మన గ్రంథాల్లో వుంది.

మన ప్రాచీన గ్రంథాలు గొప్ప విజ్ఞాన గనులు. త్రవ్వుకోగలిగితే త్రవ్విన వారికి త్రవ్వినన్ని విజ్ఞాన నిధులు లభిస్తాయి.

(గమనిక :- ప్రాచీన హిందూ ఖగోళ విజ్ఞానానికి సంబంధించి ఇంకా మరెన్నో విషయాల్ని తెలుసుకోవాలనుకుంటే మా "పురాణాల్లో సైన్సు" గ్రంథాన్ని చదవండి.)

❀❀❀

ముగింపు

మన వేదమార్గీయులు ఎంతో నాగరికత, విజ్ఞానం సాధించే నాటికి ఇతర దేశాల్లో సరైన మానవజాతులు పుట్టనేలేదు. వందలాది విజ్ఞాన విషయాల్ని మన హిందువులు, విదేశీయులకంటే వేలాది ఏళ్ళముందే కనుగొన్నారనేది సత్యం! అయినా మొండిగా 'అన్నీ విదేశీయులే కనుగొన్నారనీ, వారి నుండే భారతీయులు నేర్చుకున్నారనీ' వాదించే పరదేశీయులు, వారికి వంతపాడే కొందరు భారతీయులు మాత్రం ఇంకా పిడివాదాలు చేస్తూనే ఉన్నారు. భాష, లిపి, సంగీతం, వాయిద్యం ఒకటేమిటి? అన్నీ విదేశీయులు కనుగొన్నవే అంటారు వారు. మనం మౌనంగా ఊరుకుంటే అదీ...ఇదీ అని లేదు... చివరకు మన కాకినాడ కాజాలు, ఆత్రేయపురం పూతరేకులు, బందరులడ్డూలూ కూడా విదేశీయులే కనుగొని, మనకు నేర్పారని వాదించేంత మూర్ఖ స్థితికి వెళ్ళిపోయేలా ఉన్నారు వాళ్ళు. ఇక్కడ ఒక విచిత్ర విషయం చెబుతాం చూడండి. సుమారు పదేళ్ళ క్రిందట "వేపాకు, పసుపు క్రిమి సంహారులనీ, అవి ఔషధాల్లోకి బాగా పనిచేస్తాయనీ" తెలుసుకున్న అమెరికావారు, ఆ విషయం తామే కనుగొన్నామంటూ, వాటిపై పేటెంట్ హక్కులు తీసుకున్నారు. అదెంత విడ్డూరమో చూడండి! వేలాదియేళ్ళ క్రితం వేదాల్లో కూడా ఓషధులుగా చెప్పబడిన వేప, పసుపు, తులసి వగైరాలు వందలాది ఏళ్ళుగా మనం గృహవైద్యంలో ఉపయోగిస్తుండగా... నిన్న, మొన్న కళ్ళు తెరచిన అమెరికా వారు ఇలా చేయడం ఎంతటి దుర్మార్గమో ఆలోచించండి.

"వేదాల్లో అన్నీ వున్నాయి" అని చాలామంది విశ్వాసం! ఆ సంగతి

ఎలా ఉన్నా, "అన్నీ కాకపోయినా, ఎన్నో ఉన్నాయి" అనేమాట మాత్రం నిజం!! వేదాల్లో ఎన్ని వున్నాయంటే, నేటి ఆధునికులు కనుగొన్నవాటి సంఖ్యకంటే ఎక్కువే వున్నాయి. మనకు ప్రస్తుతం 1% వేదమే లభిస్తుంది. పూర్తిగా లభించి ఉంటే... ప్రపంచంలో ఎవరూ అందుకోలేనంత విజ్ఞానం మన స్వంతమై ఉండేది. మిగతా 99% వేదం కూడా లభించిఉంటే... మన వేద ప్రాచీనతకు లక్షల ఏళ్ళ ఋజువు దొరికేది. "వేదాలు ఏమంత ప్రాచీనం కాదనీ, వేదాల్లో ఏమంత గొప్ప విషయాలు లేవనే మూర్ఖులకు చెంపపెట్టుగా ఉండేది.

"విదేశీయులు కనుగొనేవన్నీ మా వేదాల్లో ఏనాడో వ్రాయబడి ఉన్నాయని మనం అంటుంటామని" వేళాకోళాలు చేసే బుద్ధిహీనులు అప్పుడప్పుడూ మనకు తారసపడుతుంటారు. వారికిదే మా సమాధానం. ఎవరో కనుగొన్నదాన్ని మేమే కనుగొన్నాం అని చెప్పుకునే "అల్ప సంస్కృతి" కాదు మనది. ఆ అలవాటు విదేశీయులదే! 'వేదమార్గీయులు కరెంటును గురించి తెలుసుకున్నారనీ, అయితే ఎందువల్లనో దానిపై దృష్టిసారించలేదనీ' చెబుతాం. అంతేగాని... కరెంటుబల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్లు, మోటార్లు, ఇస్త్రీపెట్టెలు, ఓవెన్లు, ఫ్రిజ్‌లు, స్టవ్‌లు, టి.వి.లు, కాలిక్యులేటర్లు, సి.డి.లు, డి.వి.డి.లు, పెన్‌డ్రైవ్‌లు, సినిమాలు, కెమేరాలు, ఏ.సి.లు, వాషింగ్‌మెషీన్లు, రోబోట్లు మొదలయినవన్నీ మా వేదాల్లో ఉన్నాయని మనం చెప్పలేదు కదా! సహజవాయువు, పెట్రోలు గూర్చి మన ఋషులకు తెలుసు అన్నాం. అంతే గాని... మోటరుసైకిళ్ళు, కార్లు, బస్సులు, ఆటోలు, మెట్రోరైళ్ళు, జలాంతర్గాములు... ఋషులకు తెలుసని చెప్పామా? నేలబొగ్గు గూర్చి కపిలమహర్షికి తెలుసని అన్నాం. అంతేగాని... రైలుబండిని మహర్షులే కనుగొన్నారని అనలేదు కదా! దేవ విమానాలు, రాకెట్ ప్రయోగం వేద ఋషులకు తెలుసు అన్నాం. అంతేగాని... మహర్షులు ఉపగ్రహాల్ని పంపించేవారని చెప్పలేదు కదా! నౌకాయానం, నౌకానిర్మాణం తెలుసు అన్నాం. అంతేగాని... విమానాల్ని మోసుకెళ్ళే ఓడలు, యుద్ధటాంకులూ తెలుసని అనలేదుకదా! బంగారం, వెండి... మొదలగు ఎన్నో లోహాలు వేదకాలంలోనే ఉన్నాయని చెప్పాం. అంతేకాని... ఆ కాలానికి తెలియని

ప్లాటినం గురించి ఏమైనా చెప్పామా? టేప్‌రికార్డర్లు, గ్రామ్‌ఫోను లాంటివి పతంజలి తయారుచేశాడన్నాం. అంతేగానీ... టైప్‌రైటరు, సెల్‌ఫోను, జెరాక్సు, కంప్యూటరు, ఇంటర్‌నెట్ తెలుసని చెప్పలేదు కదా! చరకుడు, శుశ్రుతుడు, జీవకుడు మొదలైనవారి వైద్యవిధానాల గురించి చెప్పాం గానీ... ఆనాడే ఎక్స్‌రేలు, స్కేనింగ్‌లు, రేడియేషన్ ఏర్పాట్లు, ఎండోస్కోపీలు, నానోటెక్నాలజీ మొదలైనవి ఉన్నాయని చెప్పలేదు కదా! ఇలా ఏదయినా నిజంగా మన ప్రాచీన హిందూ మేధావులకు తెలిసింది ఉంటే... ఉందని చెపుతాం. మనవారు నిజంగా కనిపెట్టినవి ఉంటే... కనుగొన్నారని చెబుతాం. అంతేకాని, లేని గొప్పలు యేనాడూ చెప్పలేదు. చెప్పుకోవలసిన అగత్యం కూడా మనకు లేదు. ఇంకా విదేశీయులే.... ఏనాడో హిందువులు కనుగొన్న వాటన్నింటినీ "తామే సాధించామని" బొంకుతూ, తప్పుడు చరిత్రలు సృష్టించారు.

చివరిగా మన భారతీయులకొక మాట!

ఏ మతగ్రంథాల మాటా ఏమో గానీ... హిందూ మేధావులందించిన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, తదితర గ్రంథాలన్నీ కూడా ఒక గొప్ప విశిష్టతను కలిగిఉన్నాయి. అవి మన భరతఖండం యొక్క ప్రాచీనవైభవాన్నీ, ప్రాచీన విజ్ఞానాన్నీ, పవిత్రతనూ ఎలుగెత్తి చాటుతున్నాయి. అందువల్ల భారతీయులందరూ మత భేదాలను ప్రక్కనుంచి, మన దేశప్రతిష్టను ఇనుమడింపజేసే కృషి చెయ్యాలి. అందరూ ఈ సందర్భంగా తెలుసుకోవలసింది ఏమంటే... "మన భరతఖండ ఖ్యాతిని ఎలుగెత్తి చాటుతున్నవి... కేవలం మన హిందూగ్రంథాలు మాత్రమే!" అని.

ఇందుకు మన భారతీయులమందరం గర్వించాలి. భారతీయతకు జై కొట్టాలి!! హిందూత్వం యొక్క ఔన్నత్యానికి, భక్తితో సృష్టి యావత్తూ శిరస్సు వంచాలి.

" జైహింద్."